బుధవారం
30•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 83
• పేజీలు : 16 + 24 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD


మంగళవారం ప్రగతి భవన్‌లో వ్యవసాయం, నీటిపారుదల, మిషన్ భగీరథ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సంయుక్త సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్

నీటి వినియోగ ప్రణాళిక

రాష్ట్రం యూనిట్‌గా అవసరాలు తీర్చాలి
డ్రింకింగ్ వాటర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ.. వాటర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ ఏర్పర్చాలి

- భూ రికార్డుల ప్రక్షాళన పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం
- మండలానికో రిజిస్ట్రేషన్ కార్యాలయం.. ఐటీ అధికారి
- హైదరాబాద్ తాగునీటికి సింగూరు జలాలు
- సాగర్ నుంచి అక్కంపల్లిద్వారా నల్లగొండకు
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్
- కలెక్టర్లు, వ్యవసాయాధికారులతో రేపు వేర్వేరుగా భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రం యూనిట్‌గా నీటి వినియోగం ఉండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులకు స్పష్టంచేశారు. ఈ మేరకు కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ రెండు నదుల నీటితో సాగు, తాగునీటి అవసరాలతోపాటు పరిశ్రమలకు, విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన నీటి అవసరాలను తీర్చుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఆపరేషనల్ మాన్యువల్స్ (నీటి వినియోగ ప్రణాళికలు) రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టు ద్వారా ఏ ప్రాంతం నుంచి ఎన్ని నీళ్లు మిషన్ భగీరథకు ఉపయోగిస్తారో మదింపు చేయాలన్నారు. తెలంగాణ సమస్త ప్రజల అవసరాలను తీర్చడం కోసం 'డ్రింకింగ్ వాటర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ'ను, సాగునీటి ప్రాజెక్టులనుంచి ఏ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి ఎన్ని నీళ్లు కావాలో లెక్కలు వేసి, వాటి వినియోగానికి 'పవర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ'ను ఏర్పాటుచేయాలని కోరారు. ఇప్పుడున్న నీటి లభ్యతనుబట్టి వచ్చే జూలై వరకు ఆచరించే విధంగా నీటి ప్రణాళిక ఉండాలని, కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తరువాత శాశ్వత నీటి ప్రణాళిక ఉండేలా

మిగతా 2వ పేజీలో

గోదావరి నీళ్లు గంగపాలు

మూడునెలల్లో 553 టీఎంసీలు సముద్రంలోకి
రోజుకు ఆరు టీఎంసీల జలాలు వృథా

- ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో 11573 క్యూసెక్కులే..
- పేరూరు వద్ద 1.42 లక్షల క్యూసెక్కుల ఉరుకలు
- మొత్తంగా సముద్రంలోకి 1.78 లక్షల క్యూసెక్కులు
- ప్రాజెక్టులు లేక.. కొరగాకుండా పోతున్న నీరు

- కృష్ణా బేసిన్‌లో పూర్తిగా భిన్న పరిస్థితులు
- చుక్కనీరు లేని శ్రీశైలం, నాగార్జునసాగర్
- అయినా కృష్ణాడెల్టాలో 50 టీఎంసీల వినియోగం
- పట్టిసీమతో గోదావరిని ఎత్తిపోసుకుంటున్న ఏపీ
- కాళేశ్వరంతో సమూలంగా మారిపోనున్న పరిస్థితి
- తెలంగాణ బీడు భూములకు గోదావరి జలాలు
- మహాసంకల్పాన్ని ఆటంకపరుస్తున్న ప్రతిపక్షాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సమైక్య పాలకులు గోదావరిపై గొప్పగా కట్టామని చెప్పే శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కేవలం 11,573 క్యూసెక్కులు! అదే గోదావరి నదిలో దిగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా పేరూరు వద్ద ప్రవాహం అక్షరాలా లక్షా నలభైరెండు వేల క్యూసెక్కులు.. అదీ 74.51 మీటర్ల ఎత్తులో! మరి ఈ నీరంతా ఎటు పోతున్నది? ఒడిసిపట్టేందుకు ప్రాజెక్టులు లేక.. సముద్రానికి చేరుకుంటున్నది! మధ్యలో కలిసే ఉపనదుల నీటితో కలుపుకొంటే.. మొత్తంగా 1.78 లక్షల క్యూసెక్కులు! రోజుకు 6.14 టీఎంసీల చొప్పున.. ఈ ఏడాది నీటి సంవత్సరంలో ఇప్పటివరకు సముద్రానికి అర్పితమయ్యింది 553.055 టీఎంసీలు! గతేడాది లెక్క చూస్తే.. 2896.05 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయింది! విశేషం ఏమిటంటే.. రెండు రాష్ట్రాల్లోని గోదావరి, కృష్ణానదిపై ఉన్న భారీ ప్రాజెక్టుల మొత్తం నిల్వ సామర్థ్యం 779 టీఎంసీలు! అంటే రెండు రాష్ట్రాల నిల్వ సామర్థ్యాన్ని మించి.. దాదాపు రెండు వేల టీఎంసీలు గత ఒక్క సంవత్సరమే సముద్రం పాలయ్యాయన్నమాట! గోదావరిపై ఎస్సారెస్పీ తర్వాత ఒక్కటంటే ఒక్కటీ గట్టి ప్రాజెక్టు లేని దుస్థితి కారణంగా వేల టీఎంసీల జలాలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. మరి గోదావరిపై పకడ్బందీ ప్రాజెక్టు ఉంటే? సముద్రం పాలయ్యే నీటిలో కనీసం సగం నీటిని మళ్లించినా యావత్ తెలంగాణ సస్యశ్యామలమై బంగారు పంటలను పండిస్తుంది! కానీ.. సమైక్య పాలకులు ఈ విషయంపై దృష్టిసారించలేదు. వచ్చిన నీరు వచ్చినట్టే నేరుగా ధవళేశ్వరం బరాజ్‌కు చేరుకోవాలన్న దురాశతో తెలంగాణను ఎండబెట్టారు! ఇటువంటి విషాదకర పరిస్థితిని సమూలంగా మార్చివేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్నది! వచ్చే ఏడాది నుంచి నీటి వృథా అన్న మాట లేకుండాచేసి.. సముద్రంలోకి పోతున్న నీటికి నడక నేర్పి.. ఎస్సారెస్పీని నింపడంతోపాటు.. చెరువులకు పారించి.. బీడు భూములకు మళ్లించనుంది! ఇంతటి మహాయజ్ఞానికి సహకరించాల్సింది పోయి.. కొన్ని ప్రతిపక్షాలు

మిగతా 2వ పేజీలో

పలు జిల్లాల్లో వానలు

కొనసాగుతున్న అల్పపీడనం
నేడు భారీ వర్ష సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి కొనసాగుతుండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, సంగారెడ్డి మేడ్చల్, ఖమ్మం, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో వర్షం కురిసింది. బుధవారం తెలంగాణ వ్యాప్తంగా చాలాచోట్ల ఓ మోస్తరు వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. నైరుతి మధ్యప్రదేశ్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నదని, అది రానున్న 24 గంటల్లో గుజరాత్ పరిసర ప్రాంతాల వైపు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో గురువారం నుంచి వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుతుందని, భారీ వర్షాలేవీ ఉండబోవని వివరించారు. సోమవారం ఉదయం 8.30 గంటల

మిగతా 11వ పేజీలో


నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని చుక్కాయపల్లి చెరువు అలుగుపారుతున్న దృశ్యం


మంగళవారం భారీ వర్షాలకు ముంబైలోని దాదర్‌లో జలమయమైన రహదారిపై ప్రజల పాట్లు

ముంబై మునక

ముంచెత్తుతున్న వర్షాలు.. స్తంభించిన జనజీవనం

ముంబై మహానగరాన్ని వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి తెరిపినివ్వకుండా అతి భారీ స్థాయిలో వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రైలు, రోడ్డు మార్గాలు స్తంభించిపోయాయి. విమానాల రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో రైలు పట్టాలు నీట మునగడంతో ముంబైకి జీవనాడిగా చెప్పుకొనే సబర్బన్ రైళ్లను కొన్ని గంటలపాటు నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాలలో 126 మిల్లీమీటర్ల నుంచి 200 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. ఇది సగటు వర్షపాతం కంటే తొమ్మిది రెట్లు అధికమని వాతావరణ విభాగం తెలిపింది. రోడ్లపై నడుములోతు వరకు నీరు చేరడంతో ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. వర్షానికి తోడు సముద్రం కూడా పోటెత్తడంతో అలలు మూడున్నర మీటర్ల ఎత్తున ఎగిసిపడుతున్నాయి. మరో 48 గంటలపాటు ఇదే స్థాయిలో వర్షాలు పడుతాయని వాతావరణ విభాగం హెచ్చరించడంతో విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించారు. ముంబైతోపాటు మహారాష్ట్ర అంతటా కురుస్తున్న వర్షాలపై ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో మాట్లాడారు. కేంద్రం నుంచి అవసరమైన సాయాన్ని అందిస్తామని తెలిపారు.

5


ముంబైలో మోకాళ్లలోతు నీళ్లలో భయం భయంగా ఇంటికి వెళ్తున్న స్కూలు పిల్లలు

కొత్త విద్యాసంవత్సరం జూన్ 1 నుంచే

- ఏప్రిల్ 13 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు
- జనవరి 31లోగా ఎస్సెస్సీ సిలబస్ పూర్తి
- బడి వేళల్లో మార్పులు లేవు
- జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబురాలు

3

ఆ కండ్లు ఆరని దీపాలు!

నేత్రదానానికి రంగారెడ్డి జిల్లాలోని ఆ మూడు ఊళ్ల ప్రజలంతా సై
చనిపోయినా ఇద్దరికి చూపునివ్వాలన్న ఆదర్శం
అవగాహన కలిగిస్తే ముందుకొచ్చిన ప్రజలు
అవయవ దానంపైనా చైతన్యానికి యత్నాలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, చేవెళ్ల - నమస్తే తెలంగాణ:

ఆ పల్లెలో కావలి చంద్రయ్య పుట్టుకతో అంధుడు. అతని కష్టం అంతాఇంతా కాదు. అయినా.. ఎవరి సాయం లేకుండానే ఏదో ఒక పని చేసేవాడు. మూడు కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి నడుచుకుంటూ వెళ్లేవాడు. రాత్రీపగలు తేడా లేదు. ఎప్పుడైనా సులువుగా వెళ్లొచ్చేవాడు. అతడికే చూపు ఉంటే! ఆ ఆలోచన.. ఆ పల్లెనే మార్చివేసింది! ఊరి జనాన్ని ఒక్కటి చేసింది. చనిపోయిన తర్వాత కండ్లను బూడిద కానీయకుండా.. అంధుల జీవితాల్లో దీపాలుగా మార్చాలని ఊరు ఊరంతా నిశ్చయించుకుంది. వారిలో అక్షరాస్యులే కాదు.. లోకం పోకడ తెలియని సామాన్యులు.. కూలీనాలి చేసుకునేవారూ


మిగతా 11వ పేజీలో




7 సెప్టెంబర్ 2010

కండ్లు దానం చేస్తామంటూ మూడు బస్సుల్లో దేవుని ఎర్రవల్లి వాసులు సరోజినీదేవి హాస్పిటల్‌కు వెళ్లి నేత్రదాన పత్రాలపై సంతకాలు చేశారు. అప్పటి నుంచి ఈ ఏడేండ్లలో చనిపోయిన 19 మంది తమ కండ్లను దానంచేశారు. 38 మంది అంధులకు వెలుగును ప్రసాదించారు!

దేవుని ఎర్రవల్లి నింపిన స్ఫూర్తి..
అదే మండలంలోని ఇక్కారెడ్డిగూడ, షాబాద్ మండలం ఎర్రోనిగూడ ప్రజలకు మార్గదర్శకంగా నిలిచింది.


దేవుని ఎర్రవల్లి గ్రామం

మా పాప స్ఫూర్తి కావాలి
మా పాప రిత్విక తీవ్ర జ్వరం వచ్చి చనిపోయింది. నాలుగేండ్ల పాప దూరమవడంతో ఎంతో బాధపడ్డం. కానీ ఇద్దరికి చూపు ఇచ్చేందుకు కండ్లు దానం చేసినం. మా పాప కండ్లు ఇంకా బతికే ఉన్నయ్.


- రమేశ్ శనగండ్ల, ఇక్కారెడ్డిగూడ

గ్రామం	జనాభా	అంగీకార పత్రాలిచ్చినవారు	కండ్లు దానం చేసినవారు
దేవునిఎర్రవల్లి	2250	2250	19
ఇక్కారెడ్డిగూడ	488	488	6
ఎర్రోనిగూడ	385	385	-

పెసర్లను సెప్టెంబర్ 1 నుంచే కొనాలి

కేంద్రానికి మంత్రి హరీశ్‌రావు వినతి
కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్‌కు లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



సెంట్రల్ నోడల్ ఏజెన్సీ ద్వారా 2017-18 వానకాలంలో కొనుగోలు చేసే పెసర్లకు కనీస మద్దతు ధర పథకాన్ని సెప్టెంబర్ 1 నుంచి అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రి టీ హరీశ్‌రావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు లేఖ రాశారు. తెలంగాణలో ఈ ఏడాది 0.89 లక్షల హెక్టార్లలో రైతులు పెసర పంట వేశారని, దీంతో పెద్దఎత్తున దిగుబడి వస్తుందని తెలిపారు. ఎకరానికి 9 క్వింటాళ్ల చొప్పున దాదాపు లక్ష టన్నుల దిగుబడి రావచ్చునని అంచనా వేస్తున్నట్టు పేర్కొన్నారు. వానకాలంలో వేసే పెసరపంటను రైతులు ఆగస్టు రెండోవారంలో కోతకోసి నూర్పి సెప్టెంబర్‌లో మార్కెట్లో విక్రయిస్తారు. కానీ సెంట్రల్ నోడల్ ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేసే పెసర్లకు కేంద్రం అక్టోబర్ 1 నుంచి మద్దతు ధరను అమలు చేస్తున్నది. ఆ లోగానే రైతులు పంట మొత్తాన్ని విక్రయిస్తారు. కాబట్టి కనీస మద్దతు ధర లభించక నష్టపోతున్నారని మంత్రి హరీశ్‌రావు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2016-17లో రైతులకు మార్కెట్లో పెసర్లకు క్వింటాల్‌కు రూ.3,011 నుంచి రూ.4,969 వరకు మాత్రమే ధర లభించగా, కనీస మద్దతు ధర పథకం కింద సెంట్రల్

మిగతా 11వ పేజీలో






మహారాష్ట్రలోని వసింద్, ఆసాన్‌గావ్ రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం పట్టాలు తప్పిన దురంతో ఎక్స్‌ప్రెస్

పట్టాలు తప్పిన దురంతో

కొండచరియ విరిగిపడటంతో
నేలపై ఒరిగిన 9 ఎక్స్‌ప్రెస్ బోగీలు
ప్రయాణికులు సురక్షితం!
పది రోజుల వ్యవధిలో నాలుగో రైలు ప్రమాదం

5

బ్రిక్స్ సదస్సు కోసం చైనాకు మోదీ

సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు సమావేశాలు

సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు చైనాలోని షియామెన్‌లో జరుగనున్న బ్రిక్స్ శిఖరాగ్రసదస్సుకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్నారు. 73 రోజులుగా కొనసాగిన డోక్లాం ప్రతిష్టంభన ముగిసిన నేపథ్యంలో ప్రధాని పర్యటన ప్రాధాన్యం సంతరించుకొంది. కాగా డోక్లాం ప్రతిష్టంభన నుంచి పాఠాలు నేర్చుకోవాలని తాము భారత్‌కు గుర్తుచేస్తున్నామంటూ తాజాగా చైనా బీరాలు పోయింది.

వివరాలు 5వ పేజీలో

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు
మార్గదర్శకాలు

ఒకటి రెండురోజుల్లో విడుదల

ఫైల్‌పై సంతకం చేసిన సీఎం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. ఒకటి రెండురోజుల్లో వీటిని విడుదల చేయనున్నట్టు తెలిసింది. ఎస్సీ, ఎస్టీల సమగ్రాభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చిన సర్కారు, ఆ నిధుల పక్కా వినియోగం కోసం రాష్ట్ర, జిల్లాస్థాయి నోడల్ ఏజెన్సీల ఏర్పాటుతో గైడ్‌లైన్స్‌ను రూపొందించింది. నిధులు ఖర్చు చేయకపోతే అధికారిపై చర్యలు తీసుకునేలా వీటిని రూపొందించినట్లు తెలిసింది. మార్గదర్శకాల ఫైల్‌పై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సంతకం చేశారు. మార్గదర్శకాలు విడుదలైతే.. ఏ స్థాయి అధికారులు ఏం చేయాలి? ప్రజాప్రతినిధులు ఎలా పర్యవేక్షించాలన్న దానిపై స్పష్టత రానున్నది. ప్రజాప్రతినిధులతో రాష్ట్రస్థాయి కౌన్సిల్, జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కౌన్సిళ్లు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమిషన్లకు కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమిషన్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నది. ఆయా వర్గాల పరిస్థితులపై అధ్యయనం చేసి, వారి అభివృద్ధికి బాటలు వేయాలని నిర్ణయించింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో.. కమిషన్ల చైర్మన్లు, సభ్యులకు ఉండాల్సిన అర్హతలు, కమిషన్ పనివిధానం తదితర అంశాలతో ఉన్నతాధికారులు ఫైల్‌ను రూపొందించారు. దీన్ని సీఎం కార్యాలయానికి పంపించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి ఆమోదం తెలిపాక కమిషన్లను నియమించనున్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లలో చైర్మన్లతోపాటు ఐదుగురు సభ్యులు ఉంటారని సమాచారం.

నేడు రెండోవిడుత చేపపిల్లల పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ రెండోవిడుత కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా సింగూరులో బుధవారం రాష్ట్ర మత్స్యశాఖమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చేపపిల్లల పంపిణీ చేపట్టేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది 77 జలాశయాలు, 4,647 మత్స్యశాఖ చెరువులు, 20,391 గ్రామ పంచాయతీ చెరువుల్లో 70 కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు పాల్గొనాలని కోరుతూ మంత్రి తలసాని మంగళవారం లేఖ రాశారు.

పోచంపాడులో ‘ ఫిష్‌బ్రూడ్ బ్యాంక్ ’

రాష్ట్రంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో నిజామాబాద్ జిల్లా పోచంపాడు వద్ద ‘ఫిష్ బ్రూడ్ బ్యాంక్’ ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ ప్రణాళిక సిద్ధంచేసింది. రూ.2.50 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు డిజైన్‌కు ఇప్పటికే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు పనుల టెండర్లు పిలిచేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తున్నది.

ముహూర్తం



సూర్యోదయం: 6.05 గంటలకు



సూర్యాస్తమయం: 6.28 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, అష్టమి తె. 2.55 వరకు, తదుపరి నవమి. నక్షత్రం: జ్యేష్ఠ. అమృత ఘడియలు: సాయంత్రం 4.02 నుంచి 5.38 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.16 నుంచి 1.49 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.52 నుంచి 12.41 వరకు, వర్జ్యం: తె. 5.15 నుంచి 6.51 వరకు.

లోకం పోకడ



వార్తలు చదువుతున్నది పన్నీరు సెల్వం, పళని స్వామి.. పార్టీ నుంచి నిన్ను బహిష్కరిస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం.. ఈ టీవీలో మీ వార్తలు ఇంతటితో సమాప్తం!



మంగళవారం ప్రగతిభవన్‌లో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ ఎస్పీ సింగ్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

రేపు కలెక్టర్ల కాన్ఫరెన్స్

భూ రికార్డుల ప్రక్షాళనకు క్షేత్రస్థాయిలో జరుగాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశం చేసేందుకు గురువారం జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రగతిభవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశం రోజంతా కొనసాగుతుంది. సెప్టెంబర్ ఒకటి నుంచి రైతు సమన్వయ కమిటీల నియామకం జరుగాలని, సెప్టెంబర్ 15 నుంచి రికార్డుల పరిశీలన ప్రారంభించాలని సీఎం చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళన, రికార్డుల నిర్వహణ, పట్టాదార్ పాసుపుస్తకాల్లో మార్పులు, పహాణీల్లో మార్పులు, రిజిస్ట్రేషన్లలో సంస్కరణలు తదితరాలపై విధివిధానాలకు తుదిరూపం ఇచ్చి కలెక్టర్ల సమావేశంలో వెల్లడించాలని సూచించారు.

జయశంకర్ వర్సిటీలో వ్యవసాయాధికారుల సమావేశం

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయాధికారుల సమావేశం గురువారం జరుగుతుంది. భూ రికార్డుల ప్రక్షాళన, రైతు సంఘాలు, రైతు సమన్వయ సమితుల నిర్మాణం, రైతు వేదికల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు. సీఎం కేసీఆర్ ప్రారంభోపన్యాసం చేస్తారు.

నీటి వినియోగ ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి...

రూపొందించాలని అధికారులను కోరారు. భూముల రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్ట్రార్లు లేని మండలాల్లో తహసీల్దార్లకే రిజిస్ట్రార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ జరిగినరోజే మ్యుటేషన్ కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అధికారుల నియామకానికి వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూమి రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి గురువారం ప్రగతిభవన్‌లో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. అదేరోజు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయంలో వ్యవసాయాధికారులతో సమావేశం ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో తాను ప్రారంభోపన్యాసం చేసిన తరువాత కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి వ్యవసాయశాఖకు ప్రత్యేక బడ్జెట్ ఉంటుందని ఈ సందర్భంగా ప్రకటించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సింగూరు జలాలను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నల్లగొండ తాగునీటి అవసరాలకు నాగార్జునసాగర్ నుంచి అక్కంపల్లి ద్వారా నీటిని అందించాలని చెప్పారు. వ్యవసాయం, నీటిపారుదల, మిషన్ భగీరథ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సంయుక్త సమీక్షా సమావేశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించారు. గోదావరి, కృష్ణా నదులద్వారా అందుబాటులోకి వచ్చే జలాలను మంచినీరు, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక అవసరాలకోసం సమర్థంగా వాడుకునే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

మంచినీటికి అధిక ప్రాధాన్యం

‘ప్రాజెక్టుల నీటిలో మంచినీటికి అధిక ప్రాధాన్యమిస్తాం. ఇందుకోసం అన్ని రిజర్వాయర్లలో 10% నీటిని మంచినీటికి రిజర్వు చేశాం. ఆ నీటిని సమర్థంగా వాడుకోవాలి. వచ్చే ఏడాదినాటికి కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు అందుబాటులోకి వస్తాయి. కాళేశ్వరం ద్వారా పాత వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతోపాటు హైదరాబాద్ నగరానికి తాగునీరు అందుతుంది. కాబట్టి మిషన్ భగీరథ అధికారులు రెండు రకాల ప్రణాళికలను సిద్ధంచేసుకోవాలి. ఇప్పుడున్న నీటి లభ్యత, వనరులను బట్టి వచ్చే ఏడాది జూలై నాటికి ఉండే పరిస్థితిని అంచనా వేసి ప్రణాళిక సిద్ధంచేయాలి. కాళేశ్వరం నీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత శాశ్వత ప్రణాళిక వేసుకోవాలి. హైదరాబాద్‌తోపాటు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలవారీగా లెక్కలు వేసుకుని, ఎన్ని నీళ్లు కావాలో అన్ని నీళ్లు తీసుకుని మంచినీరుగా అందివ్వాలి’ అని సీఎం సూచించారు.

త్వరితగతిన హైదరాబాద్ శివార్లలో రెండు రిజర్వాయర్ల నిర్మాణం

హైదరాబాద్ మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారాలుగా రెండు రిజర్వాయర్లు నిర్మించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఒకదాన్ని కాళేశ్వరంద్వారా వచ్చే గోదావరి నీటితో, రెండోదాన్ని కృష్ణా నది జలాలతో నింపాలని అన్నారు. ప్రస్తుతమున్న హిమాయత్‌సాగర్, గండిపేట చెరువుల సామర్థ్యం చాలా తక్కువని, అవి నగర అవసరాలు తీర్చలేవని సీఎం చెప్పారు. కరువు వచ్చినా, నదీ జలాలు అందుబాటులో లేకున్నా సరే, హైదరాబాద్ నగరవాసులు ఇబ్బంది పడకుండా ఉండాలంటే త్వరితగతిన రిజర్వాయర్లు నిర్మాణం కావాలని చెప్పారు.

మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రతి మండలానికి ఒక రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుచేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాలు, రిజిస్ట్రార్లను యథాతథంగా కొనసాగిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయాలు లేని మండలాల్లో కొత్తవి నెలకొల్పాలన్నారు. కొత్తగా ఏర్పాటుచేసే రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రార్లుగా తహసీల్దార్లకే అదనపు బాధ్యతలు అప్పగించాలన్నారు. అవినీతికి, జాప్యానికి ఏ మాత్రం అవకాశంలేకుండా రిజిస్ట్రేషన్ విభాగంలో పెద్దఎత్తున సంస్కరణలు అమలుచేస్తున్నట్టు సీఎం తెలిపారు. మండల స్థాయిలోనే రిజిస్ట్రార్ కార్యాలయం ఉండటంవల్ల ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు.

ప్రాజెక్టులవారీగా ఆపరేషనల్ మాన్యువల్స్

‘గోదావరి, కృష్ణానదులపై అనేక ప్రాజెక్టులు కడుతున్నాం. ఈ రెండు నదుల నీటితో రైతులకు సాగునీరు అందించడంతోపాటు మంచినీరు, పరిశ్రమలకు, విద్యుత్ ఉత్పత్తికి నీరు సరఫరాచేస్తున్నాం. ఈ నేపథ్యంలో తెలంగాణలోని ప్రాజెక్టులవారీగా కొత్త ఆపరేషనల్ మాన్యువల్స్ తయారుచేయాలి. ప్రాజెక్టునుంచి సాగునీటికి ఎంత ఇవ్వాలి? మంచినీటికి ఎంత ఇవ్వాలి? విద్యుత్ కేంద్రాలకు, పరిశ్రమలకు ఎంత నీరు ఇవ్వాలి? అనే విషయాల్లో స్పష్టత ఉండాలి. ప్రాజెక్టుల్లో నీరు చేరినదాన్నిబట్టి కూడా ప్రాధాన్యాలను నిర్ణయించి నీటిని విడుదలచేయాలి. దీనికోసం ప్రత్యేక విధానం అమలుపరుచాలి. కొత్త ఆపరేషనల్ మాన్యువల్స్ వెంటనే తయారుచేయాలి. నీటి విడుదలకు సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్ర రాజధాని నుంచి వచ్చే సూచనలు, ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మిషన్ భగీరథ అధికారులు కూడా ఏ ప్రాజెక్టునుంచి ఎన్ని నీళ్లు తీసుకుంటున్నాం? ఏయే ప్రాంతాలకు ఎక్కడి నుంచి నీరు సరఫరా చేస్తున్నాం? అనే విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. సాగునీటి ప్రాజెక్టులనుంచి వాడుకునే నీటికి సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని బట్టి వ్యవహరించేందుకు ‘డ్రింకింగ్ వాటర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ’ను నెలకొల్పాలి. ఇదే విధంగా ‘పవర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ’ను కూడా ఏర్పాటుచేయాలి. వారు కూడా ఏ ప్రాజెక్టు నుంచి ఏ విద్యుత్ కేంద్రానికి ఎన్ని నీళ్లు కావాలో? అవి ఎలా పొందాలో? స్పష్టమైన అంచనాకు రావాలి. పరిశ్రమలకు కూడా ఇదే విధమైన ఏర్పాటు ఉండాలి’ అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ మేరకు నీటిపారుదల, మిషన్ భగీరథ, విద్యుత్, పరిశ్రమల శాఖల అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటుచేసుకుని, నదీ జలాల వాడకంపై అవగాహనకు రావాలని సీఎం ఆదేశించారు.

రిజిస్ట్రేషన్ రోజే మ్యుటేషన్

కోర్ బ్యాంకింగ్ విధానంలాగానే ఇకపై భూముల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాల వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవుతాయని సీఎం కేసీఆర్ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డుల నిర్వహణ కోసం, కోర్ బ్యాంకింగ్ తరహాలో భూముల క్రయవిక్రయాల వివరాల నమోదుకు వెయ్యి మంది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అధికారులను నియమించాలని ఆయన ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయినరోజే మ్యుటేషన్ కూడా పూర్తికావాలన్నారు.

భూవివాదాల పరిష్కారానికి ఇకనుంచి కలెక్టర్ కోర్టు ఒక్కటే

‘గతంలో భూమి శిస్తు వసూలుచేసేవారు. దానికి అనుగుణంగా పహాణీలు తయారుచేశారు. కానీ ఇప్పుడు భూమి శిస్తు వసూలుచేయడం లేదు. పైగా ప్రభుత్వమే ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి ఇస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం పహాణీలో ఉన్న 31 కాలమ్స్ అవసరం ఉందా? లేదా? అనే ఆలోచన చేయాలి. కేవలం రైతుల ఖాతాల వివరాలు మాత్రమే ఉంచి, మిగతావి తొలిగిస్తే సరళంగా ఉంటుంది. గ్రామాలవారీగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, అటవీ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములు, ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న భూముల రికార్డులను ప్రత్యేకంగా నిర్వహించాలి. భూ వివాదాలకు సంబంధించి కూడా ఇన్ని కోర్టులు అవసరం లేదు. కలెక్టర్ కోర్టు ఒక్కటే ఉండాలి. మిగతావి రద్దుచేయాలి. పట్టాదారు పాసుపుస్తకాల్లో, పహాణీల్లో వాడే భాష సరళంగా, అందరికీ అర్థమయ్యేలా ఉండాలి. అర్థంకాని పదాలకు బదులు అందరికీ అర్థమయ్యే తెలుగు భాషను వాడాలి. పహాణీలను కంప్యూటర్‌లో డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండాలి. వచ్చే ఆర్థికసంవత్సరం నుంచి వ్యవసాయ శాఖకు ప్రత్యేక బడ్జెట్ రూపొందిస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి, విధి విధానాలు ఖరారుచేయాలి’ అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే జోషి, బీఆర్ మీనా, ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, సీనియర్ అధికారి వాకాటి కరుణ, నీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్, మిషన్ భగీరథ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి, జలమండలి ఈడీ సత్యనారాయణ, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తాగునీటికి సింగూరు జలాలు

నీటిపారుదల శాఖకు సీఎం కేసీఆర్ ఆదేశాలు

సాగర్ నుంచి అక్కంపల్లిద్వారా నల్లగొండకు

సాగర్ నీటిమట్టం తగ్గడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

రంగంలోకి నీటిపారుదల, జలమండలి అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు మంచినీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం అధికారులను ఆదేశించారు. సింగూరు నుంచి హైదరాబాద్‌కు నీటిని వదులాలని, నాగార్జునసాగర్‌నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌ద్వారా ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు నీటిని విడుదలచేసి నల్లగొండ జిల్లాకు మంచినీరు ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఈఎన్సీ మురళీధర్‌రావును ఆయన ఆదేశించారు. సింగూరు నుంచి హైదరాబాద్‌కు, అక్కంపల్లి నుంచి ఉదయ సముద్రానికి మంగళవారం రాత్రి నుంచే నీటి విడుదల జరుగాలని చెప్పారు. కృష్ణానదిలో ఈసారి వరద నీరు రాలేదని, నాగార్జునసాగర్‌లో నీటిమట్టం గణనీయంగా పడిపోయిందని కేసీఆర్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ పరిస్థితిలో కృష్ణానది నీళ్లపై ఆధారపడిన హైదరాబాద్, నల్లగొండల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడే పరిస్థితి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వెల్లడించారు.

ముందుగానే హెచ్చరించిన సీఎం

హైదరాబాద్ మహా నగర తాగునీటి సరఫరాపై సీఎం కేసీఆర్ ముందుగానే ఓ అంచనాకు వచ్చినట్టు స్పష్టమవుతున్నది. అందుకే సింగూరు రిజర్వాయర్‌నుంచి నీటిని విడుదల చేయకుండా అట్లనే ఉంచాలని నీటిపారుదల శాఖ అధికారులకు గతంలోనే ఆయన ఆదేశాలు జారీచేశారు. కొందరు ప్రజాప్రతినిధులు అడిగినప్పటికీ.. కీలకమైన హైదరాబాద్ తాగునీటికోసం సింగూరులో నీటిని అట్లనే ఉంచాల్సి వస్తున్నదని కూడా చెప్పారు. ఆ ముందు జాగ్రత్త చర్యలే ప్రస్తుతం హైదరాబాద్‌కు శ్రీరామరక్షగా మారాయి.

కృష్ణా జలాల సరఫరాలో వెసులుబాటు

హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాకోసం నల్లగొండ జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుద్వారా నీటిని సేకరిస్తారు. నాగార్జునసాగర్‌లో 510 అడుగుల (ఎండీడీఎల్-కనీస నీటి సేకరణ స్థాయి) కంటే ఎక్కువగా ఉంటేనే ప్రాజెక్టు మోటర్లద్వారా నీటి విడుదల సాధ్యమవుతుంది. కానీ ప్రస్తుతం సాగర్‌లో 500 అడుగుల మేర మాత్రమే నీళ్లున్నాయి. దీంతో జలమండలి అధికారులు అత్యవసర మోటర్లద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తున్నారు. దీంతో వచ్చిన నీటిని హైదరాబాద్‌కే తరలిస్తుండటంతో నల్లగొండ పట్టణంతో పాటు సుమారు 230కిపైగా గ్రామాలకు తాగునీటిని అందించే ఉదయ సముద్రానికి నీటిని విడుదల చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ సింగూరు జలాలను హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించడంతో కృష్ణాజలాల సరఫరాలో కొంత వెసులుబాటు లభించనుంది. దీంతో ఇటు హైదరాబాద్, అటు నల్లగొండ, ఇతర ఫ్లోరైడ్‌పీడిత గ్రామాల తాగునీటికి ఢోకా ఉండదు. పైగా సింగూరు పూర్తిస్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా ప్రస్తుతం 22 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువన ప్రధానంగా సాయిగాం నుంచి 18వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కూడా ఉంది. దీంతో హైదరాబాద్ తాగునీటితోపాటు ముమ్మందు సింగూరు ఆయకట్టుకు కూడా ఉపశమనం కలిగే అవకాశాలున్నాయి.

నేడు పుట్టంగండికి నీటిపారుదల శాఖ అధికారులు

సీఎం ఆదేశాలతో నీటిపారుదలశాఖ, జలమండలి అధికారులు రంగంలోకి దిగారు. సుమారు రెండేండ్ల కిందట హైదరాబాద్‌కు మంజీరా జలాల సరఫరా నిలిపివేయగా.. సింగూరు నుంచి మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. బుధవారం నుంచి రోజుకు 90 ఎంజీడీలను నగరానికి తరలించనున్నారు. ఇంతమేరలో కృష్ణా జలాలను తగ్గించేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం సాగర్ నుంచి అత్యవసర మోటర్ల ద్వారా ఏఎమ్మార్ ప్రాజెక్టుకు 675 క్యూసెక్కుల నీటిని తరలించి అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అందులో 525 క్యూసెక్కుల నీటిని జలమండలి సేకరించి.. రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల నీటిని హైదరాబాద్‌కు తరలిస్తూవచ్చింది. దీంతో అక్కంపల్లి రిజర్వాయర్‌లో స్టోరేజీ పెరుగడం లేదు. ప్రస్తుతం అక్కడ 0.13 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. కనీసంగా 0.30 టీఎంసీలకంటే ఎక్కువ నీళ్లు ఉంటే తప్ప అక్కంపల్లి నుంచి నల్లగొండ ఉదయ సముద్రానికి నీటిని వదిలే అవకాశాల్లేవు. ఈ నేపథ్యంలో సింగూరు నుంచి హైదరాబాద్‌కు బుధవారం నుంచి రోజుకు 90 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలిస్తున్నారు. దీంతో నగరానికి వచ్చే 270 ఎంజీడీల్లో 90 ఎంజీడీలను తగ్గించనున్నారు. తద్వారా అక్కంపల్లి రిజర్వాయర్‌లో అదనంగా 175 క్యూసెక్కుల జలాల మిగులు ఉంటుంది. పుట్టంగండి వద్ద ఉన్న అత్యవసర మోటర్ల ద్వారా 900 క్యూసెక్కుల నీటిని లిఫ్టు చేసే అవకాశం ఉండటంతో బుధవారం ఎన్‌ఎస్పీ చీఫ్ ఇంజినీర్ ఎస్ సునీల్‌తోపాటు ఇతర ఇంజినీర్లు అక్కడికి వెళ్లనున్నారు. పూర్తిస్థాయిలో లిఫ్టు చేయడం ద్వారా అక్కంపల్లికి ఇన్‌ఫ్లో పెరుగనుంది. ఇలా సుమారు 550 క్యూసెక్కుల వరకు నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా నిల్వ సామర్థ్యం పెరిగిన వెంటనే ఉదయ సముద్రానికి నీటిని విడుదలచేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

గోదావరి నీళ్లు గంగపాలు

మొదటిపేజీ తరువాయి...

అడ్డుపుల్లలు వేస్తుండటం గమనార్హం.

తెలంగాణపై నిర్లక్ష్యానికి సజీవ నిదర్శనం

తెలంగాణ మీదుగా ప్రవహించే గోదావరి.. నేరుగా ధవళేశ్వరం బరాజ్‌కు ఎలా పరుగులు పెట్టాలో లెక్క చూసి మరీ అరవయ్యేండ్ల సమైక్య పాలనలో ప్రాజెక్టులు నిర్మించారనే చారిత్రక సత్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి.. ఈ నీటి సంవత్సరం లెక్కలు. ఒకవైపు కృష్ణా బేసిన్‌లో తాగునీటి కోసం రెండు తెలుగు రాష్ట్రాలు అల్లాడిపోతూ.. ఎగువన ఉన్న కర్ణాటకను ఒప్పించండంటూ కేంద్రాన్ని కోరాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ మరోవైపు కండ్ల ముందే వందలకొద్దీ టీఎంసీల గోదావరి జలాలు దిగువకు వెళ్లి సముద్రంలో కలుస్తున్నాయి. కేంద్ర జల సంఘం వద్ద ఉన్న 47 ఏండ్ల రికార్డులను పరిశీలించినా ఈ లెక్కలే కనిపిస్తాయి. కాళేశ్వరం వద్ద (ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం భారీ బరాజ్ నిర్మిస్తున్న మేడిగడ్డ) 1651 టీఎంసీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పేరూరు వద్ద 2430 టీఎంసీలు, దిగువన ఉండే పోలవరం వద్ద 2631 టీఎంసీల సరాసరి నీటి లభ్యత ఉంటుందని తేలింది. కానీ.. ఇంతస్థాయిలో నీటిని వినియోగించుకుంటున్న దాఖలాలే లేవు. సమైక్య పాలనలో కట్టాం అన్నట్లుగా చూపుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిస్థితి నానాటికీ దిగదుడుపుగా తయారైంది. డిజైన్‌లో 194 టీఎంసీల నీటి లభ్యత ఉంటే అది ఒకట్రెండు దశాబ్దాల్లోనే 54 టీఎంసీలకు కుంచించుకుపోయింది. అంటే.. ప్రధాన గోదావరిలో నీటి లభ్యత తగ్గుతూ ఉండగా, ప్రాణహిత, ఇంద్రావతి కలిసిన తర్వాతనే గోదావరికి అసలైన జీవం వస్తున్నదనే చారిత్రక సత్యాన్ని ఉమ్మడి పాలకులు, అప్పటి అధికార యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా విస్మరించిందన్న మాట!

553 టీఎంసీల వృథా

గోదావరిపై ఇప్పుడు ఉన్న ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యం 189.87 టీఎంసీలు. మంగళవారం నాటికి ఆయా ప్రాజెక్టుల్లోని నిల్వలను లెక్కిస్తే కేవలం 81.98 టీఎంసీలు. అంటే ఇంకా 107.89 టీఎంసీల నీళ్లొస్తే తప్ప ప్రస్తుతమున్న ప్రాజెక్టులకు జలకళ రాదు. అందునా ఈ నీటి సంవత్సరంలో అంటే జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద కేవలం 47.23 టీఎంసీలే. మిగిలినది అప్పటికే నిల్వ ఉంది. విచిత్రం ఏమిటంటే.. ఈ నీటి సంవత్సరం జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 553.055 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిసిపోయాయి! అంటే రోజుకు సగటున 6.14 టీఎంసీల చొప్పున దిగువకు వెళ్లిపోయాయి. మరోవైపు తెలుగు రాష్ట్రాల పరిధిలోని గోదావరితోపాటు కృష్ణా ప్రాజెక్టులను కూడా కలుపుకొంటే మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 779.15 టీఎంసీలు. ప్రస్తుతం వాటిలో 236.71 టీఎంసీల నిల్వ ఉంది. ఇంకా 542.44 టీఎంసీల నిల్వకు అవకాశముంది. ఇది సముద్రంలో కలిసిన గోదావరిజలాల కంటే ఓ పది టీఎంసీలు తక్కువే.

తెలుగు రాష్ట్రాల పరిధిలో కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రధాన భారీ ప్రాజెక్టులు.. వాటిలో నీటి నిల్వ సామర్థ్యం తీరు ఇలా ఉంది.. (అంకెలు టీఎంసీల్లో...)

రిజర్వాయర్	పూర్తిస్థాయి నిల్వ	ప్రస్తుతం సామర్థ్యం	ఇంకా కావాల్సిన ఉన్న నిల్వ పరిమాణం
కృష్ణా బేసిన్..			
జూరాల	9.66	6.19	3.47
శ్రీశైలం	215.81	22.31	193.50
నాగార్జునసాగర్	312.05	115.31	196.74
పులిచింతల	45.77	5.10	40.67
ప్రకాశం బరాజ్	3.07	2.89	0.18
గోదావరి బేసిన్...			
సింగూరు	29.91	21.11	8.80
నిజాంసాగర్	17.80	2.57	15.23
శ్రీరాంసాగర్	90.31	29.27	61.04
లోయర్ మానేరు డ్యాం	24.07	7.29	16.78
కడెం	7.60	7.20	0.40
ఎల్లంపల్లి	20.18	14.54	5.64
ధవళేశ్వరం బరాజ్	2.93	2.93	–
మొత్తం	**779.15**	**236.71**	**542.44**

ఇప్పటికి సముద్రంలో కలిసిన గోదావరిజలాలు.. 553.055 టీఎంసీలు

సగం మళ్లింపు సాకారం..

గోదావరి జలాలు ఏటా సముద్రంలోకి వృథాగా పోతున్న దుస్థితిని మార్చివేసేందుకు తెలంగాణ సర్కారు తీవ్ర స్థాయిలో కృషిచేస్తున్నది. సగటున రోజుకు ఆరు టీఎంసీల నీరు సముద్రంలోకి పోతుండగా.. అందులో కనీసం సగాన్ని మళ్లించి.. ఒడిసిపట్టేందుకు పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నది. వచ్చే ఏడాదినుంచి మేడిగడ్డద్వారా రోజుకు రెండు టీఎంసీల చొప్పున ఎత్తిపోసేందుకు పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. తద్వారా వరద కాల్వ నుంచి ఒక టీఎంసీని శ్రీరాంసాగర్‌కు మళ్లించనున్నారు. అప్పటివరకు మిడ్ మానేరు ద్వారా చెరువులకు ఒక టీఎంసీ.. ఎస్సారెస్పీని నింపిన తర్వాత రెండు టీఎంసీలను మళ్లించనున్నారు. భవిష్యత్తులో మేడిగడ్డ నుంచి మూడు టీఎంసీలు మళ్లించేందుకు కూడా వెసులుబాటు (స్కోప్) కల్పిస్తున్నారు. ఆ క్రమంలో ఎస్సారెస్పీ పునర్జీవానికి ఒక టీఎంసీ, మిడ్ మానేరుద్వారా దిగువకు రెండు టీఎంసీలను వినియోగించనున్నారు. తద్వారా వచ్చే ఏడాది నుంచి సముద్రంలో కలిసే గోదావరి జలాల పరిమాణం గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా.. ఆ నీటిని భారీస్థాయిలో వినియోగించుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

గోదావరితో పండుతున్న కృష్ణా డెల్టా!

ఎగువన కర్ణాటక రిజర్వాయర్లు నిండుకుండల్లా ఉన్నాయి. దిగువన తెలుగు రాష్ట్రాల పరిధిలోని జూరాల మొదలు పులిచింతలవరకు బోసిపోతున్నాయి. కానీ ఆ దిగువన కృష్ణా డెల్టా మాత్రం గోదావరితో పంట పండించుకుంటుండటం విశేషం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను డెల్టాకు మళ్లిస్తుండగా.. నేటికీ ప్రకాశం బరాజ్‌కు 11850 క్యూసెక్కుల గోదావరిజలాల ఇన్‌ఫ్లో ఉంటే అంతేమేర అవుట్‌ఫ్లోగా కాల్వల ద్వారా విడుదలచేస్తున్నారు. ఇది సరిపోనట్లు.. మూసీ, ఇతరత్రా పరీవాహకంలో కురిసిన వర్షాలతో పులిచింతలకు ఐదారు టీఎంసీలు వస్తే.. దానిని కూడా ఆంధ్రప్రదేశ్ సర్కారు డెల్టాకు మళ్లించి, తెలంగాణ లిఫ్టు పథకాలను ఎండబెట్టింది. మొత్తంగా ఇప్పటివరకు డెల్టాలో 50.36 టీఎంసీల జలాల వినియోగం జరిగింది. ఇక.. సముద్రంలో కలిసిన కృష్ణా జలాలు మాత్రం ఈ నీటి సంవత్సరంలో శూన్యం.

సముద్రంలో కలుస్తున్న గోదావరిజలాలు...

సంవత్సరం	బంగాళాఖాతంలో కలిసిన గోదావరిజలాలు (టీఎంసీల్లో..)
1999–2000	2561.70
2000–01	2448.80
2001–02	2631.70
2002–03	1593.40
2003–04	2918.70
2004–05	1562.00
2005–06	3540.30
2006–07	4432.20
2007–08	3059.70
2008–09	1840.80
2009–10	800.60
2010–11	3913.40
2011–12	1746.80
2012–13	3013.90
2013–14	5069.80
2014–15	2006.20
2015–16	1611.40
2016–17	2896.05
2017–18 (ఆగస్టు 29 నాటికి)	553.55



నిజామాబాద్ జిల్లా నందిపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీ కల్వకుంట్ల కవిత



ఎంపీకి గొర్రెను బహూకరిస్తున్న గొల్లకుర్మలు

ఆడబిడ్డలకు అత్యధిక ప్రాధాన్యం

సీఎం కేసీఆర్ పనితీరుతో తెలంగాణకు జాతీయస్థాయిలో గుర్తింపు

నందిపేటలో 'మన ఊరు-మన ఎంపీ' కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ కవిత

డప్పుల దరువు, మంగళహారతులతో స్వాగతం

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: తెలంగాణలో మానవీయ పాలన కొనసాగుతున్నదని, అందరి బాధలను అర్థం చేసుకునే సీఎం కేసీఆర్ పాలనలో ఆడబిడ్డలకు అధిక ప్రాధాన్యం లభిస్తున్నదని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన స్త్రీ శక్తి భవనాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఎంపీ కవిత మాట్లాడారు. 'ప్రతి ఇంటికి సీఎం కేసీఆర్ బిడ్డగా, ఓ పెద్దన్నగా అండగా ఉంటున్నారన్నారు. గతంలో ఇచ్చే రూ.200 పింఛన్ ఏమూలలకు సరిపోవడంలేదని గుర్తించి, దాన్ని వెయ్యి రూపాయలకు పెంచి ఆసరాగా నిలిచారన్నారు. ఆడబిడ్డకు అండగా ఉండేందుకు అనేక పథకాలను ఆయన రూపొందించారని తెలిపారు. సర్కారు దవాఖానల్లో ప్రసవిస్తే రూ.12వేలు వారి ఖాతాల్లో వేసి ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. రూ.3వేల విలువ చేసే కేసీఆర్ కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులకు అదనంగా మరో రూ.400 కోట్లను ఖర్చు చేస్తున్నదన్నారు. సర్కారు దవాఖానల రూపురేఖలు మార్చి కనీస అవసరాలు, వసతులు ఏర్పాటు చేసేందుకు రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తున్నదన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలని ఎంపీ కవిత విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ఎక్కువగా మహిళలే ఉండాలని ఆకాంక్షించారు. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం బాలికల చదువుకోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నదని చెప్పారు. సీఎంకు రాష్ట్ర ప్రజలపై ఎనలేని ప్రేమ ఉన్నదని, బిడ్డ క్షేమం కోసం తల్లి ఎలా ఆరాటపడుతుందో, సీఎం కేసీఆర్ అదే తీరులో రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి నిత్యం 18 గంటలు శ్రమిస్తున్నారన్నారు. కేసీఆర్ పట్టుదలతోనే దేశంలో రాష్ట్రానికి గుర్తింపు సాధ్యమైందన్నారు. సాగునీటి సమస్యను తీర్చడానికి కాళేశ్వరం నుంచి పోచంపాడ్‌లోకి రివర్స్ పంపింగ్ కోసం ప్రభుత్వం రూ.1,200 కోట్లతో పనులు చేపడుతున్నదన్నారు. నూత్‌పల్లి, సిర్పూర్, లక్కంపల్లి, జిజి నడ్కుడ గ్రామాలతోపాటు నందిపేటలో 3 మహిళా సంఘాల భవన నిర్మాణాలకు తన నిధుల నుంచి రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తున్నట్టు ఎంపీ ప్రకటించారు.

ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తాం: ఎంపీ కవిత

సబ్బండ వర్ణాలతో కలిసి ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన స్ఫూర్తితోనే బంగారు తెలంగాణ కోసం అకుంఠిత దీక్షతో పనిచేస్తామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం డొంకేశ్వర్‌లో మంగళవారం 'మన ఊరు-మన ఎంపీ' కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి బహిరంగ సభలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తమను హైదరాబాద్‌లో ఉండవద్దని, ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఎప్పుడూ హితబోధ చేస్తుంటారన్నారు. ఆయన ఆదేశాలు, మార్గదర్శనం ప్రకారం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. బీడీ అక్కలకు ఎవరైనా జీవన భృతి ఇద్దామని ఆలోచించారా? అది కేసీఆర్ చేసి చూపారని అన్నారు. గ్రామంలో రాత్రి నిర్వహించిన ఎంపీ సభకు గ్రామస్థులు భారీగా తరలివచ్చారు.

ఎంపీకి అపూర్వ స్వాగతం..

డొంకేశ్వర్‌లో 'మన ఊరు-మన ఎంపీ' కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎంపీ కవితకు మహిళలు గ్రామ శివారులో బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. డప్పుల దరువు, పటాకుల మోత మోగించారు. మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా డొంకేశ్వర్‌లో పండుగ వాతావరణం కనిపించింది. పుట్టా ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కవిత ఆ తరువాత గ్రామంలో పర్యటించారు. భారీగా తరలివచ్చిన మహిళలతో కలిసి ఆమె ముందుకు కదిలారు. గ్రామ ప్రజలు ఆమెను అక్కున చేర్చుకున్నారు. ఎంపీ అందరిని ఆత్మీయంగా పలుకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు.

జూన్ 1 నుంచే కొత్త విద్యాసంవత్సరం

2017-18 విద్యాక్యాలెండర్ విడుదల

ఏప్రిల్ 13 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు

జనవరి 31లోగా ఎస్సెస్సీ సిలబస్ పూర్తి

2018 ఏప్రిల్ 12 వరకు తరగతులు

జూన్ 2న పాఠశాలల్లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబురాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2018 జూన్ 1వ తేదీ నుంచే కొత్త విద్యాసంవత్సరాన్ని ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. మంగళవారం 2017-18 విద్యాక్యాలెండర్‌ను విడుదల చేసింది. నెలవారీగా విడుదలచేసిన క్యాలెండర్ ప్రకారం పాఠశాలలను నడుపాలని డీఈవో, ఆర్జేడీలకు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఆదేశాలను జారీచేశారు. 12 జూన్ 2017 నుంచి 12 ఏప్రిల్ 2018 వరకు 2017-18 విద్యాసంవత్సరాన్ని కొనసాగిస్తారు. ఏప్రిల్ 13 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇస్తారు. పదో తరగతి విద్యార్థులకు జనవరి 31లోగా సిలబస్‌ను పూర్తిచేసి, రివిజన్ తరగతులను నిర్వహిస్తారు. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఫిబ్రవరి 28లోగా సిలబస్‌ను పూర్తిచేసి, రివిజన్ ప్రారంభిస్తారు. గత విద్యా సంవత్సరంలో ఉన్న స్కూల్ సమయాలనే ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. స్కూల్ గేమ్‌లను ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరుసార్లు (జూలై, ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్, జనవరి, ఫిబ్రవరిలో) స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని, 2018 జనవరి, ఫిబ్రవరిలో స్కూల్ డే నిర్వహించాలి. ప్రతినెలా నాలుగో శనివారం బాలసభ ఏర్పాటుచేయాలి. ప్రతి నెలా మొదటి, మూడోశనివారం మాక్ డ్రిల్/యోగా నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యా క్యాలెండర్ అమలుకు చర్యలను తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్‌ను ఆదేశించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న అన్ని విద్యాసంస్థల్లో సంబురాలను జరుపుకొనేందుకు వీలుగా జూన్ 1 నుంచి విద్యాసంవత్సరాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. పీఆర్టీయూటీఎస్, టీఎస్ యూటీఎఫ్, ఎస్టీయూటీఎస్, టీటీఎఫ్, టీటీయూ, ఆర్‌యూపీపీ, టీపీటీఎఫ్, పీఆర్టీయూ (తెలంగాణ) సంఘాలు హర్షం వ్యక్తంచేశారు.

పరీక్షల టైంటేబుల్ వివరాలు:

ఫార్మటివ్ పరీక్షలు ఎఫ్ఏ 1 –	31 జూన్ 2017
ఫార్మటివ్ పరీక్షలు ఎఫ్ఏ 2 –	19 సెప్టెంబర్ 2017
సమ్మెటివ్ పరీక్షలు ఎస్ఏ 1	23 అక్టోబర్ 2017 నుంచి 28 అక్టోబర్ 2017 వరకు..
ఫార్మటివ్ పరీక్షలు ఎఫ్ఏ 3	30 నవంబర్
ఫార్మటివ్ పరీక్షలు ఎఫ్ఏ 4	31 జనవరి 2018న పదో తరగతి వారికి, 28 ఫిబ్రవరి 2018 నుంచి 1–9 తరగతులకు..
సమ్మెటివ్ పరీక్షలు ఎస్ఏ 2	2 ఏప్రిల్ 2018 నుంచి 9 ఏప్రిల్ 2018 వరకు..
ప్రీ ఫైనల్ (ఎస్సెస్సీ)	ఫిబ్రవరి 28 లోపు నిర్వహించాలి

స్వల్పకాలిక సెలవులు

దసరా సెలవులు	20 సెప్టెంబర్ 2017 నుంచి 4 అక్టోబర్ 2017 వరకు (15 రోజులు)
క్రిస్మస్ సెలవులు	(మిషనరీ స్కూళ్లకు) 2017 డిసెంబర్ 24 నుంచి 28వ తేదీ వరకు (ఐదురోజులు)
సంక్రాంతి సెలవులు	(మిషనరీ స్కూళ్లకు మినహాయింపు) 2018 జనవరి 12 నుంచి 16 వ తేదీ వరకు (ఐదురోజులు)

రోజువారీగా డిజిటల్ తరగతుల టైంటేబుల్

పదో తరగతి	ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు
తొమ్మిదో తరగతి	ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు
ఎనిమిదో తరగతి	మధ్యాహ్నం 2.00 నుంచి 2.45 గంటల వరకు
ఏడో తరగతి	మధ్యాహ్నం 2.45 నుంచి 3.30 గంటల వరకు
ఆరో తరగతి	మధ్యాహ్నం 3.40 నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు

11న కైలాశ్ సత్యార్థి భారతయాత్ర

చిన్నారులపై హింసకు వ్యతిరేకంగా ప్రచారం

అక్టోబర్ 16న ఢిల్లీలో ముగింపు

21న హైదరాబాద్‌కు చేరనున్న యాత్ర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో చిన్నారులపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా త్వరలో భారతయాత్రను చేపట్టనున్నట్టు నోబెల్ బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి తెలిపారు. 35 రోజులపాటు, 22 రాష్ట్రాల్లో 11 వేల కిలోమీటర్ల దూరం యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాట ప్రచారయాత్రను సెప్టెంబర్ 11న కన్యాకుమారిలో ప్రారంభించి అక్టోబర్ 16న ఢిల్లీలో ముగించనున్నట్టు మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరించారు. యాత్రకు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ సంపూర్ణ మద్దతు ఉందన్నారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ప్రధానమైనదని కైలాశ్ సత్యార్థి అన్నారు. ఉన్నతాశయంతో తాను చేపట్టిన భారతయాత్ర సెప్టెంబర్ 21న హైదరాబాద్‌కు చేరుకుంటుదని పేర్కొన్నారు. గత 36 ఏండ్లుగా ప్రపంచవ్యాప్తంగా పిల్లల స్వేచ్ఛ, వారి భద్రత కోసం తాను ప్రచారం చేస్తున్నట్టు వివరించారు. ఇటీవల చిన్నారులపై లైంగికదాడులు పెరిగిపోయాయని కైలాశ్ ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో పిల్లలు స్వేచ్ఛగా జీవించడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని విజ్ఞప్తిచేశారు. 1893లో చికాగోలో స్వామి వివేకానంద ఉపన్యాసాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 11న కన్యాకుమారిలోని వివేకానంద స్మారకం నుంచి తన యాత్రను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ యాత్ర చిన్నారులపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మూడేండ్ల కిందట ప్రారంభించిన ప్రచారానికి ఆవిష్కరణ అన్నారు. ఆయా కేసుల పట్ల అవగాహన, పిల్లలకు సురక్షితమైన భారతదేశాన్ని ఏర్పరిచేందుకు చేపట్టిన యాత్రకు అందరి నుంచి మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నానన్నారు.



మంగళవారం నిజాంక్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈవెంట్‌లాంచ్ కార్యక్రమంలో కైలాశ్‌సత్యార్థిని సన్మానిస్తున్న ఎంపీ వినోద్‌కుమార్

సత్యార్థి యాత్రలో అందరూ పాల్గొనాలి

ఎంపీ వినోద్‌కుమార్ పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భావిభారత పౌరులుగా ఎదుగాల్సిన చిన్నారుల రక్షణకోసం నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి చేపట్టనున్న భారతయాత్రలో అందరూ పాల్గొనాలని ఎంపీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నిజాంక్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈవెంట్‌లాంచ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర సెప్టెంబర్ 21న హైదరాబాద్‌కు చేరుకోనుందని, ఈ మహా యజ్ఞంలో పాలు పంచుకోవాలని ఆయన కోరారు. చిన్నారుల భద్రత కోసం తాను చేపట్టనున్న భారతయాత్రలో అందరూ పాలు పంచుకోవాలని కైలాశ్ సత్యార్థి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో యూత్‌ఫర్ బెటర్ తెలంగాణ, సీవోవీఏ సంస్థ ప్రతినిధి మజర్ హుసేన్, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోరాడుతున్న ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథకు స్వీడన్‌లో ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త రాష్ట్రమైన తెలంగాణ చేపట్టిన 'మిషన్ భగీరథ' ప్రాజెక్టుకు ప్రపంచంలోని 134 దేశాల నుంచి ప్రత్యేక ప్రశంసలు లభించాయి. స్వీడన్‌లో మంగళవారం ప్రారంభమైన 'వరల్డ్ వాటర్ వీక్-2017' సదస్సుకు రాష్ట్రం నుంచి హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మిషన్ భగీరథ గురించి వివరించారు. ఇంటింటికీ తాగునీరు అందించాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. నగరాల్లోని 20 లక్షల కుటుంబాలతోపాటు అన్ని గ్రామాలకు తాగునీటిని అందించడం లక్ష్యమన్నారు.



మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న టీవీ ఆర్టిస్టు ఉదయభాను



మంగళవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో రాష్ట్ర ఇంజినీర్లతో సమావేశమైన మధ్యప్రదేశ్ ఇంజినీరింగ్ అధికారులు

మిషన్ భగీరథ అద్భుత ప్రాజెక్టు

దేశానికే ఇది మోడల్.. మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం ప్రశంస

నేడు, రేపు క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పనుల పరిశీలన

ప్రాజెక్టు స్వరూపం వెల్లడించిన ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ అద్భుతమైన ప్రాజెక్టు అని మధ్యప్రదేశ్ తాగునీటిశాఖ చీఫ్ జనరల్ మేనేజర్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ ప్రశంసించారు. ప్రజారోగ్యం కోసం ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా తక్కువే అన్నారు. ప్రతీఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సీఎం కేసీఆర్ సంకల్పం చాలా గొప్పదని మెచ్చుకున్నారు. అందుకే ఇవాళ దేశం మొత్తం ఈ ప్రాజెక్టును ఆసక్తిగా గమనిస్తున్నదని ఆయన చెప్పారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు పనుల పరిశీలనకు మూడురోజుల పర్యటనపై రాష్ట్రానికి వచ్చిన మధ్యప్రదేశ్ తాగునీటి ఇంజినీరింగ్ అధికారుల బృందం తొలిరోజు మంగళవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులను కలిసింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు స్వరూపం, లక్ష్యాలను ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) బీ సురేందర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అనంతరం ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ భగీరథ ప్రాజెక్టు పనులు నభూతో అన్న రీతిలో సాగుతున్నాయని, చూసి రావాలని కేంద్ర ప్రభుత్వం తమకు సూచించిందని అన్నారు. త్వరలో తమ రాష్ట్రంలోనూ భగరథలాంటి ప్రాజెక్టును ప్రారంభించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. మిషన్ భగీరథ మొత్తం దేశానికే మోడల్ ప్రాజెక్టు అని జనరల్ మేనేజర్ పీకే రఘువంశి కొనియాడారు. బుధవారం మెదక్-సింగూరు, గురువారం ఎల్లూరు-మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌లో జరుగుతున్న పనులను మధ్యప్రదేశ్ బృందం పరిశీలించనుందని ఈఎన్సీ సురేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్లు విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, ఓఎస్డీ సత్యపాల్‌రెడ్డి, కన్సల్టెంట్లు నర్సింగరావు, బాబూరావు, ఈఈ విజయ కుమార్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.





డోక్లామ్ ప్రాంతంలో రెండున్నర నెలలుగా నెలకొన్న ఉద్రిక్తతకు తెరపడటం ఆహ్వానించదగిన పరిణామం. భారత్-చైనా దేశాల మధ్య సత్సంబంధాలు ప్రాంతీయ శాంతి, సుస్థిరతలకు అవశ్యం. అయితే సరిహద్దు వెంట చైనా తన నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నది.

వు కియాన్, పీఎల్ఏ సీనియర్ కల్నల్

పాకిస్థాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. నిరసనగా అమెరికాతో జరుపుతున్న అన్నిరకాల చర్చలను, ద్వైపాక్షిక పర్యటనలను పాక్ నిలిపివేస్తున్నది.

ఖ్వాజా మహమ్మద్ ఆసిఫ్, పాకిస్థాన్ విదేశాంగ మంత్రి



చరిత్రలో నేడు



1574

సిక్కుల నాలుగవ మత గురువుగా సంత్ రామ్‌దాస్.

1928

భారత్‌కు స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి విన్నవించిన నెహ్రూ.





1967

అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మొదటి నల్ల జాతీయుడు థర్గూడ్ మార్షల్.

యూరప్‌లోకి వలసలు రాజకీయ, సామాజిక సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. ఆఫ్రికాలో, ఇతర ఖండాలలో అస్థిరత్వం, యుద్ధాలు, శిక్షలు, పేదరికం, సంపన్న ప్రాంతాలకు వెళ్లి మెరుగైన జీవితాన్ని అనుభవించాలనే మానవ ఆకాంక్ష మొదలైనవన్నీ వలసలకు దారి తీస్తున్నాయి. దీంతో యూరప్‌లోకి చరిత్రలోనే అతి భారీ వలసలు సాగుతున్నాయి. వలసలు సురక్షితంగా, చట్టబద్ధంగా జరుగడానికి మార్గాలు ఏర్పరచడమే నిజమైన సుస్థిరమైన పరిష్కారం. ఆశ్రయం ఇవ్వడానికి అర్హులు కానివారిని తిప్పి పంపే విధానం కూడా ఉండాలె. అయితే ఇది మానవీయంగా ఉండాలె.

ది గార్డియన్

ఐఐటీలలో దేశభక్తి గీతాలను ఆలాపించే బృందాలను ఏర్పాటు చేయాలని, ఇందుకు ఒక ప్రైవేటు సంస్థను నియోగించాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఎహ్ ఇండియా కా టైమ్ హై పేర ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ దేశభక్తిని పౌరులలో కృత్రిమంగా పాదుకొల్పడం సాధ్యం కాదు. దేశభక్తి ప్రచారానికి బదులు ప్రభుత్వం విద్యా ప్రమాణాలు పెంచడంపై, పరిశోధనా వసతుల కల్పనపై దృష్టి సారించాలె. మన విద్యా సంస్థలు అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల స్థాయిని అందుకునే విధంగా చేయాలె.

హిందుస్థాన్ టైమ్స్

విజ్ఞతదే విజయం

భారత్, చైనా డోక్లామ్ వివాదాన్ని పట్టుదలకు పోకుండా దౌత్యమార్గంలో పరిష్కరించుకోవడం అభినందనీయం. ప్రత్యేకించి ఈ వివాదంలో మొదటినుంచి భారత్ ఎంతో సహనాన్ని ప్రదర్శించింది. చైనా మీడియా విద్వేష ప్రచారానికి దిగినా, భారత జాతిని పరిహసిస్తూ డాక్యుమెంటరీని ప్రదర్శించినా అవన్నీ ఆ దేశ అల్పత్వాన్ని బయటపెట్టాయి. భారత్‌లోనూ కొందరు చైనా వ్యతిరేకతను ప్రదర్శించినప్పటికీ చైనా స్థాయిలో జరుగలేదు. పైగా ఇక్కడి దౌత్యవేత్తలు ఎంతో ఓర్పుతో సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. తెరవెనుక ప్రయత్నాలు చేశారు. చైనా దౌత్యవేత్తలు కూడా ఈ కృషిలో భాగస్వాములయ్యారు. దౌత్యాధికారులు, సైనికాధికారుల స్థాయిలో చర్చలు జరిగిన తరువాత ఒక అవగాహన ఏర్పడ్డది. దీంతో యుద్ధ భాష ముందు శాంతి వచనాలదే పైచేయి అయింది. ఇప్పటికే 'వన్ బెల్ట్ వన్ రోడ్' అంటూ భారీ పథకాన్ని చేపట్టిన చైనా ఇందులోకి భారత్‌ను ఆకర్షించలేకపోయింది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం వచ్చే నెల మూడవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు చైనాలో జరగనుంది. ఈ బ్రిక్స్ బలగంలోకి థాయిలాండ్, ఇండొనేషియా, కజఖ్‌స్థాన్, ఈజిప్టు తదితర దేశాలను చేర్చుకోవాలని చైనా భావిస్తున్నది. చైనా తన ప్రాబల్యాన్ని ఎంత పెంచుకున్నా పొరుగున ఉన్న భారత్ సహకారం లేకపోతే వెలవెలబోతుంది. అందుకే బ్రిక్స్ సమావేశ నేపథ్యంలో ఉద్రిక్తతల సడలింపునకు చైనా ఆసక్తి చూపిందనే మాట వినబడుతున్నది. భారత్ కూడా సరిహద్దులో నిరంతర కీచులాట అభివృద్ధికి ఆటంకమని భావించింది. యుద్ధమనేది మొదలైతే అది గెలుపు ఓటములను నిర్ణయించేదిగా ఉండదని, తీవ్ర అనర్థదాయకమని ఇరు పక్షాలు గ్రహించాయి.

వచ్చే నెల మూడవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు జరిగే బ్రిక్స్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ మధ్య చర్చలకు సానుకూల పరిస్థితి ఏర్పడ్డది. ఇరువురు ఎటువంటి ఒత్తిడులు లేకుండా తమ అభిప్రాయాలను వెల్లడించుకోవచ్చు. డోక్లామ్ వివాదం సద్దుమణిగినంత మాత్రాన ఇక సమస్యలే లేవని, అంతా ప్రశాంతమని కాదు. ఇరుపక్షాల మధ్య సమస్యలు అట్లానే ఉన్నాయి. విభేదాలు ఉన్నాయనేది ఇరు పక్షాలూ గుర్తిస్తున్నాయి. అయితే విభేదాలు ఉన్నప్పటికీ, ఘర్షణపూరిత వాతావరణం మంచిది కాదనే విజ్ఞతను ఇరు పక్షాలూ ప్రదర్శించాయి.

రెండుదేశాల మధ్య ఒప్పందం కుదిరిన తరువాత, ఇరువైపులా ప్రభుత్వాలకు ఎదురయ్యే ప్రధాన సమస్య- తమ ప్రజలకు ఏమి చెప్పుకోవాలనేది. తమ ప్రభుత్వం లొంగిపోయిందనో, అవతలి పక్షానిది పైచేయి అయిందనో విమర్శించే వర్గాలు రెండు దేశాలలోనూ ఉంటాయి. దేశంలోని ప్రజలను రెచ్చగొట్టినంత సులభంగా, అంతర్జాతీయ వేదికల పై, ద్వైపాక్షిక దౌత్య చర్చలలో మాట్లాడటం కుదరదు. అంతర్జాతీయ నియమాలకు అనుగుణంగా వ్యవహరించవలసి ఉంటుంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబించవలసి ఉంటుంది. అందువల్ల ఏ ఒప్పందమైనా కుదిరిన తరువాత, దానిని ప్రతి దేశం తమకు అనుకూలమైనరీతిలో వ్యాఖ్యానించుకోవడం పరిపాటి. డోక్లామ్ వివాద పరిష్కారం తరువాత, ఇరుపక్షాలు సరిహద్దు సిబ్బందిని విరమించుకుంటున్నట్టు భారత్ క్లుప్త ప్రకటన చేసింది. చైనా తమ దళాలను ఉపసంహరించుకుంటామని అనకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాట్లు చేసుకుంటున్నట్టుగా తెలిపింది. భారత్‌లోని సిక్కింకు, అటు భూటాన్‌కు మధ్య చైనా భూభాగం చొచ్చుకువచ్చినట్టుగా ఉంటుంది. భారత్ ప్రధాన భూభాగాన్ని, ఈశాన్యంతో కలిపే సోగడాకు ఈ చైనా ప్రాంతం సమీపంలో ఉంటుంది. అయితే మిగతా ప్రాంతాల మాదిరిగా ఇక్కడి చైనా భూభాగం సైనిక చర్య రీత్యా అనుకూలంగా ఉండదు. చైనా కనుక నిర్మాణాలు చేపడితే భారత్‌కు ఇబ్బందికరం. అందువల్లనే భారత్ అడ్డుకున్నది. తన ఆందోళనను చైనాకు చెప్పగలుగడమే భారత్ సాధించిన విజయం.

వచ్చే నెల మూడవ తేదీ నుంచి ఐదవ తేదీ వరకు జరిగే బ్రిక్స్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ మధ్య చర్చలకు సానుకూల పరిస్థితి ఏర్పడ్డది. ఇరువురు ఎటువంటి ఒత్తిడులు లేకుండా తమ అభిప్రాయాలను వెల్లడించుకోవచ్చు. డోక్లామ్ వివాదం సద్దుమణిగినంత మాత్రాన ఇక సమస్యలే లేవని, అంతా ప్రశాంతమని కాదు. ఇరు పక్షాల మధ్య సమస్యలు అట్లానే ఉన్నాయి. విభేదాలు ఉన్నాయనేది ఇరు పక్షాలూ గుర్తిస్తున్నాయి. అయితే విభేదాలు ఉన్నప్పటికీ, ఘర్షణపూరిత వాతావరణం మంచిది కాదనే విజ్ఞతను ఇరు పక్షాలూ ప్రదర్శించాయి. 'రెండు వైపులా సైనిక మోహరింపులు పునరావృతం కావచ్చు. రెండు దేశాల మధ్య వైషమ్యాలు తరచు తలెత్తవచ్చు. కానీ ఘర్షణ జరుగకపోవచ్చు. ఆర్థికంగా ఆంక్షలు విధించుకోవచ్చు' అని చైనా ఆర్థిక గూఢచార విభాగంలోని విశ్లేషకుడు డాన్ వాంగ్ అభిప్రాయపడ్డారు. 'వాస్తవాధీన రేఖకు సంబంధించి ఇరుపక్షాల మధ్య ఇంకా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అందువల్ల పరస్పర విశ్వాస చర్యలు తీసుకోవాలె. విభేదాలు తలెత్తినప్పుడు పరిష్కరించుకునే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలె. పాత ఒప్పందాలలో ఉన్న పరిమితులను గుర్తించి, పటిష్ఠం చేసుకోవాలె' అని మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ వినోద్ భాటియా హెచ్చరించారు. డోక్లామ్ ఉదంతం ఇరుపక్షాలకు కొన్ని పాఠాలు నేర్పింది. ఈ అనుభవంతో రెండు దేశాలు ఉద్రిక్తతలు తలెత్తకుండా జాగ్రత్తపడటమే కాదు, సత్సంబంధాలు నెలకొల్పుకోవడానికి ప్రయత్నించాలె. డోక్లామ్ ఉద్రిక్తతల సడలింపు ఈ దిశగా వేసిన తొలి అడుగు కావాలె. మాజీ ప్రధాని వాజపేయి అన్నట్టు- 'మన మిత్రులను మార్చుకోవచ్చు. కానీ పొరుగువారిని మార్చుకోలేము'.

జనగళం

పేద మహిళలకు ఊరట

రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పథకాలను చేపడుతూ దేశాన్ని ఆకర్షిస్తున్నది. ఇందులో భాగంగానే బతుకమ్మ పండుగను దృష్టిలో పెట్టుకొని తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 18 సంవత్సరాలు దాటిన కోటి మందికిపైగా మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవ్వడం హర్షణీయం. ఈ బృహత్తరమైన కార్యక్రమాన్ని ప్రజలతో పాటు ప్రతిపక్షాలు కూడా ఆహ్వానించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ పథకం పేద మహిళలకు ఊరటనిచ్చేదే అనడంలో సందేహం లేదు.

- పంబ శివశంకర్, కొండారెడ్డిపల్లి, అచ్చంపేట్

మురుగుకాల్వల శుద్ధి

గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో నగరం తడిసి ముద్దవుతున్నది. జనజీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. బస్తీవాసులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాల్వల ద్వారా వాన నీళ్ళు సరిగా వెళ్లడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుద్ధి చేయాల్సిన అవసరమున్నది.

- తాళ్లపెల్లి మనోజ్‌కుమార్ గౌడ్, మలక్‌పేట్, హైదరాబాద్

బెల్ట్‌షాపులను మూసేయాలి

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. బెల్ట్‌షాపుల యజమానులు ఇష్టం వచ్చిన ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపుల నిర్వహణను కట్టడి చేయాల్సిన అవసరం ఉన్నది.

- పెద్ది సాయిరాం, కిసాన్‌నగర్, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



జూలూరు గౌరీశంకర్

బీసీలపై సమగ్ర అధ్యయనం

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత బహుజన జీవితాలను తీర్చిదిద్దేపనికి ముఖ్యమంత్రి కేసీఆర్ పూనుకున్నారు. బహుజనులకు అన్నిరంగాల్లో దక్కాల్సిన వాటాలను అందజేసేందుకు అనేక పథకాలు రచిస్తున్నారు. ఇందులో భాగంగానే తొలి బీసీ కమిషన్ వేశారు. దీనికి మొత్తం సమాజంలో 52 శాతంగా ఉన్న బీసీల జీవన స్థితిగతులను, క్షేత్రస్థాయిలో వారి జీవన విధానాన్ని తెలుసుకొనేందుకు కీలక బాధ్యతలను అప్పగించారు.

బీసీ (ఇ) గ్రూప్‌లో ఉన్న ముస్లింల దయనీయ పరిస్థితి చూసి వారి జనాభా ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లను కేటాయించారు. వారి జీవన విధానాన్ని, స్థితిగతులను అధ్యయనం చేయాల్సిందిగా బీసీ కమిషన్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఆయన ఆదేశానుసారం బీసీ కమిషన్ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి బీసీ(ఇ) గ్రూప్ సామాజిక వర్గానికి 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయించారు.

తెలంగాణ సమాజంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అత్యధికంగా ఉన్నారు. వీరి సంఖ్య 85 శాతం అని, వీరి జీవన విధానాన్ని సంపూర్ణంగా మార్చగలిగినప్పుడే తెలంగాణ సమాజం అన్నిరంగాల్లో శిరస్సెత్తుకొని నిలబడగలుగుతుందని చెప్పిన ముఖ్యమంత్రి కూడా కేసీఆరే. ఆయన బహుజన వర్గాలను అన్నిరంగాల్లో ఎదిగే విధంగా చేసేందుకు ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఇది తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన మార్పు. ఇప్పటిదాకా ఏ పాలకపక్షం ఆ పనిని సీరియస్‌గా తీసుకోలేదు. కేసీఆర్ బహుజన జీవితాలను తీర్చిదిద్దటాన్ని ఒక సవాల్‌గా స్వీకరించారు. అందులో భాగంగానే బీసీలపైన సమగ్ర అధ్యయనం కూడా మొదలు పెట్టించారు. బహుజన జీవితాల కులవృత్తులు, ఉత్పత్తి కులాల జీవన విధానం గురించి కేసీఆర్‌కు పరిపూర్ణ అవగాహన ఉన్నది. తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ ఎంబీసీల కోసం వెయ్యికోట్లు ప్రకటించారు. సంచార జాతుల జీవనం చాలా దుర్భరమైనది. వారి జీవితాలను స్థిరపరుచటం కోసం అసలు వారు ఎక్కడున్నారు? వారికి స్థిరనివాసం కలిగించటానికి ఏంచేయాలి? ఆ సంచారజాతుల పిల్లలు చదువుతున్నారా? అసలు సంచారవృత్తి ఈ ఆధునిక కాలంలో ఎలా నడుస్తున్నది? అనేది అధ్యయనం చేయాలి. ఈ సంచారజాతి ఒక ప్రత్యేకస్థితిని కలిగి ఉన్నది. ఈ కులా లవారికి కూడా ఒక స్థిర నివాసం ఏర్పాటుచేసి, అన్నిరంగాల్లోకి ఈ సంచారజాతుల వారు కూడా వచ్చేవిధంగా చేయాలన్న సంకల్పం నెరవేర్చేందుకు బీసీ కమిషన్ అధ్యయనం ప్రారంభించింది.

ఈ లక్ష్య సాధనకు అన్ని ప్రభుత్వ శాఖల నుంచి బీసీ కమిషన్ సమాచారాన్ని సేకరిస్తున్నది. ఈ సమాచారంలో బీసీ కులాలు అంటూ ప్రత్యేకంగా లేవు. ఆ కులాల సంఖ్య ఎంతో తెలుసుకోవాలి. మొత్తం ప్రభుత్వ శాఖల్లో బీసీలు ఎంతమంది ఉన్నారు? ఉన్న బీసీలలో ఏయే కులాల వారు ఉద్యోగాల్లో, కీలక రంగాల్లో ఉన్నారు? ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరని కులాల సంఖ్య కూడా ఎంత ఉన్నది? లాంటి సమగ్ర సమాచారం సేకరిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో 113 బీసీ కులాలున్నాయని ప్రభుత్వం తేల్చింది. అయితే ఇందులో సంచార కులాలు లేవు. సంచార కులాల జనాభా ఎంతో కూడా స్పష్టంగా లేదు. ఆ సమాచారాన్ని సేకరించాల్సి ఉన్నది.

బీసీల సమగ్ర జీవన విధానాన్ని అధ్యయనం చేయటానికి ప్రధానంగా జనాభా లెక్కలపైనే ఆధారపడాలి. అయితే 2011లో కేంద్ర ప్రభుత్వం చేసిన జనాభా గణనను ఆధారంగా తీసుకోవాలా? లేదా తెలంగాణ ప్రభుత్వం ఒకేరోజు వినూత్నంగా జరిపిన 'సమగ్ర కుటుంబ సర్వే'ను ఆధారంగా తీసుకోవాలా? లేక కొత్తగా మళ్లీ బీసీల జనాభా గణనను తీసుకోవాలా? అన్న అంశాలు ఇప్పుడు బీసీ కమిషన్ ముందున్నాయి. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలు, ప్రైవేట్ వ్యవస్థలు, ఐటీ రంగాల్లో అట్టడుగు కులాల వారు ఎంతమంది ఉన్నారు? అందులో బీసీలు ఎంత మంది? ఎంబీసీలు ఎంత మంది? సంచార జాతుల వారు ఎంత మంది? సమగ్రంగా ఈ లెక్కలు తీయాల్సి ఉన్నది. ఎంబీసీలుగా నిర్ణయించేటప్పుడు ఆయా కులాల చారిత్రక పాత్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇందుకు జరిగే సమగ్ర సర్వేలో క్వాంటిటేటీవ్, క్వాలిటేటీవ్ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటికే ఎంబీసీలకు సంబంధించి యూపీ, బీహార్, తమిళనాడులో ఒక వ్యవస్థ ఉన్నది. ఆ రాష్ట్రాలను అధ్యయనం చేయాల్సి ఉన్నది.

> ఎం బీసీలుగా గుర్తించేటప్పుడు వారి కమ్యూనిటీ సోషల్ క్యాపిట్‌ను చూడాలి. ప్రభుత్వ లక్ష్యం, కేసీఆర్ ఆలోచనల దృష్టి, బీసీ కమిషన్ చేస్తున్న సమగ్ర అధ్యయనం-అన్నీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బహుజనులకు కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకే. తెలంగాణ బహుజనులు సుఖసంతోషాలతో వర్ధిల్లే విధంగా చేయడంలో ఈ కృషి పునాదిగా ఉంటుంది.

విద్య, ఉద్యోగ విషయాల్లో ఈ 52 శాతానికి సంబంధించిన వారికి రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నది. కేసీఆర్ దీన్ని సవాల్‌గా తీసుకున్నారు. బీసీలలో అన్నివర్గాల వారికి అన్నిరంగాల్లో సమ ప్రాధాన్యం కల్పించాలన్న ఆలోచనతో ఆయన తెలంగాణ రాష్ట్ర బీసీ డిక్లరేషన్‌ను ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

పేదరికం నుంచి రిజర్వేషన్లను చూడకూడదన్న ఆలోచనలున్నాయి. ప్రజాస్వామ్యసారం ప్రాతినిధ్యతతో ఉంటుంది. అన్నివర్గాలకు, కులాలకు, లింగాలకు ప్రాతినిధ్యం ఉండాలి. ఇది సంక్లిష్ట సమాజం. అన్నిరంగాల్లో బీసీలకు ప్రాతినిధ్యం ఉండాలన్న కోణం నుంచి రిజర్వేషన్లను చూడాలి. మండల్ కమిషన్‌లో బీసీలకు రిజర్వేషన్లు అన్నారు. కాని ఓబీసీ అని అందులో స్పష్టంగా చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం ముందు కూడా ఈ రిజర్వేషన్ల అంశం పెద్ద సవాల్‌గానే మిగిలింది. ఓబీసీ, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్, ఎక్స్‌ట్రీమ్లీ బ్యాక్‌వర్డ్ క్లాస్, నోమాడిక్, సెమి నోమాడిక్ కులాల విభజన చేయవలిసి ఉన్నది. దీనిలో ఎవరు ఓబీసీలు, ఎవరు ఎంబీసీలన్న విషయం తేల్చాల్సి ఉన్నది. బీసీలపై ఆధారపడ్డ ఆశ్రిత కులాలున్నాయి. వారిని ఇప్పటివరకు ఏ ప్రభుత్వం బీసీలుగా గుర్తించలేదు. తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ఈ ఆశ్రిత కులాలను కూడా బీసీల్లో చేర్చేందుకు అధ్యయనం చేయమని బీసీ కమిషన్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్య.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచార జాతులవారు 75 లక్షల మంది ఉన్నారని తెలుస్తున్నది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో సంచారజాతులు 35 లక్షల వరకు ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. సంచార జాతులు 36 వరకు ఉన్నాయని వీటిపై అధ్యయనం చేసిన కొందరు చెబుతుంటే, 36 సంచార కులాలు మాత్రమే ఉన్నాయని మరికొందరు వాదిస్తున్నారు. మొత్తమ్మీద ప్రభుత్వ బాబితాలో 23 సంచార జాతులు లేవని కొందరు వాదిస్తున్నారు. రామజోగి, మందెచ్చుల, బాగోతుల, రుంజ, పెక్కర, ఏదిలవారు, గౌడజెట్టిలు, బొప్పల, కడలిచివర, సరగాని, సన్నాయిలు, బైల్ కమ్మరుల వంటి కులాలు ఇప్పటివరకు బీసీకులాల జాబితాలో లేవు. బీసీలలోనే అథమస్థాయిలో ఉన్న మోస్ట్ బ్యాక్‌వర్డ్ కులాలను, సంచారజాతుల వారిని అక్కున చేర్చుకొని వారి గురించి ఆలోచించటమే కేసీఆర్ చేసిన గొప్ప పని. సంచారజాతుల వారిని విద్య, ఉద్యోగ రంగాల్లో నిలబెట్టాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం.

బీసీలకు, ఎంబీసీలకు రక్షణ ఉన్నది. కానీ, సంచార జాతులకు లేదు. వారికి సంపూర్ణమైన రక్షణ కల్పించాల్సి ఉన్నది. ఈ విషయాన్ని కాకకలేల్కర్ రిపోర్ట్‌లో స్పష్టంగా చెప్పారు. సంచారజాతులకు సంబంధించి అనంతరామ్ కమిషన్‌లో కొంతమేరకు పరిశోధించటం జరిగింది. కాని కొత్త సంచార జాతులను గుర్తించలేదు. పాత ప్రభుత్వ జాబితాలనే వారు తీసుకొన్నారు. బీసీ(ఎ) గ్రూప్‌లో కొన్ని సంచార జాతుల వారున్నారు. అన్ని బీసీ కులాలవారు అన్నిరంగాల్లో ఎదుగాలంటే ఏం చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం ఈ అధ్యయనం చేస్తున్నది.

బీసీ, ఎంబీసీ, సంచారజాతుల వర్గీకరణ, ఇందుకు సంబంధించి బీసీ కులాల సమగ్ర సర్వే జరుగాల్సి ఉన్నది. ఈ అధ్యయనంలో విద్యా, ఉద్యోగ విషయాల్లోనే గాక సాంస్కృతిక, మత, జీవన విధానానికి సంబంధించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నది. ఎంబీసీలుగా గుర్తించేటప్పుడు వారి కమ్యూనిటీ సోషల్ క్యాపిట్‌ను చూడాలి. ప్రభుత్వ లక్ష్యం, కేసీఆర్ ఆలోచనల దృష్టి, బీసీ కమిషన్ చేస్తున్న సమగ్ర అధ్యయనం-అన్నీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బహుజనులకు కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకే. తెలంగాణ బహుజనులు సుఖసంతోషాలతో వర్ధిల్లేవిధంగా చేయడంలో ఈ కృషి పునాదిగా ఉంటుంది.

(వ్యాసకర్త: బీసీ కమిషన్ సభ్యులు)

ప్రాజెక్టులను అడ్డుకోవద్దు

తెలంగాణం



మెట్టు శ్రీనివాస్

ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఎస్సారెస్పీ ప్రాజెక్టు పునరుజ్జీవన పథకాన్ని ప్రారంభించడానికి ఆగస్టు 9వ తేదీ మధ్యాహ్నం 3:15 గంటలకు ప్రగతి భవనం నుంచి నిజామాబాద్ జిల్లా పోచంపాడుకు కారులో బయల్దేరారు. వారితో కలిసి ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేను వెళ్లాం. మా ప్రయాణం సుమా రు 3 గంటలు సాగింది. ఈ సమయమంతా కేసీఆర్ గారు మాతో రాష్ట్ర అభివృద్ధి, వ్యవసాయరంగం, ప్రాజెక్టుల ప్రాధాన్యం, చెరువు కట్టల నిర్మాణం, మొక్కల పెంపకం, టూరిజం గురించి వివరిస్తూనే ఉన్నారు. వారి మాటల్లో రాష్ట్ర ప్రజల అభివృద్ధి పట్ల ఉన్న అంకితభావం, వారి మహోన్నతమైన ఆశయాలు రాష్ట్రాభివృద్ధి కోసం వారి 'విజన్' అర్థమైంది. ఇదొక అద్భుత అనుభవం. నా జీవితంలో మరిచిపోలేని సమయం. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. '1996లో నిర్మల్ నియోజకవర్గంలో ఒక ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఒకరోజు సమయం దొరికితే ఎస్సారెస్పీ ప్రాజెక్టు చూడటానికి పోతే గేట్లు తుప్పు బట్టి ఉన్నాయి. గ్రీస్ లేదు, ఆయిలింగ్ లేదు. ప్రాజెక్టు రోడ్డు మీద గుంతలు పడ్డాయి. ప్రాజెక్టును పట్టించుకున్నోడే లేడు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు జరిగిన అన్యాయానికి నిదర్శనం అది. అప్పుడే తన పక్కన ఉన్న మిత్రునితో చెప్పిన. నేను బతికుంటే, నా ఆరోగ్యం సహకరి స్తే ఈ సారి తెలంగాణ ఉద్యమం ప్రారంభిస్తా, నేను చివరిదాకా కొట్లాడుతానని చెప్పిన.. అదే శ్రీరాంసాగర్ కట్ట మీద రెండు దశాబ్దాల అనంతరం తెలంగాణను కొట్లాడి సాధించిన నాయకుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది' అన్నారు. నాకు తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసమే కేసీఆర్ జన్మించారనిపించింది.

ఏ సమాజమైనా అభివృద్ధి చెందాలంటే ముందు వ్యవసాయం అభివృద్ధి చెందాలి. గ్రీస్ తత్త్వవేత్త ప్లేటో 'If you are late in doing one thing Agriculture Sector, you are late all things..' అని సుమారు 2400 ఏండ్ల కిందట పేర్కొన్నారు. వ్యవసాయరంగంలో వెనుకబడితే మిగతా అన్నిరంగాల అభివృద్ధిలో ముందుకుపోలేం. ప్రజలకు కడుపునిండా తిండి పెట్టాలంటే వ్యవసాయం మీదనే ఆధారపడాలి. వ్యవసాయరంగమే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ముడిపదార్థాలు అందజేస్తుంది. అత్యధిక జనాభాకు ఉపాధిని కల్పిస్తుంది. వ్యవసాయరంగం బాగుంటే రాష్ట్రం మొత్తం సుభిక్షంగా ఉంటుంది. వ్యవసాయోత్పత్తులు ఎగుమతి చేయడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం సంపాదిస్తుంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక, సేవా రంగాలకు ప్రాముఖ్యం పెరిగినప్పటికి వ్యవసాయరంగానికి నేటికీ ఆదాయం, ఉద్యోగిత, ఉపాధి కల్పన లాంటి అంశాల్లో ప్రాధాన్యం ఉన్నది. ఏండ్ల తరబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశాయి. దీంతో దేశం, రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయి. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే నీటి పారుదల సౌకర్యాలు కల్పించాలి. అందుకే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో 'నీళ్ళు' ఒక ప్రధాన ఎజెండాగా ముందుకువచ్చింది.

మనది ప్రధానంగా వ్యవసాయ సమాజం. రాష్ట్ర జనాభాలో దాదాపు 54.49 శాతం జనాభా జీవనోపాధి కోసం ఏదో ఒకవిధంగా వ్యవసాయ కార్యకలాపాల మీద ఆధారపడి ఉన్నది. కాబట్టి మొట్టమొదట వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరుచాలి. వ్యవసాయ అభివృద్ధి అంటే భూ సంబంధాల్లో ప్రగతిశీల మార్పులు తెస్తూ, అవసరమైన నీటి పారుదల సౌకర్యాలు కల్పించడం కీలకం. సమతౌల్య పంటల విధానం విత్తనాలలో రైతులకు స్వావలంబన చేకూర్చాలి. మార్కెట్ వసతులు, గిడ్డంగులు నిర్మించాలి. గిట్టుబాటు ధరలు ఉండాలి, పరపతి సౌకర్యం ఉండాలి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన 1956-57లో తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయానికి చెరువులు ప్రధాన ఆధారం. అప్పుడు మొత్తం సాగుభూమిలో 801 వేల హెక్టార్లలో 66.5శాతం చెరువుల కింద సాగు అయ్యేది. కాలువల ద్వారా 11.6, బావుల ద్వారా సాగైన భూమి 16.2 శాతం మాత్రమే. 1956-57 నుంచి 2013-14 మధ్య (57 ఏండ్ల కాలంలో) కాలువల ద్వారా సాగయ్యే భూమి విస్తీర్ణం పెద్దగా మారలేదు. (2013-14లో ఇది 12.7 శాతం) బావుల కింద సాగయ్యే భూమి విస్తీర్ణం 1956-57లో 16.2 శాతం నుంచి 2013-14లో 74.8 శాతానికి పెరిగింది. ఇది తెలంగాణ రైతాంగంపై పెనుభారం మోపింది. ఇదే కాలంలో చెరువుల ద్వారా సాగయ్యే భూమి 66.5 నుంచి 10 శాతానికి తగ్గింది. చెరువుల మరమ్మతు, పునరుద్ధరణపై గత ప్రభుత్వాల నిర్లక్ష్యం ఈ స్థితికి కారణం. రైతాంగ సంక్షోభానికి ఇదే మూలం.

ఆంధ్రప్రదేశ్‌లో విలీనమయ్యేనాటికి హైదరాబాద్ రాజ్యంలో 16వేల పెద్ద చెరువులు, 50 వేల చిన్న చెరువులుండేవి. వీటిలో 11 వేల చెరువులు అదృశ్యమయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు హారతైపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో నదీజలాల్లో మన వాటా ప్రకారం మనం నీళ్లు వాడుకోలేకపోయాం. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ వాటా 1250 టీఎంసీలు. మరో 150 టీఎంసీలకు పైగా మిగులు జలాల్లో తెలంగాణ వాటా ఉన్నది. ఆంధ్రా పాలకులు ఈ నీటిని వాడుకునే ప్రాజెక్టులు కట్టలేదు. ప్రాజెక్టులన్నింటినీ అంతర్రాష్ట్ర వివాదాల్లోకి నెట్టేశారు. వివాదాల సాకు చూపి ప్రాజెక్టులను పక్కన పడేశారు.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వ్యవసాయ నీటి కథ రాసుకుంటే రామాయణమంత.. వింటే భారతమంత. ఉద్యమనేతగా నీటి గోసను చూసినందుకే తెలంగాణ సాగునీటి రంగాన్ని పట్టించుకున్నారు. సాగునీటి రంగాన్ని అభివృద్ధి పరుచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విధ్వంసమైన చెరువులను పునర్నిర్మించేందుకు 'మిషన్ కాకతీయ' అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 46 వేల చెరువులను పునర్నిర్మించే లక్ష్యంతో ముందుకుసాగుతున్నది. ఏడాదికి 9060 చెరువుల చొప్పున పునర్నిర్మిస్తున్నారు. దీనికోసం ఐదేళ్ళలో 22 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే రెండు దశల్లో 19,500 చెరువులు పూర్తిగా బాగయ్యాయి. మూడో దశలో 6,250 చెరువుల పునరుద్ధరణ లక్ష్యంగా పెట్టుకున్నది ప్రభుత్వం. మిషన్ కాకతీయ అమలు ఫలితంగా 2016-17 పంట కాలంలో 15 లక్షల ఎకరాలు చెరువుల కింద సాగులోకి వచ్చాయి. 5 దశలు పూర్తయిన తర్వాత చెరువుల కింద 25 లక్షల ఎకరాలు సాగులోకి రానున్నాయి.

> తెలంగాణలో కోటి ఎకరాలకు నీరందించేందుకు కదులుతున్నది. ప్రాజెక్టుల నిర్మాణం తెలంగాణ ప్రజల బతుకుదెరువు. కాబట్టి ప్రజలు ప్రతిపక్షాల దురాగతాలను అడ్డుకోవాలి. తెలంగాణను అభివృద్ధి కానివ్వండి, ప్రాజెక్టులను కట్టనియ్యండి అని నిలదీయాలి.

తెలంగాణలో కోటి ఎకరాలకు నీరందించడం లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం, కొత్త ప్రాజెక్టులు నిర్మించడంతో పాటుగా ఎన్నో ఏళ్ళ నుంచి ఉన్న నీటి వనరులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. అందులో భాగంగానే ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం చేపట్టారు. గోదావరి, కృష్ణా నదులపై 23 మేజర్, 13 మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. 2017-18లో ప్రాజెక్టుల నిర్మాణం కోసం దేశంలో ఏ ప్రభుత్వం ఖర్చుపెట్టని విధంగా 43 వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. మొత్తం తెలంగాణ వ్యాప్తంగా కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చేవిధంగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం ముమ్మరం చేసింది. తెలంగాణలో కోటి ఎకరాలకు నీరందించేందుకు కదులుతున్నది. ప్రాజెక్టుల నిర్మాణం తెలంగాణ ప్రజల బతుకుదెరువు. కాబట్టి ప్రజలు ప్రతిపక్షాల దురాగతాలను అడ్డుకోవాలి. తెలంగాణను అభివృద్ధి కానివ్వండి, ప్రాజెక్టులను కట్టనియ్యండి అని నిలదీయాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9, Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పట్టాలు తప్పిన దురంతో

కొండచరియ విరిగిపడటంతో నేలపై ఒరిగిన 9 బోగీలు

ప్రయాణికులు సురక్షితం! ■ పది రోజుల వ్యవధిలో నాలుగో ప్రమాదం



పట్టాలు తప్పిన దురంతో ఎక్స్‌ప్రెస్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న యువకులు

ఆసాన్‌గావ్: దేశంలో వరుస రైలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కేవలం పది రోజుల వ్యవధిలో నాలుగో ప్రమాదం సంభవించింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఒక్కసారిగా కొండచరియ విరిగిపడటంతో దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. 18 బోగీలతో నాగ్‌పూర్ నుంచి ముంబై బయలుదేరిన ఈ రైలు వసింద్, ఆసాన్‌గావ్ రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఉదయం పట్టాలు తప్పింది. ఇంజిన్, 9 బోగీలు పట్టాలు తప్పాయని, ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని అధికారులు పేర్కొన్నారు. కొండచరియ విరిగిపడడాన్ని గమనించిన డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించారని, ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పిందని రైల్వే బోర్డ్ చైర్మన్ అశ్వని లోహానీ వివరించారు. ప్రయాణికుల్ని తరలించేందుకు 35 బస్సుల్ని ఘటనాస్థలికి పంపామని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలను చేపట్టామని, ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. బోగీలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. మరో రైల్వే అధికారి మాట్లాడుతూ ప్రమాదానికి గల కారణాలు సరిగ్గా తెలియరాలేదని చెప్పారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల పట్టాల్లోని కొంత భాగం కొట్టుకుపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నదని పేర్కొన్నారు. మరోవైపు ఇదే రైలులో ప్రయాణిస్తున్న పీటీఐ వార్తా సంస్థ విలేకరి జస్టిన్ రావు మాట్లాడుతూ ప్రమాద సమయంలో ప్రయాణికులు నిద్రలో ఉన్నారని, రైలు పట్టాలు తప్పడంతో వారు బెర్తుల నుంచి కింద పడిపోయారని పేర్కొన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో కైఫీయత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 100 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ నెల 19న ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో 23మంది మృతిచెందగా, 60మంది గాయపడ్డారు. 25న ముంబైలో లోకల్ రైలు పట్టాలు తప్పడంతో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు.

హరిత ప్రియుడు.. హిమాచల్ బాలుడు

- మూడేండ్ల నుంచి మొక్కలు నాటుతున్న విద్యార్థి
- 100 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం



సిమ్లా: చిన్నప్పుడు పర్యావరణం గురించి చదువుకొని అంతటితో వదిలేస్తాం. కానీ హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్‌మౌర్ జిల్లా భాంగడి గ్రామానికి చెందిన జైచంద్ పచ్చదనాన్ని పెంపొందించడానికి మూడేండ్ల నుంచి పాటుపడుతున్నాడు. 100కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. తాను ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు 'పర్యావరణ పరిరక్షణ-పచ్చదనం' గురించి తెలుసుకున్న జైచంద్ మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నాడు. తన గ్రామం నుంచి జిల్లా కేంద్రం వరకు దాదాపు 90 కిలోమీటర్లు ప్రయాణించి బంజరు భూములను పరిశీలించాడు. అనంతరం మొక్కలు నాటడాన్ని ప్రారంభించాడు. తాను చదువుకుంటున్న పాఠశాల పరిసరాల్లో, తన కుటుంబానికి చెందిన భూమిలో ఇలా పలు ప్రాంతాల్లో మొక్కలను నాటాడు. ప్రస్తుతం జైచంద్ 11వ తరగతి చదువుతున్నాడు. అతడి కృషిని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం పర్యావరణ అవార్డుతో సత్కరించింది. జైచంద్ మాట్లాడుతూ మొక్కలు నాటడానికి తాను ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని చెప్పాడు. నర్సరీలు, ఉద్యాన శాఖ వద్ద మొక్కలను సేకరిస్తుంటానని, కొన్ని సందర్భాల్లో అడవికి వెళ్లి చిన్నచిన్న మొక్కలను సేకరిస్తుంటానని తెలిపాడు.

సాహసంతో నిర్ణయాలు.. అంకితభావంతో అమలు

రాజస్థాన్ సభలో ప్రధాని నరేంద్రమోదీ



ఖేల్‌గావ్ బహిరంగసభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ఉదయ్‌పూర్, ఆగస్టు 28: తమ ప్రభుత్వం సాహసంతో నిర్ణయాలు తీసుకుని అంకితభావంతో పూర్తి చేస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఇదివరకటి యూపీఏ ప్రభుత్వం వ్యవస్థను కుప్పకూల్చిందని ఆయన ఆరోపించారు. మంగళవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లా ఖేల్‌గావ్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. తాము చేపట్టిన అన్ని పనులను తామే పూర్తి చేస్తామని చెప్పారు. పూర్తయిన 873 కిలోమీటర్ల 11 జాతీయ రహదారి ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితమిచ్చారు. మరో 556 కిలోమీటర్ల ప్రాజెక్టులకు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. రాజస్థాన్‌లో చేపట్టిన మౌలికరంగ ప్రాజెక్టులు కొత్తమార్పులు తెస్తాయని అన్నారు. అభివృద్ధి కార్యకలాపాల వేగం, స్థాయి, పరిధి అన్నింటిని తమ ప్రభుత్వం సమూలంగా మార్చేసిందని చెప్పారు. దేశంలో భారీ వరదల వల్ల నష్టపోయినవారిని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. జీఎస్టీ వ్యవస్థను ప్రవేశపెట్టడం దేశంలో విశిష్ట సంస్కరణ అని ఆయన అభివర్ణించారు. కేంద్ర రోడ్డురవాణా, ప్రధాన రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ ఆగిపోయిన 57 ప్రాజెక్టులను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు.

బ్రిక్స్ సభ కోసం చైనాకు మోదీ

న్యూఢిల్లీ: చైనాలోని షియామెన్‌లో సెప్టెంబర్ 3-5 తేదీల్లో జరుగనున్న బ్రిక్స్ శిఖరాగ్రసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని విదేశాంగశాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 73 రోజులుగా కొనసాగిన డోక్లాం ప్రతిష్టంభన ముగిసిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ప్రధాని బ్రిక్స్ శిఖరాగ్ర సభకు హాజరవుతారని భారత విదేశాంగశాఖ తెలిపింది. చైనా పర్యటన అనంతరం మోదీ మయన్మార్‌లో వచ్చేనెల 5-7 తేదీల్లో పర్యటిస్తారని, దేశాధ్యక్షుడు యూ తిన్‌చావ్ ఆహ్వానం మేరకు ప్రధాని మయన్మార్ సందర్శిస్తున్నారని విదేశాంగశాఖ వివరించింది.

కేసుల నుంచి బాబా రాంపాల్‌కు విముక్తి



హిస్సార్, ఆగస్టు 29: హర్యానాలోని బర్వాలాలో ఉన్న సత్‌లోక్ ఆశ్రమానికి చెందిన బాబా రాంపాల్‌కు రెండు క్రిమినల్ కేసుల నుంచి విముక్తి లభించింది. అల్లర్లకు కారణమయ్యారని, ప్రభుత్వోద్యోగులను విధులు నిర్వహించకుండా అడ్డుకున్నారని 2014లో ఆయనపై ఈ కేసులు నమోదయ్యాయి. అభియోగాలకు తగిన ఆధారాలు లేకపోవడంతో హిస్సార్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముకేశ్‌కుమార్ మంగళవారం ఈ కేసుల్లో రాంపాల్‌తోసహా ఆయన అనుచరులను నిర్దోషులుగా ప్రకటించారు. వేర్పాటువాదం, హత్య కేసుల్లో కూడా నిందితుడుగా ఉన్నందున రాంపాల్ ఈ తీర్పు దరిమిలా జైలు నుంచి విడుదలయ్యే అవకాశం లేదు. రాంపాల్ కోర్టు వాయిదాల సమయంలో వేల సంఖ్యలో అనుచరులు వచ్చి గొడవచేయడంతో, ఆయనపై ఉన్న కేసుల విచారణకు సెంట్రల్ జైల్లోనే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. తీర్పు ఈ నెల 24నే వెలువడాల్సి ఉన్నా, డేరా బాబా కేసు విచారణపై ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో తీర్పును మంగళవారం ప్రకటించారు.

నీట్ తుదివిడుత కౌన్సెలింగ్ గడువు పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 29: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 2017-18 విద్యాసంవత్సరానికి నిర్వహించిన నీట్‌కు అర్హత సాధించిన విద్యార్థులకు తుదివిడుత కౌన్సెలింగ్ గడువును సుప్రీంకోర్టు పొడిగించింది. ఈ నెల 31 వరకు ఉన్న తుదివిడుత కౌన్సెలింగ్ గడువును సెప్టెంబర్ 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు తెలిపింది. ఇది కేవలం డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు మాత్రమే వర్తిస్తుందని, తర్వాత మరోసారి పొడిగింపు ప్రసక్తే లేదని స్పష్టంచేసింది. ఇప్పటికే కౌన్సెలింగ్ కోసం నమోదు చేయించుకుని, గత రెండు విడుతల కౌన్సెలింగ్‌లో ఏ కాలేజీలోనూ సీటు లభించని వారికి మాత్రమే గడువు పొడిగింపు వర్తిస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొన్నది.

కొత్త వెయ్యి నోటు లేనట్టే

న్యూఢిల్లీ : ప్రభుత్వం త్వరలో కొత్తగా రూ.వెయ్యి నోటు తీసుకొస్తుందన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. 'వెయ్యి నోటును మళ్లీ తీసుకురావాలన్న ప్రతిపాదనే లేదు' అని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు.



ముంబైలో భారీ వర్షాల కారణంగా వరదనీటితో పొంగిపొర్లుతున్న ఓ రహదారిని కుమారుడితో కలిసి దాటుతున్న తల్లి



ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే పైకి చేరిన వరదనీరు



వరద నీరు పట్టాలపైకి చేరడంతో ఓ స్టేషన్‌లో నిలిచిన లోకల్ రైలు

నీట మునిగిన ముంబై

కుండపోత వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం ■ నీట మునిగి ఇద్దరు, ఇల్లు కూలి ముగ్గురు దుర్మరణం

పోటెత్తిన సముద్రం.. మూడున్నర మీటర్ల ఎత్తు ఎగిసిపడుతున్న అలలు ■ మరో రెండు రోజులూ ఇదే స్థాయిలో వర్షాలు

ముంబై, ఆగస్టు 29:

దేశ వాణిజ్య రాజధాని ముంబైపై వరుణుడు పగబట్టాడా అన్న రీతిలో కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. వర్షాలు, వరదల కారణంగా రైలు, రోడ్డు రవాణాతోపాటు విమాన సర్వీసులు సైతం స్తంభించిపోయాయి. నగర రోడ్లు నదులను తలపిస్తున్నాయి. జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. థాణేలో డ్రైనేజీ కాలువల్లో పడిపోయి ఓ మహిళ, ఓ 14 ఏండ్ల బాలిక మరణించగా, విక్రోలిలో ఇల్లు కూలి ఇద్దరు పిల్లలు సహా ముగ్గురు మృతి చెందారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు ముంబై మహానగరంతోపాటు పొరుగున ఉన్న నవీ ముంబై, థాణే జిల్లాను సైతం కుదిపేశాయి. శాంటాక్రుజ్ వాతావరణ కేంద్రంలో 126 మిల్లీమీటర్లు, కొలాబా స్టేషన్‌లో 152 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్టు వాతావరణ విభాగం తెలిపింది. అనేక ప్రాంతాల్లో రైలు పట్టాలు నీట మునగడంతో ముంబైకి జీవనాడిగా చెప్పుకొనే సబర్బన్ రైళ్లను ఉదయం 11.30 గంటల తరువాత నిలిపివేశారు. సబర్బన్ రైళ్లు ఆగిపోవడంతో ప్రజలు రోడ్డు మార్గాన్ని ఆశ్రయించి అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని గంటల పాటు బాంద్రా – వర్లీ సీలింకు(సముద్రంపై నిర్మించిన బ్రిడ్జి మార్గం)ను సైతం మూసేశారు. దాదాపు 22 ప్రధాన రహదారులపై చెట్లు విరిగిపడినట్టు అధికారులు చెప్పారు. స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం హెచ్చరించింది. నగరంలో సగటు వర్షపాతం కన్నా తొమ్మిదిరెట్లు అధిక వర్షం (కేవలం మూడు గంటల్లోనే) నమోదైందని, ముంబైలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయని అధికారులు తెలిపారు. భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని వారు పౌరులను హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ముంబై విమానాశ్రయంలో విమానాలు దిగేందుకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఐదు విమానాలను సమీపంలోని విమానాశ్రయాలకు దారి మళ్లించామని అధికారులు చెప్పారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విమానాశ్రయంలో రన్‌వే సైతం కనిపించడం లేదని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేనే ఇండ్ల నుంచి బయటకు రావాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ముంబైలో మూడు గంటల్లో 88 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సుధీర్ నాయక్ చెప్పారు. దాదర్, అంధేరీ, వర్లీ, కుర్లా, సాకినాకా వంటి ప్రముఖ ప్రాంతాలు నీట మునిగాయని బీఎంసీకి చెందిన విపత్తు సహాయ బృందం అధికారులు చెప్పారు. ముంబైతోపాటు మహారాష్ట్ర అంతటా కురుస్తున్న వర్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో మాట్లాడారు. వరద ముంపుపై అప్రమత్తమైన నావికా దళం పరిస్థితి చేయిదాటితే సహాయ చర్యలకు వీలుగా హెలిక్యాప్టర్లను, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచింది.

సాయంత్రం పోటెత్తిన సముద్రం

భారీ వర్షాలకు తోడు అరేబియా సముద్రం కూడా పోటెత్తడం ప్రారంభించింది. మంగళవారం సాయంత్రం 4.30 గంటల తరువాత మూడు నుంచి మూడున్నర మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడటం ప్రారంభమైంది. దీంతో తీర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇటు వర్షాలు, అటు అలల నీటిని తట్టుకొనే స్థాయిలో మురుగునీటి పారుదల వ్యవస్థ లేదని అధికారులు పేర్కొన్నారు. పౌరులు తీర ప్రాంతంలో, బీచ్‌లకు విహారానికి వెళ్లకూడదని హెచ్చరించారు. వినాయక విగ్రహాల నిమజ్జనంపై మాత్రం అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

ముంబైతోపాటు పశ్చిమ మహారాష్ట్ర, గోవా, గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో మరో రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని శాంటాక్రుజ్‌లోని వాతావరణ విభాగం తెలిపింది. ఈమేరకు 'రెడ్ వార్నింగ్' జారీ చేసినట్లు డైరెక్టర్ చరణ్‌సింగ్ వెల్లడించారు. ఒడిశాలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతూ పశ్చిమ దిశగా సాగుతున్నందున భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. దాదాపు 12 సంవత్సరాల తరువాత ఈ స్థాయిలో వర్షాలు ముంబైని ముంచెత్తుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇంతకుముందు 2005 జూలైలో వచ్చిన వరదలు నగరాన్ని ముంచెత్తాయి. నాడు రికార్డు స్థాయిలో 24 గంటల వ్యవధిలో 94 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబైలో పది నుంచి 15 సెంటీమీటర్ల వర్షం సర్వసాధారణమని అధికారులు పేర్కొన్నారు.

అవిభక్త కవలలకు ఆపరేషన్

- తొలిదశ పూర్తి చేసిన ఎయిమ్స్ బృందం
- పాక్షికంగా తలల విడదీత
- కోలుకున్న తర్వాత మలిదశ



అవిభక్త కవలలు జగన్నాథ్, బలరాం

న్యూఢిల్లీ/భువనేశ్వర్, ఆగస్టు 28: ఒడిశాకు చెందిన రెండేండ్ల వయసున్న అవిభక్త కవలలను విడదీసే అరుదైన ఆపరేషన్ తొలిదశను ఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన వైద్యబృందం మంగళవారం విజయవంతంగా పూర్తి చేసింది. తలవద్ద కలిసి పుట్టిన కవలలను విడదీసేందుకు మొదటిమెట్టుగా భావించే శస్త్రచికిత్సను వారు సుమారు 20 గంటల పాటు అవిశ్రాంతంగా జరిపారు. తల నుంచి గుండెకు రక్తాన్ని తిరిగి చేరవేసే కీలకమైన రక్తనాళాలను విడదీసే బైపాస్ శస్త్రచికిత్స అనుకున్నట్టుగా జరుగడంతో వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం ఉదయం 9గంటలకు ప్రారంభమైన శస్త్రచికిత్స మంగళవారం ఉదయం 5 గంటలకు పూర్తయిందని ఓ సీనియర్ వైద్యుడు తెలిపారు. చిన్నారుల తలలను పాక్షికంగా మాత్రమే విడదీశారు. పూర్తిగా విడదీసేందుకు మరో విడుత శస్త్రచికిత్స అక్టోబర్‌లోగానీ, నవంబర్‌లోగానీ జరుగుతుందని వైద్యులు అంటున్నారు. అయితే తొలివిడుత శస్త్రచికిత్స ఫలితంఎలా ఉండనున్నదానిపై వైద్యులు పెదవి విప్పడం లేదు.

రెండోదశ చికిత్సకు అమెరికా నిపుణుడు

ఒడిశాలోని కాంధమాల్ జిల్లాలో జగన్నాథ్, బలరాం అనే పేర్లున్న కవలలు తలభాగం కలిసి ఉండే అరుదైన స్థితిలో జన్మించారు. దీనిని వైద్య పరిభాషలో 'క్రేనియోపాగస్' అంటారు. వీరిని విడదీసేందుకు 20 మంది వైద్య నిపుణుల బృందం ఏర్పాటైంది. ఎయిమ్స్ వైద్యబృందానికి అదనంగా జపాన్ శస్త్రచికిత్స నిపుణుడిని కూడా రప్పించారు. మెదడులో కలిసి ఉన్న రక్తనాళాలను విడదీయడం సాధ్యమేనా? అనేది నిర్ధారించుకునేందుకు పలుదఫాలుగా ఎమ్మారైలు, సీటీస్కాన్‌లు, యాంజియోగ్రామ్‌లు, ఇతర పరీక్షలు నిర్వహించారు. గతనెల 13న అవిభక్త కవలలను ఎయిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారు బాగానే కోలుకుంటున్నారని, రెండోదశ శస్త్రచికిత్స నిమిత్తం అమెరికా నుంచి వైద్యనిపుణుడిని పిలిపిస్తామని ఒడిశా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి పీకే జనా మీడియాకు చెప్పారు.

పిల్లలకోసం ఒడిశా ప్రజల ప్రార్థనలు

'జగ-బాలయ్య అని ముద్దుగా పిల్చుకునే ఆ పిల్లల ఆరోగ్యానికి ఒడిశా ప్రజలతోపాటు నేనూ దేవుణ్ని ప్రార్థిస్తున్నా.. జై జగన్నాథ్' అని సీఎం నవీన్ పట్నాయక్ ట్విట్టర్‌లో సోమవారం పేర్కొన్నారు. వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కోటి రూపాయలు మంజూరు చేశారు. పిల్లలు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు అవిభక్త కవలల తల్లిదండ్రులు పుష్పాంజలి, భూయా కన్హారా చెప్పారు. 30లక్షల మందిలో ఒకరు ఇలా జన్మిస్తారని, అయితే శస్త్రచికిత్సల్లో 20శాతం మాత్రమే విజయవంతం అవుతాయని న్యూరోసర్జన్ దీపక్ గుప్తా వివరించారు.

డోక్లాం నుంచి పాఠాలు నేర్చుకోండి

- భారత్‌కు చైనా ఆర్మీ సూచన
- రోడ్డు పనుల నిలిపివేతపై నిర్ణయం తీసుకోలేదని ప్రకటన

బీజింగ్/న్యూఢిల్లీ, ఆగస్టు 29: రెండున్నర నెలలకు పైగా కొనసాగిన డోక్లాం సరిహద్దు వివాదం సమసిపోయిన నేపథ్యంలో.. ఆ ప్రతిష్టంభన నుంచి పాఠాలు నేర్చుకోవాలని చైనా ఆర్మీ భారత్‌కు సూచించింది. బ్రిక్స్ దేశాల సమావేశానికి హాజరయ్యేదుకు ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో.. ద్వైపాక్షిక అంగీకారం మేరకు సోమవారం ఇరుదేశాలు సైనిక బలగాల ఉపసంహరణకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) సీనియర్ కర్నల్ వు కియాన్ ఒక ప్రకటనను విడుదల చేశారు. 'భారత్-చైనా ప్రతిష్టంభన తర్వాత చైనా ఆర్మీ ఇకపై ఎంతో అప్రమత్తంగా ఉంటూ జాతీయ ప్రాదేశికతను, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటుంది' అని కియాన్ చెప్పారు. 'ఈ ప్రతిష్టంభన నుంచి పాఠాలు నేర్చుకోవాలని మేము భారత్‌కు గుర్తుచేస్తున్నాం. అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను అనుసరించి సరిహద్దుల్లో శాంతిని, సుస్థిరతను కాపాడటానికి, ఇరుదేశాల సైన్యం మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం పెంపొందించడానికి కలిసి పనిచేయాల్సిందిగా కోరుతున్నాం' అని ఆయన అన్నారు.

రోడ్డు నిర్మాణం నిలిపివేయడంపై నిర్ణయం తీసుకోలేదు : చైనా

డోక్లాంలో రోడ్డు నిర్మాణం నిలిపివేతపై నిర్దిష్టమైన నిర్ణయమేదీ తీసుకోలేదని చైనా తెలిపింది. మంగళవారం ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ మాట్లాడుతూ.. 'సరిహద్దులను కాపాడుకోవడానికి, మెరుగైన వసతులను ఏర్పాటు చేసుకోవడానికి రోడ్డు నిర్మాణం సహా పలు మౌలిక వసతుల కల్పనకు చైనా కట్టుబడి ఉంది' అని తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని యథావిధిగా కొనసాగిస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 'వాతావరణం, క్షేత్రస్థాయి ప్రణాళిక.. వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవడంపైనే రోడ్డు నిర్మాణం ఆధారపడి ఉంటుంది' అని స్పష్టంచేశారు. డోక్లాంలో తమ సైన్యం యథావిధిగా గస్తీ కొనసాగిస్తుందని హువా చున్యింగ్ తెలిపారు. కాగా, మూడుదేశాల సరిహద్దుల్లో ఉన్న డోక్లాంలో ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు భారత్, చైనా తీసుకుంటున్న చర్యల్ని భూటాన్ స్వాగతించింది.

డోక్లాంలో భారత్‌కే అనుకూలం.. చైనా వెనుకంజకు కారణమిదే!

డోక్లాం విషయంలో 70 రోజులుగా దూకుడుగా వ్యవహరించిన చైనా ఉన్నట్టుండి ఎందుకు చల్లబడింది? యుద్ధానికి ముందుకెళ్తే చైనాకే తీవ్రనష్టం వాటిల్లుతుందని ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భారత్ చేసిన హెచ్చరికలే చైనా వెనుకంజకు కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. 'సిక్కిం సరిహద్దుల్లో డోక్లాం వెంబడి అనేక ప్రదేశాలు భారత సైన్యానికి అత్యంత అనువైనవి. చైనా కన్నా భారత్ బలగాలే అక్కడ వేగంగా కదులగలుగుతాయి. సముద్ర మట్టానికి వెయ్యి అడుగుల ఎత్తున ఉన్న ఆ ప్రదేశాలు భారత్‌కు వ్యూహాత్మకంగా అనుకూలమైనవి. వాటిని అర్థం చేసుకోకుండా ముందుకెళ్తే చైనాకు ఊహించని నష్టం వాటిల్లక తప్పదు' అని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ చేసిన సునిశిత హెచ్చరికలు చైనాను మెట్టు దిగేలా చేశాయని సమాచారం.

రబ్రీదేవి, తేజస్వీయాదవ్‌ను ప్రశ్నించిన ఐటీ

న్యూఢిల్లీ : ఆర్జేడీ అధినేత లాలూయాదవ్ భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్‌ను మంగళవారం ఆదాయపన్ను విభాగం అధికారులు గంటకు పైగా ప్రశ్నించారు. బినామీ ఆస్తులు, రూ.వెయ్యికోట్ల విలువైన భూముల వ్యవహారం కేసు విచారణలో భాగంగా ఇప్పటికే లాలూ కుమార్తె మీసాభారతి, అల్లుడు శైలేశ్‌కుమార్‌లను ప్రశ్నించిన విషయం తెలిసిందే.

చెలరేగిన ఉత్తర కొరియా

- జపాన్ మీదుగా ఖండాంతర క్షిపణి ప్రయోగం
- భయాందోళనలకు గురైన జపాన్ ప్రజలు
- ప్రజల రక్షణ కోసం ఏ చర్యకైనా సిద్ధం : షింజో అబే
- కిమ్ చర్యపై అమెరికా, జపాన్, దక్షిణకొరియా తీవ్ర అభ్యంతరం



ఉత్తరకొరియా ప్రయోగించిన క్షిపణి చేరుకున్న దూరాన్ని సూచిస్తూ టోక్యోలో ఏర్పాటు చేసిన భారీ తెర

సియోల్, ఆగస్టు 29: వరుస క్షిపణి ప్రయోగాలతో రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్న ఉత్తరకొరియా మరోసారి చెలరేగిపోయింది. జపాన్‌ను వణికిస్తూ... మంగళవారం మరో క్షిపణిని ప్రయోగించింది. ఈసారి బాలిస్టిక్ క్షిపణి జపాన్ మీదుగా ప్రయాణించి ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలోని హొక్కైడో ప్రాంతానికి ఉత్తర దిశగా పడింది. ఈ ప్రయోగంపై అమెరికా, జపాన్, దక్షిణ కొరియా మండిపడుతున్నాయి. ఉత్తర కొరియా ఈ ఏడాదిలో ప్రయోగించిన 13వ క్షిపణి ఇది కాగా, ఇప్పటివరకు జరిపిన వాటిల్లో ఇదే సుదూర క్షిపణి ప్రయోగం కూడా. అమెరికా మిలిటరీ బేస్ ఉన్న గ్వామ్ దీవి లక్ష్యంగా మధ్యతరహా క్షిపణిని ప్రయోగిస్తామని కొద్దిరోజులుగా చెప్తున్న ఉత్తరకొరియా మంగళవారం ప్రయోగించింది ఆ క్షిపణే కావచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. మిసైల్ కూలిన ప్రాంతానికి సమీపంలోనే గ్వామ్ దీవి ఉండగా, ప్రస్తుతం అక్కడ అమెరికా, దక్షిణకొరియా సంయుక్త యుద్ధవిన్యాసాలు జరుపుతుండటం గమనార్హం.

భయాందోళనలో జపాన్ ప్రజలు

భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ శివారులోని సునన్ ప్రాంతం నుంచి ప్రయోగించిన క్షిపణి 2700 కిలోమీటర్లు ప్రయాణించి జపాన్ ద్వీపం ఉత్తర భూభాగాన్ని దాటుకుంటూ ఆవల ఉన్న పసిఫిక్ మహా సముద్రంలో పడింది. తమ వైపు క్షిపణి దూసుకొస్తున్నదని గుర్తించిన జపాన్ ప్రభుత్వం ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. హిరోషిమా, నాగసాకి అణుదాడి వారి కళ్లముందు కదలాడింది. భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించిన క్షిపణి జపాన్‌లోని కేప్ ఎరిమో పట్టణ సముద్ర తీరంలో మూడు భాగాలుగా విడిపోయి కూలిపోయింది. ఈ ప్రయోగంతో ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని, ఓడలేవీ దెబ్బతినలేదని జపాన్ ప్రకటించింది. తమ ప్రజలను కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని జపాన్ ప్రధాని షింజో అబే తెలిపారు. తమ భూభాగం పైనుంచి క్షిపణిని ప్రయోగించడం తీవ్రమైన హెచ్చరిక అని, దానిని అంతే సీరియస్‌గా తీసుకుంటున్నామని చెప్పారు. పసిఫిక్ సముద్ర తీరంలో జపాన్ వెంబడి పలుచోట్ల ఉన్న అమెరికా నేవీ బేస్‌లలో గ్వామ్ దీవి కూడా ఒకటి. దీనిపై అణుదాడి చేస్తామని కిమ్ ఇటీవల హెచ్చరించారు కూడా. ఈమేరకు ఉత్తర కొరియా తాజాగా ప్రయోగించిన క్షిపణి గ్వామ్ దీవికి సమీపంలో పడింది. ఇంతకుముందు 1998లో, 2009లోనూ జపాన్ భూభాగం మీదుగా ఉత్తర కొరియా క్షిపణులు వెళ్లినప్పటికీ, అవి ఉపగ్రహ వాహక నౌకలు మాత్రమే.

ఉత్తరకొరియాపై ఒత్తిడి పెంచాలని జపాన్, అమెరికా నిర్ణయం

ఉత్తర కొరియాపై అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడిని మరింత పెంచాలని జపాన్, అమెరికా నిర్ణయించాయి. మంగళవారం క్షిపణి ప్రయోగం అనంతరం.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో చర్చించినట్లు జపాన్ ప్రధాని షింజోఅబే తెలిపారు. ఐక్యరాజ్యసమితి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, ఉత్తరకొరియాపై ఒత్తిడి తీసుకురావాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. క్షిపణి ప్రయోగం అనంతరం దక్షిణ కొరియా జాతీయ భద్రతాధికారి చుంగ్ ఇయోంగ్, ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి కాంగ్ క్యుంగ్‌హ్వా వేర్వేరుగా అమెరికా అధ్యక్షుడి జాతీయ భద్రతాసలహాదారు హెచ్ ఆర్ మెక్‌మాస్టర్, విదేశాంగశాఖ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌లతో చర్చించారు.

యోగాతో మానసిక ఆందోళన దూరం

చర్లపల్లి జైల్లో ఖైదీలకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నేరాలు చేసి జైలుకు వచ్చే ఖైదీల మానసికస్థితిలో మార్పు తీసుకొచ్చే యోగ, ధ్యానంపై జైళ్లశాఖ దృష్టిసారించింది. నేరాలు చేసి జైలుకు వస్తున్న వారిలో ఉన్న ఆవేశాన్ని దూరం చేసి, ఆరోగ్యవంతమైన ఆలోచనలు పెంచేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు జైలు అధికారులు వివరించారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో మంగళవారం ఖైదీలకు యోగ శిక్షణాశిబిరం నిర్వహించినట్టు పర్యవేక్షణాధికారి భాస్కర్ తెలిపారు. యోగ శిక్షకులు మాన్సి గులాటి ఖైదీలకు యోగ శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఖైదీలను మానసిక ఆందోళన నుంచి దూరం చేసేందుకు యోగ దోహదపడుతుందని ఆయన తెలిపారు.

మైనారిటీల విద్యకు ప్రాధాన్యం

టీఎంఆర్ఈఐఎస్ కార్యదర్శి షఫియుల్లా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలంగాణ మైనారిటీ స్కూల్స్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) కార్యదర్శి షఫియుల్లా పేర్కొన్నారు. మంగళవారం రోబోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముఫఖమ్‌జా ఇంజినీరింగ్ కళాశాలలో రోబోటిక్ వర్క్‌షాప్ అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 43 తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన ఏడోతరగతి విద్యార్థులకు రోబోటిక్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జనాబ్ జాఫర్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతి చర్యలో జోక్యం చేసుకోలేం

- ఖాళీ స్థలాల్లో పార్కులు ఏర్పాటు చేస్తే తప్పేమిటి?
- పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని భరత్‌నగర్‌లో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలంలో పార్క్ ఏర్పాటుపై దాఖలైన వ్యాజ్యంలో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. ఖాళీ స్థలాలను పార్క్‌లుగా మార్చితే తప్పేమిటని పిటిషన్ దాఖలుచేసిన వ్యక్తిని హైకోర్టు మంగళవారం ప్రశ్నించింది. ఇలాంటి వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది. ప్రతి విషయంలో కోర్టులు జోక్యం చేసుకోలేవని పేర్కొన్నది. భరత్‌నగర్‌లో ఖాళీ స్థలాన్ని పిల్లల ఆట స్థలంగా వినియోగిస్తున్నారని, ఆ స్థలంలో పార్క్ ఏర్పాటు చేస్తున్నారంటూ ఒక వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. పార్క్‌గా మార్చకుండా నిరోధించాలని అభ్యర్థించగా, ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టంచేసింది.



రూ.2 లక్షల విలువైన విదేశీ మద్యం పట్టివేత

ఇద్దరు పాత నేరస్తుల అరెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విదేశీ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు పాత నేరస్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన 13 బ్లాక్‌లేబుల్, 20 చివాస్ రీగల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లిలోని ఎక్సైజ్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ అజయ్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ హరికిషన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన ఉదయాంజల్‌రెడ్డి, బీ రమేశ్ అనే ఇద్దరు మధ్యప్రదేశ్‌లోని బేతలార్ జిల్లాలో విదేశీ మద్యాన్ని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తుంటారని తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఇద్దరిని పట్టుకున్నామని చెప్పారు. వీరు గతంలో మద్యం అమ్మకాల్లో నేరస్తులేనని, ఉదయాంజల్ రెడ్డి తండ్రి ఆనంద్‌రెడ్డి కూడా గత మే నెలలో వరంగల్ జిల్లాలో విదేశీ మద్యం విక్రయిస్తూ పట్టుపడ్డారని వివరించారు.

రాజధానిలో మోస్తరు వర్షం





ఖైరతాబాద్‌లో..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఐదు రోజులుగా వర్షం కురుస్తున్నది. నిత్యం వర్షం కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ఇబ్బందిగా మారుతున్నది. రోడ్లపై గుంతలు పడి నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. వినాయకచవితి నవరాత్రుల నేపథ్యంలో నిమజ్జనం చేసే వారితోపాటు గణేశ్ మండపాల నిర్వాహణకు ఇబ్బందిగా మారుతున్నది. మంగళవారం నగరంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు అత్యధికంగా బేగంపేటలో 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉప్పల్ బండ్లగూడ ప్రాంతంలో 2.6 సెం.మీ, సరూర్‌నగర్‌లో 1.3, రాజేంద్రనగర్‌లో 1.2 సెం.మీల వర్షపాతం నమోదైంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, తార్నాక, లాలాపేట, నాచారం, మల్లాపూర్, ఉప్పల్, మేడిపల్లి, సరూర్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, సంతోష్‌నగర్, చంపాపేట్, అంబర్‌పేట్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం కూడా నగరంలో వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

– హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

పాతబస్తీలో నకిలీ బాబా అరెస్ట్

- మంత్రాలతో మగ పిల్లాడు పుట్టేలా చేస్తానని వెకిలి చేష్టలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- పోలీసుల అదుపులో మగ సంతానం కోసం వేధించిన అత్తామామ





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సత్యనారాయణ, పక్క చిత్రంలో నకిలీ బాబా షేక్ అబ్దుల్ రహీం

చార్మినార్: ఆధునిక కాలంలోనూ మంత్రాలకు చింతకాయలు రాలుతాయని నమ్ముతున్న వారిని ఆసరా చేసుకొని నకిలీ బాబాలు బాధితులను నిలువునా ముంచుతున్నారని చార్మినార్ డీసీపీ సత్యనారాయణ తెలిపారు. 'ఈ బాబాకు చాలా మహిమలు ఉన్నాయి.. ఆయన చెప్పినట్టు వింటే నీ కడుపున పండంటి మగ పిల్లాడు పుడుతాడు' అంటూ తన కోడలిని వేధింపులకు గురి చేస్తున్న అత్తామామలతోపాటు నకిలీబాబాను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్టు డీసీపీ చెప్పారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు. చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముండే మహ్మద్ సిద్ధిక్(55), సమీనా సుల్తానా(50) దంపతులకు కుమారుడు మహ్మద్ మన్సూర్ అలియాస్ సైఫ్ ఉన్నాడు. మన్సూర్‌కు నాంపల్లికి చెందిన హబీబ్ ఫాతిమా(19)తో గత ఏడాది వివాహమైంది. పెండ్లి జరిగిన కొన్ని నెలలకు మన్సూర్ ఉద్యోగరీత్యా అబుదాబికి వెళ్లిపోయాడు. మూడు నెలల తర్వాత ఫాతిమా గర్భవతి అయింది. ఈ క్రమంలో తమకు మగ పిల్లాడే కావాలని, తాము చెప్పినట్టు వింటే మగబిడ్డే పుడుతాడని అత్తామామలు నమ్మించారు. అత్తామామలకు విలువనిచ్చిన ఫాతిమా వారు చెప్పినట్టు వినడానికి సిద్ధపడింది. మొఘల్‌పురలో నివసించే నకిలీ బాబా షేక్ అబ్దుల్ రహీం అలియాస్ భాయ్‌మియా(68) వద్దకు ఫాతిమాను తీసుకెళ్లారు. బాబా చాలా మహిమ గలవాడని, గతంలో తనకు ప్రత్యేక పూజలు చేయడం వల్లే మన్సూర్ జన్మించాడండూ కోడలిని నమ్మించారు. బాబా చెప్పినట్టు నడుచుకుంటే తమ ఇంట్లో మగ పిల్లాడు తిరుగాడుతాడని తెలిపారు. ఇందుకు ఫాతిమా ఒప్పుకున్నది. నకిలీ బాబా షేక్ అబ్దుల్ రహీం ప్రత్యేక పూజలంటూ ఫాతిమాకు ద్రావణాలతోపాటు ఇతర పదార్థాలు ఇచ్చేవాడు. ఓ తైలంతో ఫాతిమా కడుపుపై మసాజ్ చేస్తూ వెకిలి చేష్టలకు పాల్పడ్డాడు. ఈ విషయమై ఫాతిమా అత్తామామలకు ఫిర్యాదు చేసినా, వారు పూజలో అవన్నీ మామూలే అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అత్తామామలు పట్టించుకోకపోవడంతో ఫాతిమా ఈ విషయాన్ని తన భర్తకు చెప్పింది. దీంతో మన్సూన్ భార్యను అబుదాబికి రప్పించుకున్నాడు. కొన్నాళ్లకు ఫాతిమా తిరిగి నగరానికి రాగానే, మళ్లీ బాబా వద్దకు వెళ్దామని అత్తామామలు వేధింపులకు గురి చేశారు. షేక్ అబ్దుల్ రహీం వద్ద చికిత్స తీసుకోలేనంటూ ఫాతిమా తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కొన్ని నెలల తర్వాత ఫాతిమా ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో షేక్ అబ్దుల్ రహీం వద్ద ఫాతిమా సరైన చికిత్స తీసుకోకపోవడం వల్లే ఆడపిల్ల పుట్టిందని అత్తామామలు ఆరోపించారు. 'మా అమ్మానాన్న చెప్పినట్టు నువ్వు నడుచుకోలేదు. అందుకే నీకు అడ పిల్లపుట్టింది' అని ఆరోపిస్తూ అబుదాబిలో ఉంటున్న భర్త మన్సూర్ ఫాతిమాకు తలాక్‌నామ నోటీసు జారీ చేశాడు. బాబా వద్ద చికిత్స పొందని కారణంగానే అడపిల్ల పుట్టిందని, తనతో ఉండలేనంటూ మన్సూర్ నోటీసులు జారీ చేయడంతో ఫాతిమా తల్లిదండ్రులతో కలిసి చార్మినార్ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ బాబాతోపాటు మన్సూర్ అమ్మానాన్నలను అరెస్ట్ చేశారు. షేక్ అబ్దుల్ రహీంపై చీటింగ్ కేసుతోపాటు నిర్భయ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తున్నామని డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీతోపాటు అదనపు డీసీపీ బాబురావు, చార్మినార్ ఏసీపీ అశోక్ చక్రవర్తి, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన చీటర్

6కోట్లకు బ్యాంక్ గారంటీకి నకిలీ పత్రాలు సృష్టించిన కోల్‌కతా ముఠా

ఐదేండ్ల కిందట హైదరాబాద్‌లోని ఓ కంపెనీకి 92 లక్షలు టోకరా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఐదేండ్లుగా తప్పించుకొని తిరుగుతున్న ఓ వైట్ కాలర్ చీటర్‌ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు మంగళవాం అరెస్ట్ చేశారు. రూ.6 కోట్లకు బ్యాంక్ గ్యారంటీ ఇస్తానని నమ్మించి బాధితుడి నుంచి రూ.92 లక్షలు ఈ చీటర్ కాజేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2012 ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లోని క్యోరీ ఒరీమిన్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యాన్ని కోల్‌కతాకు చెందిన దీపక్ కుదేసియా గుర్‌గావ్‌కు చెందిన అలేన్‌జొరీ కంపెనీ సీఈవో, అధ్యక్షుడిగా పరిచయం చేసుకున్నాడు. తాను నగదుకు బ్యాంక్ గ్యారంటీ ఇస్తానని నమ్మించాడు. దీంతో క్యోరీ ఒరీమిన్ కంపెనీ యాజమాన్యం ఏపీ జెన్‌కోకు బొగ్గును సరఫరా చేసేందుకు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి అవసరమైన రూ.6 కోట్లకు బ్యాంక్ గ్యారంటీ కావాలని అడిగింది. దీంతో దీపక్ కుదేసియా తన కంపెనీ భాగస్వాములైన గోవింద్ యశ్వంత్ సోలంకర్, సుమిత్ అగర్వాల్‌తో కలిసి ఒప్పందం కుదుర్చుకున్నాడు. రూ.6 కోట్లకు బ్యాంక్ గ్యారంటీ పత్రాలను అందించేందుకు ప్రాథమికంగా దీపక్ కుదేసియా రూ.92 లక్షలు ఇవ్వాలని అడగడంతో క్యోరీ ఒరీమిన్ కంపెనీ వారి ఖాతాలో జమచేసింది. ఈ నగదు అందగానే దీపక్ బ్యాంక్ గ్యారంటీకి సంబంధించిన కొన్ని పత్రాలను అందించాడు. పరిశీలనలో అవి నకిలీవని తేలింది. ఆ తర్వాత బాధిత కంపెనీ యాజమాన్యం ఫిర్యాదుతో పోలీసులు అప్పట్లో దీపక్ కుదేసియా, యశ్వంత్‌ను అరెస్ట్ చేశారు. ఈ చీటింగ్‌లో దాదాపు రూ.40 లక్షలను సుమిత్ అగర్వాల్‌కు ఇచ్చామని పట్టుబడిన నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. అప్పటి నుంచి సీసీఎస్ పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. చివరకు మంగళవారం సుమిత్ అగర్వాల్‌ను అరెస్ట్ చేశారు.

'క్రైం సీన్ ఎవిడెన్స్'పై వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: క్రైం సీన్ వీడియోగ్రఫీ ఎవిడెన్స్‌పై మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రం నుంచి అదనపు డీజీపీ (సీఐడీ) గోవింద్‌సింగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నేర సంఘటనా స్థలం, నేర స్థలంలో లభించే ఆధారాలను వీడియోలో చిత్రీకరించడం, వచ్చే ఫలితాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించినట్టు ఏడీజీపీ గోవింద్‌సింగ్ తెలిపారు. న్యాయస్థానం సూచనలు, క్రైం సీన్‌ను వీడియోలో చిత్రీకరించడంతో ప్రయోజనాలు, సంఘటనకు ఎవిడెన్స్‌గా వీడియో చిత్రీకరణ ఉండడంతో వచ్చే ఫలితాలపై చర్చించామన్నారు. అన్ని రాష్ట్రాల పోలీస్ అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్టు ఆయన వెల్లడించారు.

కాఫ్ సిరప్ స్వాధీనం

- నిషా మందుగా వాడేస్తున్న మత్తుబాబులు
- మెహిదీపట్నంలో ఓ మెడికల్ షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి
- డాక్టర్ సిఫార్సు లేకుండా ఇస్తుండటంతో నిర్వాహకుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కొన్ని రోగాలను నయం చేసే మందులను ఇప్పుడు మత్తుబాబులు వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. మత్తుకు బానిసైనవారు ఈ మందులతో నిషాలో ఊగుతున్నారు. మత్తుబాబుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వీటిని కొంత మంది మెడికల్ షాప్ నిర్వాహకులు వైద్యుల ప్రిస్కిప్షన్ లేకున్నా అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న హైదరాబాద్ పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి మంగళవారం నగరంలోని మెహిదీపట్నం ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్ఎస్ మెడికల్ షాప్ యజమాని సర్ఫరాజ్ ఖాన్.. కోడిన్ పాస్‌పేట్ కాఫ్ సిరప్, అప్రోజోలమ్, స్పాస్మో ప్రాక్సివాన్ ట్యాబ్లెట్లను డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకున్నా యువతకు అమ్ముతున్నాడు. మెహిదీపట్నం ప్రాంతంలో చాలా మంది యువత మత్తుకు బానిసలై వీటిని మోతాదుకు మించి ఉపయోగిస్తున్నారని పోలీసుల విచారణలో తేలిసింది. వైద్యుల సిఫార్సు ఉంటేనే ఈ మందులను విక్రయించాల్సి ఉండగా, ఎస్ఎస్ మెడికల్ స్టోర్ నిర్వాహకుడు నిబంధనలను ఉల్లంఘించి వీటిని విక్రయిస్తున్నాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అతనిని అరెస్ట్ చేసి కోడిన్ పాస్‌పేట్ కాఫ్ సిరప్–34 బాటిళ్లు, అప్రోజోలమ్ –1,780, స్పాస్మో ప్రాక్సివాన్ ప్లస్–192 ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం సర్ఫరాజ్ ఖాన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు డ్రగ్స్ కంట్రోల్ బోర్డు అధికారులకు అప్పగించారు.

ఈ మందులు ఎందుకంటే..

- కోడిన్ పాస్‌పేట్ కాఫ్ సిరప్.. ఓపీయమ్ పదార్థం నుంచి వెలికితీయడం వల్ల ఈ మందును తీసుకున్నప్పుడు దగ్గు బారిన పడ్డ ఆ వ్యక్తి కొంత మత్తులో ఉండి నిద్రపోయి ఉపశమనం పొందుతాడు. దీంతో దగ్గు ఉన్నవారికి వైద్యులు ఈ సిరప్‌ను సిఫార్సు చేస్తారు. కానీ ఇప్పుడు ఇది మత్తుబాబులకు నిషా మందుగా తయారైంది. ఇది ఎక్కువగా తీసుకున్నా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని డ్రగ్స్ కంట్రోల్ బోర్డు అధికారులు, వైద్యులు స్పష్టం చేస్తున్నారు.
- అప్రోజోలమ్ ట్యాబ్లెట్లు.. సాధరణంగా 0.5 ఎంజీ, 2.5 ఎంజీ మోతాదులో ఉంటాయి. నిద్ర కరువై, రోజుల తరబడి నిద్రలేకుండా బాధపడే వారికి వైద్యులు ప్రిస్కెబ్ చేస్తారు. వీటిని దీర్ఘకాలికంగా వాడితే శ్వాస కోస, మొహం, నాలుక, పెదవులు ఉబ్బడం వంటి సమస్యలు తలెత్తుతాయని అధికారులు వివరిస్తున్నారు.
- స్పాస్మో ప్రాక్సివాన్ ప్లస్ ట్యాబ్లెట్లు.. తీవ్రంగా కడుపు నొప్పితో బాధడేవారికి వైద్యులు ఇస్తుంటారు. ఈ ట్యాబ్లెట్లు వేసుకోవడం వల్ల కొంత నిద్ర మత్తు పోంది ఉపశమనం పొందుతారు. దీనిని కూడా దీర్ఘకాలికంగా వాడితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కాఫ్ సిరప్, కడుపునొప్పి తగ్గించే ట్యాబ్లెట్లు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బంజారా సమాచార్ ఆధ్వర్యంలో 'బంజారా తీజ్ మేళా–2017', బంజారా కీర్తి పురస్కారాల ప్రదానోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, ఎమ్మెల్సీ రాములునాయక్, ఎమ్మెల్యే రవీంద్రకుమార్, గిరిజన సహకార సంస్థ చైర్మన్ ధారావత్ గాంధీనాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బంజారాలు ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక ఆర్థిక పరిస్థితులను విశ్లేషించారు.

– రవీంద్రభారతి, నమస్తే తెలంగాణ



నాలుగు కిలోల గంజాయి సీజ్

- నలుగురు నిందితుల అరెస్ట్



గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులు, గంజాయి ప్యాకెట్లతో ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య తదితరులు

ఘట్‌కేసర్/ చేవెళ్ల, నమస్తే తెలంగాణ: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి నుంచి రెండు కిలోల గంజాయితోపాటు 12 గంజాయి ప్యాకెట్లను ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కీసర మండలం అహ్మద్‌గూడలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. గంజాయి విక్రయిస్తున్న అనిల్ కుమార్‌ను (43) అదుపులోకి తీసుకొని 12 గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి ఒక్కో ప్యాకెట్ 140 గ్రాములు ఉన్నట్టు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపారు. అనిల్‌కుమార్‌ను ప్రశ్నించగా ధూల్‌పేట్‌లోని మంగళ్‌హాట్‌కు చెందిన రోహన్‌సింగ్ (21) గంజాయి విక్రయిస్తున్నట్టు తెలిపాడు. ఉన్నతాధికారుల అనుమతితో ధూల్‌పేట్‌లోని మంగళ్‌హాట్‌లో ఉంటున్న రోహన్‌సింగ్‌ను అరెస్ట్ చేసి అతని నుంచి రెండు కిలోలకు (2.205)పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అతడిని విచారించగా కిలో గంజాయిని రూ.5 వేలకు కొనుగోలు చేసి రూ.8 వేలకు విక్రయిస్తున్నట్టు చెప్పాడు. అహ్మద్‌గూడలో పట్టుబడిన నిందితుడు ఒక్కో ప్యాకెట్‌ను రూ.150కి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇరువురిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు వివరించారు. మరో ఘటనలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ సీఐ రాకేశ్ తెలిపారు. మంగళవారం చేవెళ్లలో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా దారూర్ మండలం రుద్రారానికి చెందిన కంది నర్సింహులు, చేవెళ్లకు చెందిన కొజ్జెంకి కృష్ణ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు మంగళవారం చేవెళ్ల మార్కెట్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 100 గ్రాముల గంజాయి, 50 గ్రాముల గంజాయి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వివరించారు.

రంగారెడ్డిలో ఏపీపీల నియామకం రద్దు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా పరిధిలోని వివిధ కోర్టుల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) నియామక ప్రక్రియను ఉమ్మడి హైకోర్టు మంగళవారం రద్దుచేసింది. నిబంధనలకు అనుగుణంగా మూడు నెలల్లో ఏపీపీల నియామకాన్ని చేపట్టాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు తాజా ఉత్తర్వులతో ఇటీవల జరిగిన ఏపీపీ నియామకాలు కూడా రద్దుకానున్నాయి. ఏపీపీల నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాలపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. హోంశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది వాదనలు చేస్తూ ఏపీపీలకు అర్హులైన ప్యానెల్ పేర్లతోపాటు సంబంధిత అభ్యర్థుల అప్రైజల్ రిపోర్ట్‌ను పంపలేదని నివేదించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం రంగారెడ్డి జిల్లా పరిధిలో అదనపు ఏపీపీల నియామక ప్రక్రియను రద్దుచేసింది. పూర్తిస్థాయి నియామక ప్రక్రియ జరిగే వరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించింది.



హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో తెలంగాణ ఉద్యానమహోత్సవం ప్రదర్శనను మంగళ వారం పరిశీలిస్తున్న అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
బుధవారం 30 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM



ఒకప్పుడు వ్యవసాయంలో వారి పాత్ర కేవలం కూలీలుగానే పరిమితం. కానీ వారి చేయి పడనిదే నాటు పడదు.. కోత మొదలు కాదు.. పంట చేతికి రాదు. కూలీ చేసిన చేతులే క్రమంగా వ్యవసాయ బాధ్యతలు చేపట్టాయి. నాగలి పట్టి దుక్కి దున్నాయి. ఆ తర్వాత పలక బట్టి అక్షరాలు నేర్చాయి. ప్రపంచాన్ని అవగాహన చేసుకొని వ్యాపార దిగ్గజాలుగా ఎదుగుతున్నారు. ఇప్పుడు ఓ మారుమూల పల్లె మహిళలు సంఘం పెట్టి ఒకరికొకరు తోడుగా ధాన్య వ్యాపారం చేస్తూ లక్షల రూపాయల లాభాలు గడిస్తున్నారు. వారి విజయగాథ ఇది..

భళా.. మహిళా!





ధాన్యపు గింజలు సేకరిస్తున్న దృశ్యం



ఆర్థిక సంవత్సరం లెక్కలు చూసుకుంటున్న సభ్యులు

మహిళలు వంటింటి కుందేళ్లు అనేది ఒకప్పటి మాట. ఇప్పుడు కాలం మారింది. అన్ని రంగాల్లో మేముసైతం దూసుకుపోతూ సత్తా చాటుతున్నారు. వంటిల్లును చక్కదిద్దడమే కాదు వ్యాపారాన్ని చక్కదిద్దగల నైపుణ్యం మాలో ఉందని నిరూపించుకుంటున్నారు. ఏటా కోట్ల రూపాయల్లో వ్యాపారాలు చేస్తు లాభాల బాటలో మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ మహిళా సంఘాల వారు. రైతులకు అండగా ఉంటూ, పంట మీద మిగిలే లాభాలు రైతులే అనుభవించేలా చేస్తున్నారు. క్రిమిసంహారక మందులు, విత్తనాలు, రైతుల ఆర్థిక అవసరాలు తీరుస్తూ వారికి అండగా నిలుస్తున్నారు కొడంగల్, అంగడిరైచూర్, హస్నాబాద్ గ్రామాల మహిళలు. చిన్న పాటి పొదుపు సంస్థగా ఏర్పడి కోట్లలో వ్యాపారాలు చేసే స్థితికి ఎదిగిన వారి విజయగాథ ఎంతోమందికి ఆదర్శం.

ఆరుగాలం చేసిన కష్టానికి సరైన ఫలితం రాకపోతే రైతు పడే వేదన అంతా ఇంతా కాదు. ఆ వేదనను భరించిన అనుభవంతో రైతు కష్టాన్ని రైతే తినేలా.. పంట లాభాల ఫలాల్ని రైతుకు చేరేలా 2013లో ఆ మూడు గ్రామాల మహిళలు ఓ ఆలోచన చేశారు. **కొడంగల్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, అంగడిరైచూర్ రైతుసేవల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, హస్నాబాద్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్** పేరుతో మూడు సంఘాలుగా ఏర్పడ్డారు. ఒక్కో సంఘం పది మందితో ప్రారంభమయింది. నెలకు రూ. 100 నుంచి రూ. 200 వరకు పొదుపు చేసుకుంటూ డబ్బులు కూడబెట్టుకున్నారు. అలా దాచుకున్న మొత్తాన్ని ఏఎల్‌సీ స్వచ్ఛంద సంస్థ ప్రోత్సాహంతో వ్యాపారరంగంలో అడుగుపెట్టారు. కందుల కొనుగోళ్లు చేపట్టి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లిస్తూ వ్యాపారానికి బీజం వేశారు. మీ వెంట మేమున్నామంటూ రైతు అవసరాలకు తగ్గట్టుగా ఎరువులు, పురుగుల మందులు సమకూరుస్తున్నారు. పంట సాగు కోసం తక్కువ వడ్డీ నూటికి రూ. 1.50తో రుణాలు కూడా ఇస్తున్నారు. మధ్య దళారులు, తూకాల్లో మోసాలు, కమీషన్, మద్దతు ధర, రవాణా ఖర్చులు లాంటి అదనపు నష్టాలేవీ రైతుకు ఉండకపోవడంతో రైతులు కూడా వారు పండించిన పంటను ఈ మూడు గ్రామాల మహిళలు ఏర్పాటు చేసిన విత్తన కంపెనీలకే అమ్మడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

ఇంతింతై.. కొండంతై..

ముగ్గురి ఆలోచనతో మొదలైన ఈ విత్తన వ్యాపార సంఘాలు ఇప్పుడు మూడువేల మంది సభ్యులతో వెలుగొందుతున్నాయి. వేరుశనగ, కందుల కొనుగోళ్లు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో వ్యాపారం మీద పట్టు బిగిస్తూ దాదాపు రూ. 20 కోట్ల వ్యాపారం చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో అయితే మూడు యూనిట్లలో కలిసి రూ.19 లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. అప్పటివరకు మార్కెట్‌లో కందులు క్వింటాలుకు రూ. 12 వేల రూపాయలు ఉండేవి. కొనుగోలు చేసి ధర పెరిగిన తర్వాత అమ్ముదాం అనుకుని మూడు యూనిట్లలో భారీగా కందులు కొని నిల్వ చేశారు. తీరా కందుల ధర క్వింటాలుకు రూ. 6 వేలకు పడిపోయింది. దీంతో నష్టాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. నష్ట నివారణా చర్యల్లో భాగంగా కందులను పప్పుగా మార్చి అమ్ముదామనుకున్నారు. మారుతి రకం కందులైతే మంచి పప్పు తయారయ్యేది. కానీ వారు కొన్నది వేరే రకం కావడంతో నాణ్యమైన పప్పు రాలేదు. దీంతో ఆ సంవత్సరం నష్టాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఒక ఓటమి కసిని పెంచుతుందనే మాట వీళ్ల విషయంలో మళ్లీ నిజమైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో గతం కంటే ఎక్కువగా ఏకంగా రూ. 1.50 కోట్ల వ్యాపారం చేపట్టారు. ఆ దెబ్బకు గతేడాది నష్టపోయిన రూ. 19 లక్షల నష్టాన్ని పూడ్చుకుంటూ, అదనంగా రూ. 5 లక్షలకు పైగా ఆదాయాన్ని సమకూర్చుకున్నారు.

రైతుకు అండగా..

రైతు శ్రేయస్సునే లక్ష్యంగా ఎంచుకున్న మహిళలు రైతులకు అనువుగా ఉండే వ్యాపారాలు చేపట్టారు. వారిని అత్యవసర పరిస్థితుల్లో ఆదుకొనే విధంగా మందులు, ఎరువులు అందించే వ్యాపారాన్ని మొదలెట్టారు. వచ్చిన ఆదాయంతో ఏఎల్‌సీ సంస్థ నుంచి ఏకమొత్తంగా **రూ. 60 లక్షలు** రుణాన్ని పొంది, **2300 మంది** రైతులకు ఎరువులు, మందులు అందిచాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం **1600ల మంది** రైతులకు ఎరువులు, పురుగుల మందులు అందిస్తున్నారు.



రైతులకు మేలు చేకూర్చడం...

సంస్థలో చేరాక వ్యవసాయంలో మెళకువలను రైతులకు వివరిస్తూ.. రైతులకు మార్కెటింగ్‌లో చేదోడువాదోడుగా ఉండి.. లాభాలను ఆర్జించి పెట్టడం ఆనందాన్ని కలిగిస్తుంది. మేం కూడా వ్యాపారం చేయగలమనే ధైర్యం సంస్థ ద్వారా ఏర్పడింది. చేపట్టుకున్న పొదుపునకు రెండింతలు రుణ సదాపాయాన్ని పొంది కంది కొనుగోలు వ్యాపారాన్ని చేపట్టుకున్నాం. సమిష్టిగా కృషి చేయడం వల్ల ఏదైనా సాధించవచ్చనే ధైర్యం చేకూరింది.

అమృతమ్మ, అధ్యక్షురాలు,
కొడంగల్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్



సంతోషంగా ఉంది..

2012లో ప్రారంభించాం. ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో కంది కొనుగోళ్లు చేపట్టి దాదాపు రూ. కోటిన్నర వ్యాపారం చేశాం. ఎఫ్‌సీఐ కేవలం ఒక శాతం కమీషన్ మాత్రమే ఇచ్చేది. ఇలా మాకు రూ. 15లక్షల వరకు కమీషన్ వచ్చేది. సగం డబ్బులు అవసరాలకు ఖర్చైనా మిగతావి మాకు అదనపు అవసరాలకు అందుబాటులో ఉంటున్నాయి. ఖర్చులు పోయినా.. లాభాలు సాధించడం సంతోషంగా ఉంది. దాంతో పాటు రైతులకు మేలు చేస్తున్నామనే ఆనందం ఉంది. మా సంస్థలో ఎటువంటి నష్టమూ రైతులకు ఉండదు.

విజయలక్ష్మి, అధ్యక్షురాలు,
అంగడిరైచూర్ రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్

లాభదాయక ధరొచ్చే మార్గం..

రైతులు పండించుకున్న పంటను నిల్వ చేసుకొని లాభదాయకమైన ధరతో అమ్ముకునేందుకు వీలుగా గోదాం నిర్మాణానికి పూనుకున్నారు. అనుకున్న ధర రాని పక్షంలో కందులు, శనగలను పప్పుగా మార్చేందుకు దాల్ మిల్లు ఏర్పాటుకు కృషి చేశారు. ఇందుకుగానూ హస్నాబాద్ సంస్థ సభ్యులు నీటూర్ గ్రామ పరిసర ప్రాంతంలో రెండున్నర ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. కొడంగల్ సంస్థ సభ్యులు 3 ఎకరాల స్థలాన్ని కొన్నారు. వీరి మార్గంలోనే అంగడిరైచూర్ సంస్థ సభ్యులు కూడా 2 ఎకరాల స్థలాన్ని కొనే ఆలోచనలో ఉన్నారు. దాల్ మిల్లు కోసం కొన్న స్థలాల్లో మిల్లు ఏర్పాటుకు అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు ఆయా సంస్థ మహిళలు. దీనికి సంబంధించిన ఫైల్ సబ్‌కలెక్టర్ ఆఫీసులో పెండింగ్‌లో ఉంది. అది ఓకే అయి గోదాం, మిల్లుల నిర్మాణం జరిగితే మూడు సంస్థల ఆధ్వర్యంలోని రైతులు పంట నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుంది. అయితే సంస్థ రైతుల కోసం పని చేసినప్పటికీ వచ్చే లాభాల్లో చాలా తక్కువ శాతం కమీషన్ తీసుకుంటుంది. అది కూడా సభ్యుల అవసరాల కోసం కాదు.. సంస్థ నిర్వహణ కోసం. ఇప్పటికే కందులు, శనగలు కొనుగోలు చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి పెసర్లు కూడా కొనే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. సరైన ప్రోత్సాహం ఇస్తే రానున్న రోజుల్లో సంస్థ ఆధ్వర్యంలో రైతులు పండించే ప్రతి పంటను కొనుగోలు చేసి రైతులను లాభాల బాటలో నడిపింగలమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు ఈ మూడు సంఘాల సభ్యులు.



సమావేశంలో లక్ష్యాలపై చర్చిస్తున్న సభ్యులు

నాణ్యతలో రాణింపు..

వ్యాపారంతో పాటు రైతులకు పంట సాగులో మెళకువలు అందించేందుకు విత్తన ఉత్పత్తిలో ఈ ఏడాది ప్రయోగాలకు తెర తీశారు పై మహిళా సంఘాలవారు. మూడెకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తూ మేలైన విత్తన రకాన్ని రైతులకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. స్వయంగా విత్తన నాటు చేపట్టి ఏ రకం అధిక దిగుబడి ఇస్తుందో పరిశోధనలు చేయిస్తున్నారు. ఆ పంటను అధికంగా పండించేలా రైతులకు ఆ విత్తనాలు అందుబాటులో ఉంచుతామంటున్నారు. 'గతంలో కూలి పనులు చేసేవాళ్లం. అప్పుడు మమ్మల్ని ఎవరూ గౌరవించే వాళ్లు కాదు. మాకు వచ్చిన ఆలోచన, దాన్ని ఆచరణలో పెట్టడం వల్ల సమాజంలో మాకిప్పుడు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అందరూ మమ్మల్ని గౌరవిస్తున్నారు. సంస్థ ద్వారా మునుపటి కంటే ఎక్కువ ఆదాయం వస్తున్నది. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని మేం మరోసారి నిరూపించాం.. అంటున్నారు ఆ మూడు గ్రామాల మహిళలు.

- చామంతి ప్రభాకర్, కొడంగల్

రూ. 60 కోట్ల బిజినెస్




చిన్నప్పుడు ఐఏఎస్ అవ్వాలని కలలు కన్నది. పరిస్థితులు అనుకూలించలేదు. పెద్దయిన తర్వాత ఎలాగైనా డబ్బులు బాగా సంపాదించి మంచిపేరు తెచ్చుకోవాలని నిర్ణయించుకుంది. 28 ఏళ్లు వచ్చాక ఏం చేసిందో తెలుసా..?

గ్వాలియర్‌కు చెందిన దీపాలి చిన్నప్పుడు ఎంతగట్టిన కోరుకుందో ఏమోకానీ.. పెద్దయిన తర్వాత దాదాపు రూ. 60 కోట్ల వ్యాపారం చేస్తున్నది. అది కూడా మగవాళ్ల ఆధిపత్యం పూర్తిగా కనిపించే కమొడిటీ (నిత్యావసర వస్తువుల) రంగంలో. మొత్తం పురుషులే వ్యాపారం చేయగల కమొడిటీ రంగంలో రేయింబవళ్లు కష్టపడి.. మెళుకువలు నేర్చుకొని సొంతంగా జయలక్ష్మి ఫుడ్స్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసింది. లిక్కర్ మాఫియా నుంచి నిత్యం అవాంతరాలు ఎదుర్కొంటూనే కమొడిటీ వ్యాపారంలో అంత పెద్దమొత్తంలో లావాదేవీలు నిర్వహిస్తున్న మొట్టమొదటి మహిళగా గుర్తింపు పొందింది. చిన్నప్పటి నుంచి టిఫిన్ సర్వీసెస్, హాస్టల్ నిర్వహణ, రెస్టారెంట్ నడిపి తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఇన్ని పనులు చేస్తూ, చదువుకుంటూ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చింది. చదువు, వ్యాపారమే కాదు.. క్రీడల్లో కూడా చురుగ్గానే పాల్గొనేది దీపాలి. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎన్నో బహుమతులు గెలుచుకున్నది. మహిళలు తలుచుకుంటే ఏదన్నా సాధించగలరనడానికి దీపాలి చక్కటి ఉదాహరణ.

అండాశయాలు తీసెయ్యకూడదు



అడుగండి చెబుతా



డా॥ ఆండాళ్ రెడ్డి
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కాంటినెంటల్ హాస్పిటల్స్
హైదరాబాద్

నా వయసు 26 సంవత్సరాలు. ఇంకా పెండ్లి కాలేదు. నెలసరి సమయంలో భరించలేనంత నొప్పి వచ్చేది. అందుకని మా దగ్గరలో ఉన్న డాక్టర్‌కు చూపించుకుంటే ఆమె టెస్టులు చేయించి నా అండాశయంలో చాక్లెట్ సిస్ట్ ఉందని చెప్పారు. అది దాదాపు 8 సెం.మీ. పరిమాణంలో ఉందని అంటున్నారు. దానికోసం సర్జరీ అవసరమవుతుందని చెబుతున్నారు. నా రిపోర్టులు పంపుతున్నాను చూసి సరైన పరిష్కార మార్గం చూపించగలరు?


- లావణ్య, ఆదిలాబాద్

ఏదైనా సిస్ట్ ఆరు సెంటీ మీటర్ల కంటే పెద్దగా ఉన్నదంటే తప్పనిసరి పరీక్షలన్నీ క్షుణ్ణంగా చేయించాల్సి ఉంటుంది. మీ విషయంలో టెస్ట్‌లు చేసి మీ చికిత్సను నిర్ణయించాల్సి ఉంటుంది. ఎండోమెట్రియాసిస్ ఫలితంగానే గర్భాశయంలో సిస్ట్‌లు ఏర్పడుతాయి. ఎండోమెట్రియాసిస్ అంటే గర్భాశయ లోపలి పొర. గర్భాశయంలో మాత్రమే కాకుండా చుట్టు పక్కల ఉన్న ఇతర భాగాల మీద కూడా ఏర్పడడాన్ని ఎండోమెట్రియాసిస్ అంటారు. గర్భాశయ పొర కణజాలాలు అండాశయంలో ఏర్పడడం వల్ల అక్కడ కూడా నెలసరి సమయంలో రక్తస్రావం జరుగుతుంటుంది. కానీ అది బయటికి వెళ్లడానికి మార్గం లేకపోవడం వల్ల సిస్ట్‌గా ఏర్పడుతుంది. ఇలా గర్భాశయ పొర కణజాలాలు అండాశయంలో ఏర్పడితే దాన్ని చాక్లెట్ సిస్ట్ అంటారు. ఈ సమస్య ఉన్నపుడు నెలసరి సమయంలో విపరీతమైన నొప్పి రావడం, అండం విడుదలలో సమస్యలు, భవిష్యత్తులో గర్భం దాల్చడంలో సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. మీ సమస్యను నిర్ధారించడానికి స్కానింగ్, సీఏ 125 టెస్ట్‌లు చెయ్యాల్సి ఉంటుంది. సమస్య ఒకసారి నిర్ధారించిన తర్వాత సర్జరీ చేసి మీ అండాశయంలో ఏర్పడిన సిస్ట్‌ను తీసేయ్యాల్సి ఉంటుంది. ఇప్పుడు అభివృద్ధి చెందిన శాస్త్ర పరిజ్ఞానంతో ఇప్పుడు లాప్రోస్కోపీ విధానంలో అండాశయం తీసెయ్యాల్సిన అవసరం లేకుండా కేవలం సిస్ట్‌ను మాత్రమే తొలిగించే అవకాశం ఉంటుంది. అండాశయం చాలా ముఖ్యమైన అవయవం. దాని నుంచి కేవలం అండోత్పత్తి మాత్రమే కాదు, ఇతర జీవక్రియలకు ఉపయోగపడే హార్మోన్లు కూడా ఉత్పత్తి అవుతాయి. కాబట్టి అండాశయాన్ని అలాగే ఉంచి కేవలం సిస్ట్‌ను మాత్రం తొలిగించాల్సి ఉంటుంది. తర్వాత బయాప్సీలో అది ఎండోమెట్రియాసిస్ మాత్రమే అయితే తప్పని సరిగా సర్జరీ తర్వాత హార్మోన్ల సమతుల్యతకు సంబంధించిన మందులు వాడాల్సి ఉంటుంది. సర్జరీ తర్వాత కూడా తరచుగా సీఏ 125 టెస్ట్ చేయించుకుంటూ ఉండాలి.

మాకు రాయండి

మీకు ఆరోగ్యపరమైన సమస్యలు, సందేహాలున్నాయా? అయితే మాకు రాయండి. నిపుణులతో సలహాలు ఇప్పిస్తాం. మా అడ్రస్ : నమస్తే తెలంగాణ - అడుగండి చెబుతా(హెల్త్‌డెస్క్) #8-2-3\1\7\8\9, క్రిష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. health@ntdaily.news

తాతయ్య కోసం..



తమకు ప్రియమైన వారికోసం ఎంతోమంది ఎన్నో చేస్తుంటారు. అందమైన గిఫ్టులో, ఆభరణాలో ఇచ్చి తమ ఆప్యాయతను చాటుకుంటారు. అలాంటి కోవకే వస్తుంది ఈ యువతి.

కావ్య కొప్పారపు.. అమెరికాలో స్థిరపడిన మన దేశ యువతి. డయాబెటిక్ వ్యాధిగ్రస్తులకు వచ్చే రెటినోపతి (కంట్లోని రెటీనాకి సంబంధించిన రక్తనాళాలను పూర్తిగా దెబ్బతీసి చూపును నష్టపరిచే ఓ వ్యాధి) ప్రారంభ దశను కనుగొనే ఓ యాప్‌ను 16వ ఏటనే రూపొందించింది. ఈ వ్యాధి తన తాతయ్యకు రావడంతో తట్టుకోలేని కావ్య.. తన కంప్యూటర్ సైన్స్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి.. తమ్ముడు నీయంత్, క్లాస్‌మెట్ జస్టిన్ ఝుంగ్‌తో కలిసి ఈ యాప్‌ను డెవలప్ చేసింది. దీనికి ఐయాగ్నోసిస్ అనే పేరు పెట్టారు. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న స్మార్ట్‌ఫోన్ నుంచి కళ్లను ఫొటో తీస్తే రెండు గంటల్లోనే వ్యాధి ఉన్నదీ లేనిదీ తెలియజేస్తుంది. ఈ విధానంతో వేల డాలర్ల ఖర్చును తగ్గించుకోవచ్చని చెబుతున్నది కావ్య. గత నెలలో న్యూయార్క్‌లో జరిగిన 'ఓరీయల్లీ' ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కాన్ఫరెన్స్‌లో ఐయాగ్నోసిస్‌పై తన ప్రాజెక్ట్‌ను సమర్పించింది. దీనిపై సుదీర్ఘంగా పరిశోధన చేసిన తర్వాత మనదేశంలోనే ప్రవేశపెట్టనున్నట్లు కావ్య చెబుతున్నది.

వాట్సప్!

ట్వీట్

సల్మాన్ ఖాన్
@BeingSalmanKhan



ఎవరైనా సైకిల్ కావాలనుకుంటున్నారా? నా ఎలక్ట్రిక్ సైకిల్ గురించి తెలుసుకోవాలనుకుంటే beinghumanecycle.com వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వండి.

సల్మాన్ ఖాన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 24,987,545

సమ్‌థింగ్ స్పెషల్



అన్నింటికీ ఆధార్.. ఇదే పెళ్లి పత్రికల ఫ్యూచర్!

కామన్‌మ్యాన్ వాయిస్

ఆయారాం, గాయారాంలు ఉన్నా పోయినా ఒక్కటే.. తనతో సహా 63 మందిని గెలిపించుకున్నాడు. తన వ్యూహాలతో మరో 25 మందిని తనవైపు తిప్పుకొన్నాడు. ఆయన పెట్టిన రాజకీయ జీవితంతో ఎదిగి ఇప్పుడు మేం దూకుతాం అంటే మీ ఖర్మ. మళ్లీ కొత్తగా 70 మందిని ఒంటి చేత్తో, ప్రజల దీవెనలతో గెలిపించుకోగలడు. ఉంటే ఉండొచ్చు. పోతే పోవచ్చు. తాటాకు చప్పుళ్లకు భయపడితే ఎప్పుడో కాడి వదిలేసేవాడు. శుభం.

–Sri Nivas

భూమికి స్నానం చేయించింది ఆకాశం. చెట్లు పచ్చని బట్టలు తొడుక్కున్నాయి.

–Sudheer Kumar Thandra

వైరల్ వీడియో



సింపుల్ అండ్ బ్యూటీఫుల్‌గా ఉన్న ఫ్యామిలీకి కష్టాలొస్తే ఎలా ఉంటుంది? అనే అంశంతో తెరకెక్కిన సినిమా యుద్ధం శరణం. ఈ సినిమా ట్రైలర్ యూట్యూబ్ ట్రెండింగ్ వీడియోల లిస్ట్‌లో చేరింది.

Yuddham Sharanam Trailer | Chay Akkineni | Srikanth | Lavanya Tripathi | Krishna RV Marimuthu

Total views : 1,742,001+

Published on Aug 27, 2017

షేరింగ్

ఒక కప్పను తీసుకుని వేడినీటిలో పడేస్తే అది వెంటనే బయటికి దూకేస్తుంది. అదే కప్పను చల్ల నీటి గిన్నెలో వేయండి. అది అక్కడే ఉంటుంది. ఇప్పుడు మెల్లగా నీటిని వేడి చేయండి. కప్ప సహజగుణం ఏంటంటే. వేడి పెరిగే కొద్దీ దానంతట అదే తన శరీరాన్ని ఆ వేడికి అడ్జెస్ట్ చేసుకోగలదు. కానీ ఒకసారి నీరు మరుగడం మొదలైతే కప్ప అందులో ఉండలేదు. బయటికి దూకేయాలని చూస్తుంది. కానీ అప్పుడది దూకలేదు. ఎందుకంటే నీటి వేడికి అప్పటిదాకా అడ్జెస్ట్ అవ్వడంతో తన శక్తి అంతా కోల్పోతుంది. ఇక బయటికి దూకే శక్తి లేక అందులోనే ఉండిపోయి చివరికి మరణిస్తుంది. ఇది కేవలం కథ కాదు. ఇందులో నీతి చాలా ఉంది.

ఇప్పుడు ఆలోచించండి. కప్ప ఎలా చనిపోయింది. చాలా మంది వేడి నీటి వల్ల అంటారు.

కానీ నిజానికి వేడి నీటి వల్ల కప్ప చనిపోలేదు. నీటిలో నుంచి బయటికి ఎప్పుడు దూకేయాలో నిర్ణయించుకోలేక చనిపోయింది. కొద్దిగానే వేడి కదా సర్దుకుపోదాంలే అనుకుంటూ వేడి నీటిలోనే ఉండి పోయింది. చివరికి నీరు మరిగే సరికి అది బయటికి దూకలేకపోయింది. అలాగే మనం కూడా జీవితంలో అడ్జెస్ట్ అవ్వాలి. కానీ అడ్జెస్ట్ అవుతూనే ఉండి జీవితంలో పైకి ఎదగకుండా అక్కడే ఉండిపోవద్దు. ఎదుటి వాడికి మనల్ని మానసికంగా శారీరకంగా ఆర్థికంగా హింసించే అవకాశం ఇచ్చాం అనుకోండి. చివరికి వచ్చేసరికి భరించలేం. అందుకే మనకు శక్తి ఉన్నప్పుడే సమస్యల నుంచి బయటికి వచ్చేయాలి. పర్లేదులే అనుకుంటూ భరిస్తూ ఉంటే, చివరికి సమస్యల వలలో చిక్కుకుని మరణించాల్సి వస్తుంది. జీవితంలో ఎలాంటి పరిస్థితుల్లో అయినా తగిన సమయంలో నిర్ణయం తీసుకోవడం చాలా ముఖ్యం.

-ఓ వాట్సప్ మెసేజ్

చర్మ సంరక్షణకు..


వర్షంలో తడువడం వల్ల వచ్చే జలుబు, జ్వరం గురించే ఎక్కువగా ఆలోచిస్తాం. కానీ చర్మానికి జరిగే నష్టాన్ని పెద్దగా ఆలోచించం. కళ తప్పిన చర్మానికి ఈ క్రియలు సాధన చేసి తిరిగి జీవం పోయండి.

భస్త్రిక ప్రాణాయామం

సుఖాసనంలో కూర్చొని కళ్లు మూసుకోవాలి. చేతులను జ్ఞాన ముద్రలో మోకాళ్లపై ఉంచాలి. ఇప్పుడు ముక్కుతో వేగంగా శ్వాస పీలుస్తూ వదులాలి. ఇదే ప్రక్రియ 30 నుంచి 50 సార్లు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని మూడు సార్లు ఆగి ఆగి చేయాలి.

యోగా





జె. దుర్గేష్ కుమార్
యోగా ట్రైనర్,
సంతూస్ స్టూడియో
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్,
హైదరాబాద్
9704229212,

ఉపయోగాలు :

- రక్త ప్రసరణ మెరుగై చర్మ సమస్యలు అదుపులోకి వస్తాయి.
- ఊపిరితిత్తుల పనితీరు మెరుగై రక్తం శుభ్రపడుతుంది. తద్వారా చర్మం సహజ కాంతిమయమవుతుంది.
- ఆస్తమా, మైగ్రేన్, నరాల సమస్యలు, ఒత్తిడి, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి.
- అధిక బరువు తగ్గుతారు.
- ముఖ కాంతి పెరుగుతుంది.

జాగ్రత్తలు :

- అధిక రక్తపోటు, గుండె సమస్యలు, హెర్నియా ఉన్నవారు ఈ ప్రాణాయామం చేయరాదు.

ఆలోచన.. అవగాహన!



నెగిటివ్ థాట్స్ మనషులను స్థిమితంగా ఉండనివ్వడంలేదు. ఇప్పడు ఒక నిమిషం ఆనందంగా నవ్వుకున్నారంటే తరువాత ఈ ఆనందం ఉండదేమో అనే దిగులుతో వెంటనే దుఃఖంలోకి జారుకుంటుంటారు. ఏదన్నా మనకు వచ్చేవరకు ఆరాటం, వచ్చిన తరువాత పోతుందేమో అని పోరాటం. ఈ గజిబిజిలోనే జీవితం ఏ జీవం లేకుండా గడిచిపోతుంది. ఈ పరిస్థితి నుంచి మనం బయటపడాలంటే ఏం చేయాలనేది ఎంతో మందిని వేధిస్తున్న ప్రశ్న.. మనసు చేసే మాయ.. ఆ మాయ నుంచి బయటపడే మార్గం.. ఈ రెండింటిపై ఓ అవగాహన ఉండాలి.

నెగిటివ్ థాట్.. ఈ ఒక్కమాట ఎన్నో సిద్ధాంతాలను రూపొందించింది. వెస్ట్రన్ ఫిలాసఫీ చాలావరకు దీనిపైనే ఆధారపడి ఉంది. ఎంతో మంది మేధావులు ఈ నెగిటివ్ థాట్ నుంచి ఎలా బయటపడాలనే దానిపై ఎన్నో విషయాలను పుస్తకాల రూపంలో, వీడియో, ఆడియో సీడీల రూపంలో మానవాళికి అందించారు. ప్రతి క్షణం మన ఆలోచనలతో మనకే సంఘర్షణ. ఈ క్రమంలో మనిషి తన జీవితాన్ని నిస్సారంగా, నిసత్తువుగా గడిపేస్తున్నాడు. తనతో పాటు తనతోటి వారిని, తన పరివారాన్ని కూడా ఆందోళనలో పడేస్తున్నారు. ఈ నెగిటివ్ థింకింగ్‌కి పరిష్కారమే లేదనే భ్రమలో విలువైన జీవితాన్ని భ్రష్టు పట్టించుకుంటున్నారు. ఇంతకీ ఈ నెగిటివ్ థింకింగ్ నుండి బయటపడే మార్గమే లేదా? అంటే కచ్చితంగా ఉంది. అది మన చేతుల్లోనే ఉంది.

ఏది పాజిటివ్ థాట్?

నెగిటివ్ థాట్.. అసలు ఈ మాటకు అర్థమే లేదు. థాట్స్ అనేవి ఉంటాయేమో కాని అందులో నెగిటివ్, పాజిటివ్ అనే థాట్స్ ఉండవు. మనసులో మనం ఏర్పరచుకునే కొన్ని అభిప్రాయాలు దృక్పథాలను బట్టి మన థాట్స్‌కి నెగిటివ్, పాజిటివ్ అనే పేర్లను మనం ఇస్తుంటాం. మనజీవితంలో జరిగే సంఘటనలు, మన చుట్టూ పరిస్థితులు, మన మనసు కల్పించుకున్న కల్పనల ఆధారంగా మన ఆలోచన మనలను భయపెట్టడం, బాధపెట్టడం, సంతోష పెట్టడం అనేది డిసైడ్ చేస్తుంది. మనకు పాజిటివ్‌గా అనిపించి మన మనసును ఆనందింపచేసే ఎన్నో విషయాలు ఎంతో మందిని బాధపెడతాయి. ఈ సందర్భంలో దాన్ని నెగిటివ్ థాట్ అనాల్సి ఉంటుందా? లేదా పాజిటివ్ థాట్ అనాల్సి ఉంటుందా?

నెగిటివ్ థాట్స్ పోవాలంటే..

1. ముఖ్యంగా మన మనసులో కలిగే అన్ని థాట్స్ నెరవేరవనే విషయాన్ని దృఢంగా నమ్మాలి. మనం కష్టపడకుండా ఏ పాజిటివ్ థాట్ మనలను బాగు చేయలేదు.
2. సమాజానికి పనికి వచ్చే కార్యక్రమాల్లో పాల్గొనడం. చిన్నదో పెద్దదో ఎదుటివారికి సాయం చేయడం.
3. మనం రాత్రి నిద్రపోయేప్పుడు మనలను ఆందోళనకు గురిచేసే పనులు చేయకుండా ఉండడం.
4. శరీరానికి తగినంత వ్యాయామాన్ని ఇవ్వాలి.
5. ఎక్కువగా జీర్ణంకాని ఆహారం తిన్నా కూడా మనసు ఆందోళనకు గురవడానికి ఎక్కువ అవకాశం ఉంది.
6. ఎదుటివారిని నిందించడం అనే గుణం తగ్గించుకోవడం వల్ల నెగిటివ్ థాట్స్ తగ్గుతాయి.
7. ఇక అత్యంత అద్భుతమైన మార్గం ప్రాణాయామం, భగవంతుడి నామ జపం.

- శ్రీకాంత్ కనపర్తి

థాట్స్ మానిఫెస్టేషన్ నిజమేనా?

థాట్స్ మానిఫెస్టేషన్ చాలా ఆశక్తికరమైన అంశం. చాలా ఆధ్యాత్మిక సంస్థల్లో ఈ థాట్ మానిఫెస్టేషన్ టాపిక్‌పై చర్చలు జరుగుతుంటాయి. మన సంకల్పం కార్యరూపం దాలుస్తుందనేది ఇందులోని సారాంశం. ఈ థాట్ మానిఫెస్టేషన్ అంశం సరిగా అర్థం చేసుకోలేనప్పుడు ఎన్నో మానసిక రుగ్మతలు తలెత్తే ప్రమాదం ఉంది. మన బుర్రలో తలెత్తే ఆలోచనలన్నీ మానిఫెస్ట్ అవుతాయనే ఆనందం కంటే అందులో భయమే ఎక్కువ పాత్రపోషిస్తుంది. పాజిటివ్ థాట్ చేస్తే అది నెరవేరినప్పుడు నెగిటివ్ థాట్ చేసినప్పుడు అతి మానిఫెస్ట్ అవుతుంది కదా! అయితే మన మనసులోకి నెగిటివ్ థాట్ రానివ్వకోడదనే ఆలోచనతో భయానికి లోనయి.. పదే పదే అదే ఆలోచిస్తూ మరింత ఆందోళనకు గురవుతుంటారు. ఇదే చాలా మందిలో ఫోబియాలకు కారణం అవుతుంది. మనిషి ఎల్లవేళలా శుభకరమైన ఆలోచనలనే చేయలేడు, చుట్టూ పరిస్థితుల వల్ల, సమాజంలోని సంఘటనల వల్ల మనసులో ఆందోళనలను కలిగించే థాట్స్ కూడా వస్తుంటాయి. మన మనసులో రేగే ఆలోచనలు 99.9 శాతం భౌతిక రూపంలోకి రావు. వాస్తవానికి మీరు చేసే ఏ థాట్ కూడా మీరు క్రియేట్ చేయడం వల్ల మానిఫెస్ట్ అవవు. మనసు చేసే ఈ మాయలోకంలో పడ్డారంటే వైద్యులు కూడా సాయం చేయలేని పరిస్థితి వస్తుంది. అందుకే మీ మనసులో వచ్చే థాట్స్‌కి ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వకండి. అవి కేవలం మన మనసు చేసే మ్యాజిక్ మాత్రమే అని గుర్తించండి.

తెల్లమచ్చలకు చక్కటి మందు ల్యూకోడెర్మా

సలహా



తెల్ల మచ్చల వ్యాధికి మందులేదనేది అపోహ. బతికినంత కాలం మందులు వాడుతూనే ఉండాలి తప్ప దీనికి శాశ్వతంగా తగ్గిపోయే అవకాశమే లేదనే మాట కూడా ప్రచారంలో ఉంది. ఇవన్నీ కలిసి అంతిమంగా తెల్లమచ్చలతో బాధ పడేవారంతా వైద్య విధానాల మీద ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఆయుర్వేదంలో ఈ సమస్యకు మంచి పరిష్కారాలు ఉన్నాయి. 5 వేల ఏళ్ల క్రితమే ఆయుర్వేద శాస్త్రం ఈ వ్యాధిని సమూలంగా తొలగించే ఔషధ మూలికలను సూచించింది. ఆ మూలికలను ఉపయోగించి ల్యూకోకిట్ అనే ఔషధాన్ని తయారు చేశారు.

కారణాలెన్నో ...

తెల్ల మచ్చలు రావడానికి కారణాలు చాలా ఉన్నాయి. వాటిలో ప్రధానంగా, శరీరంలో వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి వ్యాధినిరోధక శక్తి తగ్గిపోవడం ఒక ముఖ్యమైన కారణం. రక్తంలో విషపదార్థాలు చేరడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పరిమాణం పడిపోతుంది. ఫలితంగా శరీరంలోని మెలనిన్ తగ్గిపోయి చర్మం తన సహజ వర్ణాన్ని కోల్పోతుంది. ఇది తెల్ల మచ్చలు రావడానికి కారణమవుతుంది. ఆహారంలో ఫెర్రస్, కాపర్ లోపించడం కూడా ఇందుకు కారణమవుతుంది. శరీరంలో సహజంగానే హానికారకమైన ఫ్రిరాడికల్స్ తిరుగుతూ ఉంటాయి. పండ్లలో లభించే యాంటీ ఆక్సిడెంట్లు వాటికి విరుగుడుగా పనిచేస్తుంటాయి. పండ్లు తీసుకోని వారిలో ఈ ఫ్రిరాడికల్స్ సంఖ్య పెరిగిపోయి తెల్ల మచ్చలు ఏర్పడవచ్చు. నానాటికి ప్రకృతికి దూరమైపోతున్న కారణంగా మానవ శరీరాల్లో విటమిన్ డి తగ్గిపోతుంది. ఫలితంగా శరీరానికి వర్ణాన్ని ఇచ్చే మెలనోసైట్స్ తగ్గిపోతాయి. ఫలితంగా తెల్లమచ్చలు ఏర్పడుతాయి. అయితే ఏ కారణంగా వచ్చిన తెల్ల మచ్చలైనా ఈ ల్యూకోకిట్ ఔషధాలతో తగ్గిపోతాయి. ఇంతులో కృత్రిమ రసాయనాలు లేనందువల్ల ఏ రకమైన దుష్ప్రభావాలకు ఆస్కారం లేదు. ఇందులో చర్మానికి పూర్వ వర్ణాన్నిచ్చే మెలనిన్ ఉత్పత్తిని పెంచే మూలికలతో ఈ ఔషధం తయారు చేయబడింది.

ల్యూకోకిట్ గురించి

ల్యూకోకిట్‌లో మూడు రకాల ట్యాబ్లెట్లు ఉంటాయి. వీటిని ఉదయం, సాయంత్రం భోజనం తర్వాత వేసుకోవాలి. వీటితో పాటు చర్మం మీద పూతగా వాడే కలర్‌కాట్ ఎల్ మిక్స్ ద్రావణం కలయికతో చర్మానికి సహజ వర్ణాన్ని ఇచ్చే ఔషధం తయారు చెయ్యబడింది. సహజ వర్ణం పోయి తెల్ల మచ్చలు ఏర్పడిన చోట ఈ ద్రావణాన్ని పూతగా పూసి 10– 15 నిమిషాల పాటు ఎండలో కూర్చోవాలి. రోజూ ఉదయం సాయంత్రం ఈ మందును ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

డా. ఎన్. రామకృష్ణారెడ్డి
ఆర్‌కే ఆయుర్వేదిక్ అండ్ సొరియాసిస్ రీసెర్చ్ సెంటర్
హైదరాబాద్, హన్మకొండ
8886 922 245
8886 922 247



రోజంతా ఉల్లాసంగా



రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా, దృఢంగా, ఆందోళన దరిచేరకుండా ఉండాలనుకుంటున్నారా..? అయితే ఉదయాన్నే చేసే బ్రేక్‌ఫాస్ట్‌లో కొంచెం మార్పులు చేసుకోండి. రోజంతా హాయిగా ఉండండి.

- ఉదయాన్నే ఓ ఆమ్లెట్ (పాలకూరతో వేసింది) పుట్టగొడుగు కూర (పసుపు బాగా కలిపి), పచ్చి ఉల్లిపాయలు తీసుకోవాలి. వీలుంటే టోస్ట్ చేసిన బ్రెడ్, అవకాడో తినొచ్చు. ఇలా చేస్తే రోజంతా ఆందోళన, ఒత్తిడి దరిచేరవు.
- ఓట్స్ బాగా ఉడకబెట్టి అందులో పాలు లేదా బెర్రీలు (స్ట్రాబెర్రీ, చెర్రీ) కలుపుకుని తినాలి. వీలుంటే కొద్దిగా దాల్చిన చెక్కపొడిని చల్లుకుని తినవచ్చు. ఇలా చేస్తే మానసిక శక్తి వస్తుంది. ఆందోళన, కంగారు తగ్గుతుంది.
- కొబ్బరి నీళ్లు, ఉడికించిన పాలకూర, పెరుగు, అరటి పండు, స్ట్రాబెర్రీలు.. వీటిలో కనీసం ఏ మూడు ఆహారాలైనా బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవాలి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మెదడు యాక్టివ్ అవుతుంది.
- టమోటా, క్యారెట్లు, పాలకూర వేసి చేసిన గోధుమ రవ్వ ఉప్మాను తినాలి. వీటిల్లో చాలా పోషకాలు లభిస్తాయి.
- మెంతికూర, పాలకూర, పసుపు, వాము వేసి చేసిన పరోటాలను తింటే అధిక పోషకాలు అందుతాయి. మెదడు ఉత్తేజంగా పనిచేస్తుంది.

సలహా

రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు హోమియోచికిత్స

రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఒక ఆటోఇమ్యూన్ సమస్య. శరీరంలోని సొంత నిరోధక వ్యవస్థ కీళ్ల కణజాలం మీద దాడి చేయడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. మనదేశంలో సుమారు 7 మిలియన్ల ప్రజలు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. అందులో పురుషుల కంటే స్త్రీలలో మూడు రెట్లు అధికంగా కనిపిస్తున్నది.

అధునాతన హోమియో వైద్యంతో ఈ వ్యాధిని సమర్థవంతంగా నయం చెయ్యవచ్చు. సూక్ష్మీకరణ పద్ధతిలో తయారు చేసిన హోమియోమందులు ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా పూర్తిగా నయం చెయడం జరుగుతుంది.

ఇది చాలా నెమ్మదిగా పెరిగే సమస్య. ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ కీళ్లలో కనబడుతుంది. మొదట చిన్న చిన్న కీళ్లలో, తర్వాత పెద్దకీళ్లలో సమస్య మొదలవుతుంది. కీళ్లలోని సైనోవియల్ పొర తర్వాత నెమ్మదిగా కార్టిలేజ్ దెబ్బతింటుంది. ఫలితంగా కీళ్ల ఆకారం, అమరిక కోల్పోయి విపరీతమైన నొప్పి కలుగుతుంది. ఈ వ్యాధి కొందరిలో కీళ్లు మాత్రమే కాదు ఇతర అవయవాల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, రక్తనాళాలు, చర్మం వంటి వాటి మీద దుష్ప్రభావాలు కనిపిస్తాయి.

ఎవరిలో..?

కీళ్ల వాతం చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ వయసు వారికైనా రావచ్చు. కానీ, సాధారణంగా పెద్దవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. చిన్నపిల్లల్లో వచ్చే ఈ వ్యాధిని జువైనల్ ఆర్థరైటిస్ అంటారు.

కారణాలు

మన శరీరంలోని వ్యాధినిరోధక వ్యవస్థ పనితీరు సరిగ్గా లేకపోవడం వల్ల కొన్ని కణాలు వ్యతిరేకంగా పనిచేసి ఆరోగ్యవంతమైన కణాలపై దాడి చేస్తాయి. ముఖ్యంగా కీళ్లలోని సైనోనియం పొరపై ప్రభావితం చేయడం వల్ల వస్తుంది. సాధారణంగా మన శరీరంలో తెల్లరక్తకణాలు వ్యాధి నిరోధక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్ మరియు ఇతర పరదీయ పదార్థాల నుంచి నిత్యం కాపాడుతాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్ రోగులలో తెల్లరక్తకణాలు కీళ్ల చుట్టూ ఉండే సైనోవియంలోకి వెళ్లి ప్రొటీన్లు విడుదల చేస్తాయి. దీంతో సైనోవియం పొర మందంగా మారి క్రమంగా కీళ్ల లోపలి ఎముకలు, కార్టిలేజ్ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై కీళ్ల అమరికలో మార్పు వచ్చి వైకల్యానికి దారి తీస్తుంది.

జన్యుపరమైన, జీవన శైలి పరమైన కారణాల వల్ల కూడా రుమటాయిడ్ ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉంది.

లక్షణాలు

కీళ్ల వాపు, నొప్పి, చేతితో తాకితే వేడిగా ఉండడం, ఉదయం లేవగానే కీళ్ల కదలికలు బాధాకరంగా ఉండడం, బిగుసుకు పోవడం ఈ లక్షణాల తీవ్రత ఎప్పుడూ ఒకే తీరుగా కాకుండా పెరుగుతూ, తగ్గుతూ ఉండవచ్చు. అంతేకాకుండా రెండు వైపులా ఒకే రకం కీళ్లు ప్రభావితం కావడం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. వీటికి తోడు రక్తహీనత, ఆకలి సరిగ్గా లేకపోవడం నిస్సత్తువ, బరువు తగ్గడం, కొద్దిపాటి జ్వరం, మోచేయి, మనికట్టు వంటి కీళ్లలో చర్మం కింద చిన్నచిన్న బుడిపెలు (రుమటాయిడ్ నాడ్యూల్స్) ఏర్పడవచ్చు.


నిర్ధారణ

సీబీపీ, ఈఎస్ఆర్, ఆర్ఏ ఫ్యాక్టర్, ఏఎన్ఏ, యాంటి సీపీసీ, ఎక్స్‌రే, ఎమ్ఆర్ఐ, మొదలైన పరీక్షలు వ్యాధి నిర్ధారణకు తోడ్పడుతాయి.

హోమియోకేర్ చికిత్స

చాలా రకాల ఆటోఇమ్యూన్ జబ్బులు సైకోసొమాటిక్ డిజార్డర్స్ కిందకి వస్తాయి. అన్ని రకాల సైకోసొమాటిక్ డిజార్డర్స్‌కి హోమియోలో చక్కని పరిష్కారం లభిస్తుంది. అందులో ఒకటైన రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కి కూడా హోమియోలో సంపూర్ణ చికిత్స ఉంది. ఇతర చికిత్సా విధానాల్లో కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభ్యమవుతుంది. కానీ హోమియోపతిలో పూర్తి చికిత్స అందుబాటులో ఉంది. అయితే ఈ మందులను రోగి వ్యక్తిగత లక్షణాలు, స్వరూప స్వభావాల ఆధారంగా నిపుణుల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది.

డా. శ్రీకాంత్ మోర్లావార్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
టోల్ ఫ్రీ 1800 1081212
ఉచిత కన్సల్టేషన్
955 000 1188/99
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు



డీఆర్‌డీవో-జీటీఆర్‌ఈలో అప్రెంటిస్‌లు

బెంగళూరులోని గ్యాస్ టర్బైన్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్‌ఈ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న డిప్లొమా లేదా గ్రాడ్యుయేట్/ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

జీటీఆర్‌ఈ అనేది డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం అప్రెంటిస్‌ల సంఖ్య: 150
- పోస్టు పేరు: డిప్లొమా లేదా గ్రాడ్యుయేట్/ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీ

ఇంజినీరింగ్ అప్రెంటిస్ ట్రెయినీ ..

- మెకానికల్ /ప్రొడక్షన్/ఇండస్ట్రియల్ ప్రొడక్షన్-35, ఏరో /ఏరో మెకానికల్-20
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకట్రానిక్స్-15
- కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ-15, మెటలర్జీ-3, సివిల్-2
- **అర్హత** :గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి సంబంధిత ఇంజినీరింగ్/టెక్నాలజీ సబ్జెక్టులో నాలుగేండ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.

డిప్లొమా అప్రెంటిస్ ట్రెయినీ..

- మెకానికల్ /ప్రొడక్షన్/టూల్ అండ్ డిజైన్-15, కంప్యూటర్ సైన్స్/ఇంజినీరింగ్-3, మెటలర్జీ-2
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్,-10
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి సంబంధిత ఇంజినీరింగ్/టెక్నాలజీ సబ్జెక్టులో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.



ఐటీఐ అప్రెంటిస్ ట్రెయినీ ..

- మెషినిస్ట్-4, ఫిట్టర్-4, టర్నర్-4, ఎలక్ట్రీషియన్-2, వెల్డర్-2, షీట్ మెటల్ వర్కర్-2, మెకానిక్ మోటార్ వెహికిల్-2
- కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా)-8, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్క్ మెయింటెనెన్స్-2
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి సంబంధిత ఐటీఐ ట్రేడ్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 సెప్టెంబర్ 1 నాటికి 18 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లవరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **స్టయిఫండ్ :** బీఈ/బీటెక్ అభ్యర్థులకు రూ. 4984/-, డిప్లొమా అభ్యర్థులకు రూ. 3542/-చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ ద్వారా. బీఈ/బీటెక్ లేదా డిప్లొమా అభ్యర్థులు (www.mhrdnats.gov.in), ఐటీఐ అభ్యర్థులు (https://ncvtmis.gov.in) వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ రిజిస్టర్ ఫామ్ దరఖాస్తుతోపాటు, సంబంధిత సర్టిఫికెట్లు, ఫొటో జతపరిచి పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా: The Director Gas Turbine Research Establishment, C V Raman Nagar, Bengaluru - 560 093.

- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **చివరితేదీ:** సెప్టెంబర్ 5
- **ఇంటర్వ్యూ తేదీ:** సెప్టెంబర్ 18 నుంచి 20
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

ఎన్‌ఐబీలో

నోయిడాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్ ఖాళీగా ఉన్న బెంచ్ బయాలజిస్ట్ (తాత్కాలిక ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది

వివరాలు:

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్ ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం పోస్టుల సంఖ్య:6
- పోస్టు పేరు: బెంచ్ బయాలజిస్ట్
- **అర్హత:** ఎమ్మెస్సీ (మైక్రోబయాలజీ,ఫార్మకాలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మాలిక్యులార్ బయాలజీ)/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **వయస్సు:** 25 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** సెప్టెంబర్ 5
- **వెబ్‌సైట్:** http://nib.gov.in

ఏఐఈఎస్‌ఎల్‌లో అసిస్టెంట్ సూపర్‌వైజర్లు

ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్‌ఎల్) నార్తర్న్‌రీజియన్ పరిధిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సూపర్‌వైజర్ (తాత్కాలిక ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఏఐఈఎస్‌ఎల్ అనేది ఎయిర్ ఇండియా లిమిటెడ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే సంస్థ.



- **పోస్టు పేరు:** అసిస్టెంట్ సూపర్‌వైజర్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 85 పోస్టులు (జనరల్-45, ఓబీసీ-22, ఎస్సీ-12, ఎస్టీ-6)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కంప్యూటర్ కోర్సులో ఏడాదిపాటు డిప్లొమా /సర్టిఫికెట్ ఉండాలి. బీసీఏ/బీఎస్సీ ఐటీ/ బ్యాచిలర్ డిగ్రీ (ఐటీ) లేదా ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు :** 33 ఏండ్లకు మించరాదు
- **పే స్కేల్:** నెలకు రూ. 15,180/- ఏడాదికి ఇంక్రిమెంట్ రూ. 400/-ఇస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** అర్హత కలిగిన అభ్యర్థులందరూ నిర్ణీత నమూనాలో దరఖాస్తును నింపి, డిమాండ్ డ్రాఫ్ట్, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా: Air India Engineering Services Limited, NORTHERN REGION, PERSONNEL DEPARTMENT A320 AVIONICS COMPLEX, IGI AIRPORT, Terminal-II NEW DELHI-110037

- వెబ్‌సైట్:www.airindia.in

సదరన్ రీజియన్‌లో కొలువులు

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఎంపిక
- డిగ్రీ, డిప్లొమా, పదోతరగతితో ఉద్యోగ అవకాశాలు
- రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్ ద్వారా ఎంపిక

చెన్నైలోని సదరన్ రీజియన్ పరిధిలోని పలు కేంద్రశాఖల్లో ఖాళీగా ఉన్న టెక్నికల్ సూపరింటెండెంట్, మెడికల్ అటెండెంట్, జూనియర్ కన్జర్వేషన్ అటెండెంట్ తదితర పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

తమిళనాడులోని చెన్నై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న సదరన్ రీజియన్ పరిధిలో ఈ ఖాళీలు ఉన్నాయి.

- మొత్తం పోస్టుల సంఖ్య: 66

విభాగాల వారీగా పోస్టులు:

- **టెక్నికల్ సూపరింటెండెంట్-3 పోస్టులు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ)లో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో మూడేండ్ల అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 9300-34,800 +గ్రేడ్ పే రూ. 4200/-
- **వర్క్‌షాప్ సూపరింటెండెంట్-1 పోస్టు**
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ సంస్థ నుంచి బ్యాచిలర్ డిగ్రీ (మెకానికల్ ఇంజినీరింగ్) లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 9300-34,800 + గ్రేడ్ పే రూ. 4600/-
- **సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్)-1 పోస్టు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ లేదా హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ), బ్యాచిలర్ డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ లేదా టెక్స్‌టైల్ ఇంజినీరింగ్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 9300-34,800 + గ్రేడ్ పే రూ. 4200/-
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు (పై పోస్టులన్నింటికి)
- **మెడికల్ అటెండెంట్-34 పోస్టులు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి పదోతరగతిలో ఉత్తీర్ణత. కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
- **లేడీ మెడికల్ అటెండెంట్-15 పోస్టులు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి పదోతరగతిలో ఉత్తీర్ణత. కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 5200-20200 + గ్రేడ్ పే రూ.1800/-
- **కన్జర్వేషన్ అసిస్టెంట్-2 పోస్టులు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి పదోతరగతితోపాటు డిప్లొమా (సివిల్ ఇంజినీరింగ్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 25,500-81,100/-
- **జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్-9 పోస్టులు**
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/ సంస్థ నుంచి పదోతరగతితోపాటు ఐటీఐ (సివిల్ ఇంజినీరింగ్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 19,900-63,200/-
- **వయస్సు:** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. (పై పోస్టులన్నింటికి)
- **ఎవల్యూషన్ అసిస్టెంట్-1 పోస్టు**
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ / సంస్థ నుంచి బ్యాచిలర్ డిగ్రీ (స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, సోషియాలజీ, సోషల్ వర్క్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 29,200-92,300/-
- **దరఖాస్తు ఫీజు:** రూ. 100/- మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్ సర్వీస్‌మెన్లకు ఎటువంటి ఫీజు లేదు.

ఆన్‌లైన్ రాత పరీక్ష, సిలబస్:

సబ్జెక్ట్	ప్రశ్నలు	మార్కులు
జనరల్ ఇంటెలిజెన్స్	25	50
ఇంగ్లిష్ లాంగ్వేజ్	25	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	25	50
జనరల్ అవేర్‌నెస్	25	50
మొత్తం	100	200

- **ఎంపిక విధానం:** ఓఎంఆర్/ కంప్యూటర్ బేస్డ్ ఆబ్జెక్టివ్ టైప్ ఎగ్జామినేషన్. స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా చేస్తారు.
- ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- పరీక్ష కాలవ్యవధి 60 నిమిషాలు
- పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 0.50 లేదా 1/2 మార్కులు కోత విధిస్తారు.
- ఆన్‌లైన్ టెస్ట్‌లో మెరిట్ పొందిన అభ్యర్థులను రిజర్వేషన్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
- పోస్టులనుబట్టి మెట్రిక్యులేషన్ స్థాయి, హయ్యర్ సెకండరీ స్థాయి, డిగ్రీ స్థాయి పోస్టులకు ఆయా స్థాయిల్లో ప్రశ్నలను ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రింట్‌తీసి సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 24 (సాయంత్రం 5 గంటల లోపు)
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ :** అక్టోబర్ 4

చిరునామా: The Regional Director (SR), Staff Selection Commission, Southern Region, II Floor , EVK Sampath Building, DPI Campus, College Road, Chennai – 600 006.

- **వెబ్‌సైట్:** www.ssconline.nic.in.

యూపీఎస్సీ

కేంద్రప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

యూపీఎస్సీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఏర్పాటుచేసిన స్వతంత్ర సంస్థ. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉంది.

- **ఎకనమిక్ ఆఫీసర్ - 1**
- ఈ పోస్టు వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలో ఉంది.
- **అర్హతలు:** ఎకనామిక్స్ లేదా తత్సమాన సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణత. రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 44,900 - 1,42,400/-
- ఈ పోస్టు గ్రూప్ బీ గెజిటెడ్ నాన్ మినిస్టీరియల్ పోస్టు.
- **సూపరింటెండెంట్ ఎపిగ్రఫిస్ట్** (ద్రవిడియన్ ఇన్‌స్క్రిప్ట్) - 1
- ఈ పోస్టు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో ఉంది.
- **అర్హతలు:** పీజీలో తమిళ్/తెలుగు లేదా మలయాళం/కన్నడలో ఉత్తీర్ణత. డిగ్రీస్థాయిలో ప్రాచీన భారతదేశ చరిత్ర ఒక సబ్జెక్టుగా కలిగి ఉండాలి. అనుభవం ఉండాలి.
- **జూనియర్ ఇంటర్‌ప్రెటర్ (చైనీస్) - 1**
- ఈ ఖాళీ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో ఉంది.
- **అర్హత:** చైనీస్‌లో పీజీ, డిగ్రీస్థాయిలో ఇంగ్లిష్ ప్రధాన సబ్జెక్టుగా చదివిన వారు అర్హులు.
- **జూనియర్ ఇంటర్‌ప్రెటర్ (జపనీస్) - 1**
- ఈ పోస్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పరిధిలో ఉంది.
- **అర్హత:** జపనీస్‌లో పీజీ, డిగ్రీస్థాయిలో ఇంగ్లిష్ ప్రధాన సబ్జెక్టుగా చదివిన వారు అర్హులు.
- **గ్రేడ్ - 3 స్పెషలిస్ట్ (మైక్రోబయాలజీ) - 27**
- ఈ పోస్టులు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో ఉన్నాయి.
- **అర్హతలు:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు 1, 2 షెడ్యూల్‌లో నియామకాలకు ఉండాల్సిన అర్హతలను కలిగి ఉండాలి.
- **ఎకనమిక్ ఆఫీసర్ - 10 ఖాళీలు**
- ఈ పోస్టులు నీతి ఆయోగ్‌లో ఉన్నాయి.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు
- **అర్హతలు:** పీజీలో ఎకనమిక్స్ ఉత్తీర్ణత. కనీసం ఎకనమిక్స్ రిసెర్చ్/ఇన్వెస్టిగేషన్‌లో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **వెబ్‌సైట్:** http://www.upsc.gov.in

డీఆర్‌డీవోలో

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

డీఆర్‌డీవో రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుంది. ప్రస్తుత ఖాళీలు డీఆర్‌డీవోని డిఫెన్స్ మెటలర్జికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీలో ఉన్నాయి.

- ప్రైవేట్ మెడికల్ డాక్టర్
- **అర్హత:** ఎంబీబీఎస్, హాస్పిటల్, హెల్త్ మేనేజ్‌మెంట్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. అనుభవం ఉండాలి.
- **ఫార్మాసిస్ట్**
- **అర్హత:** బీఫార్మసీ ఉత్తీర్ణత. హాస్పిటల్, హెల్త్ మేనేజ్‌మెంట్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **దరఖాస్తు:** పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను పంపాలి.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 6 లోగా చేరేలా పంపాలి. (పత్రికల్లో ప్రకటన విడుదలైన 10 రోజుల్లోగా)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **పూర్తి వివరాల కోసం ఫోన్ నంబర్:** 040 - 24586893లో సంప్రదించవచ్చు.

ఐసీసీఆర్‌లో స్టెనోగ్రాఫర్లు

ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

ఐసీసీఆర్ భారత ప్రభుత్వ రంగ సంస్థ.

- సీనియర్ స్టెనోగ్రాఫర్ (గ్రూప్ బీ) (ఇంగ్లిష్)
- ఖాళీల సంఖ్య - 3. ఇవి జనరల్ క్యాటగిరీలో ఉన్నాయి.
- **పేస్కేల్:** రూ. 9,300 - 34,800 + గ్రేడ్ పే రూ. 4,200/-
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత. నిమిషానికి 100 పదాల డిక్టేషన్. దీన్ని 60 నిమిషాల్లో కంప్యూటర్ పై ట్రాన్‌స్క్రిప్షన్ చేయాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిప్లొమా/సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
- జూనియర్ స్టెనోగ్రాఫర్ (గ్రూప్ సీ) (ఇంగ్లిష్)
- ఖాళీల సంఖ్య - 2
- **పేస్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 2,400/-
- వయస్సు 27 ఏండ్లు మించరాదు.
- **అర్హతలు:** ఇంటర్ ఉత్తీర్ణత. నిమిషానికి 80 పదాల వేగం కలిగి ఉండాలి. 10 నిమిషాల డిక్టేషన్ చేస్తారు. దీన్ని కంప్యూటర్‌పై 60 నిమిషాలలో ట్రాన్‌స్క్రిప్షన్ చేయాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సర్టిఫికెట్/డిప్లొమా కలిగి ఉండాలి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **వెబ్‌సైట్:** www.iccr.gov.in

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో 142 ఖాళీలు

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ పరిధిలో పనిచేస్తున్న ఫీల్డ్ ఆర్డినెన్స్ డిపో, ఫీల్డ్ అమ్యునిషన్ డిపో యూనిట్లలో ఖాళీగా ఉన్న మెటీరియల్ అసిస్టెంట్, ఫైర్‌మెన్, ట్రేడ్స్‌మెన్ (మేట్) తదితర పోస్టుల భర్తీకి కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విభాగలైన ఎఫ్‌ఓడీ, ఎఫ్ఏడీ, ఐఎన్‌ఎఫ్ డీఓయూ, ఎంటీఎన్ డీఓయూ, ఏఎంఎన్ సీఓవై యూనిట్లలో ఈ పోస్టులు భర్తీచేస్తారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 142 పోస్టులు
- **మెటీరియల్ అసిస్టెంట్-6 పోస్టులు** (జనరల్-3, ఓబీసీ-3)
- **లోయర్ డివిజన్ క్లర్క్-1, ఫార్మాసిస్ట్-1 పోస్టు**
- **టెలిఫోన్ ఆపరేటర్-1, దోబి-1**
- **ఫైర్‌మెన్-36 పోస్టులు** (జనరల్-18, ఓబీసీ-10, ఎస్సీ-3, ఎస్టీ-5)
- **ట్రేడ్స్‌మెన్ (మేట్)-94 పోస్టులు** (జనరల్-49, ఓబీసీ-27, ఎస్సీ-8, ఎస్టీ-10)
- **మల్టీ టాస్కింగ్ స్టాఫ్-1, టైలర్-1**
- **వయస్సు:** 18 - 25 ఏండ్ల మధ్య ఉండాలి.
  అర్హత : పదోతరగతి/మెట్రిక్యులేషన్. ఫార్మసీ, ఇంటర్/డిప్లొమా, డిగ్రీలో ఉత్తీర్ణత. ఈ పోస్టులను ఫిజికల్ టెస్ట్/ఎండ్యూరెన్స్ టెస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఫైర్‌మెన్‌కు మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు కనీసం 165 సెం.మీ. ఎత్తు, ఛాతీ - 81.5 సెం.మీ. బరువు కనీసం 50 కేజీలు ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 1,800/- (ఫైర్‌మెన్‌కు గ్రేడ్ పే రూ.1900/-)
- **ఎంపిక:** ఫిజికల్ టెస్ట్, ఆబ్జెక్టివ్ రాతపరీక్ష ద్వారా.
- రాతపరీక్ష 150 మార్కులకు ఉంటుంది. దీనికి కేటాయించిన సమయం రెండు గంటలు
- ఆబ్జెక్టివ్ రాతపరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్-25 మార్కులు, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ -25 మార్కులు, జనరల్ ఇంగ్లిష్-50 మార్కులు, జనరల్ అవేర్‌నేస్-50 మార్కులు వస్తాయి.
- రాతపరీక్ష అనేది కేవలం ఇంగ్లిష్/హిందీ భాషలో ఉంటుంది.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలోపూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** సెప్టెంబర్ 3

చిరునామా: Commandant 21 Field Ammunition Depot, PIN 909721, C/o 56 APO

- **వెబ్‌సైట్:** www. indianarmy.nic.in

ఓఎన్‌జీసీలో ఎగ్జిక్యూటివ్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఓఎన్‌జీసీ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీ. ఆసియాలోనే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన దీన్ని 1956 ఆగస్టు 14న స్థాపించారు.

- మొత్తం పోస్టుల సంఖ్య : 27
- **హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్-20 పోస్టులు** (జనరల్-10, ఓబీసీ-5, ఎస్సీ-3, ఎస్టీ-2)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏ (పర్సనల్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్‌డీ/హెచ్‌ఆర్‌ఎం), పోస్టు గ్రాడ్యుయేట్/పీజీ డిప్లొమా (పర్సనల్ మేనేజ్‌మెంట్, ఐఆర్, లేబర్ వెల్ఫేర్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్-5 పోస్టులు** (జనరల్-3, ఓబీసీ-2)
- **అర్హత:**గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏ (ఫైనాన్స్)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్-2 పోస్టులు**
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీ (హిందీ)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2017 జనవరి 1 నాటికి 30 ఏండ్లకు మించరాదు. అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ పోస్టుకు 40 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది
- **ఎంపిక:** యూజీసీ నెట్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేదీ :** సెప్టెంబర్ 19
- **పర్సనల్ ఇంటర్వ్యూ :** జనవరి 2018
- **వెబ్‌సైట్ :**www.ongcindia.com

రైట్స్‌లో మేనేజర్లు

రైట్స్ లిమిటెడ్ ఏజీఎం, జీఎం, ఏఎం, డీజీఎం తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

వివరాలు:

రైట్స్ లిమిటెడ్ భారత ప్రభుత్వ రంగ సంస్థ. దీని ప్రధాన కార్యాలయం గురుగ్రామ్‌లో ఉంది.

- అడిషనల్ జనరల్ మేనేజర్ - 2, జాయింట్ జనరల్ మేనేజర్ (స్ట్రక్చరల్ డిజైన్ ఎక్స్‌పర్ట్) - 2, జాయింట్ జనరల్ మేనేజర్ (ఈ అండ్ ఎం ఎక్స్‌పర్ట్) - 1, మేనేజర్ (సోషియాలజీ/సోషల్ వర్క్) - 2, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్/ఇంజినీరింగ్) - 4, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) - 1, డీజీఎం (సివిల్) - 1, డీజీఎం (రోలింగ్ స్టాక్) - 1 ఖాళీ ఉన్నాయి.
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్, **చివరితేదీ:** సెప్టెంబర్ 7
- **వెబ్‌సైట్:** www.rites.com

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ కొచ్చి ప్రధాన కార్యాలయంగా పనిచేస్తుంది. దీని మాతృసంస్థ ఎయిర్ ఇండియా లిమిటెడ్. దీని స్లోగన్ "Simply PriceLess". ఈ సంస్థను 2005, ఏప్రిల్ 29న ప్రారంభించారు.

విభాగాల వారీగా ఖాళీలు:

- ఆపరేషన్స్ విభాగంలో..
- మేనేజర్ - ఫ్లైట్ డిస్పాచ్ (ముంబై) - 14, మేనేజర్ - ఆపరేషన్స్ ఎక్స్‌పాట్ సెల్ -1, సీనియర్ ఆఫీసర్ - ఫ్లైట్ డిస్పాచ్ - 6, ఆఫీసర్ - కాక్‌పిట్/క్యాబిన్ క్ర్యూ షెడ్యూలింగ్ - 3, అసిస్టెంట్ టెక్నికల్ లైబ్రేరి - 1.
- ఫ్లయిట్ సేఫ్టీ విభాగంలో..
- డిప్యూటీ మేనేజర్ -ఫ్లైట్ సేఫ్టీ - 1, సీనియర్ ఆఫీసర్ - ఫ్లైట్ సేఫ్టీ - 1
- ట్రెయినింగ్ విభాగంలో..
- బీ737-800 సింథటిక్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ - 2, అసిస్టెంట్ ట్రెయినింగ్ - 1 ఖాళీ ఉన్నాయి.
- **అర్హతలు**, అనుభవం, జీతభత్యాలు తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.airindiaexpress.in



శర్వానంద్

మాఫియా డాన్ పాత్రలో..

'శతమానంభవతి' చిత్రంతో కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని అందుకున్నారు శర్వానంద్. విమర్శకుల ప్రశంసలతో పాటు జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఈ చిత్రం నటుడిగా ఆయనకు మంచి పేరును తెచ్చిపెట్టింది. కెరీర్ తొలినాళ్ల నుంచి వైవిధ్యతకు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్న శర్వానంద్ తాజాగా మాఫియా లీడర్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..స్వామిరారా, కేశవ చిత్రాలతో ప్రతిభను చాటుకున్న సుధీర్‌వర్మ దర్శకత్వంలో శర్వానంద్ కథానాయకుడిగా ఓ సినిమా రూపొందనున్నట్లు సమాచారం. ఓ సామాన్యుడు పరిస్థితుల ప్రభావం వల్ల కాలక్రమంలో మాఫియాడాన్‌గా ఎలా ఎదిగాడనే శక్తివంతమైన కథ, కథనాలతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలిసింది. ఇందులో శర్వానంద్ నలభై ఏళ్ల మాఫియా డాన్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. నేర సామ్రాజ్యానికి నాయకుడిగా అతడి పాత్ర కొత్త పంథాలో సాగనున్నట్లు తెలిసింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



రాజమౌళి

'అర్జున్‌రెడ్డి' అదరగొట్టాడు!

'అర్జున్‌రెడ్డి' చిత్రం అద్భుతమైన ప్రేక్షకాదరణతో విజయపథంలో పయనిస్తున్నది. ఈ సినిమాపై పలువురు సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ట్రెండ్‌సెట్టర్ మూవీ అంటూ అభినందిస్తున్నారు. తాజాగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి ఈ సినిమాపై స్పందించారు. ట్విట్టర్ ద్వారా చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని ప్రశంసించారు. 'ప్రేమకథలు నా అభిరుచికి సరిపడవు. అయితే 'అర్జున్‌రెడ్డి' సినిమా బాగా నచ్చింది. విజయ్‌దేవరకొండ అత్యుత్తమ నటనను కనబరిచాడు. తన పాత్రలో జీవించాడు. కథానాయిక శాలినితో పాటు సినిమాలో నటించిన ఇతర సహాయ తారాగణమంతా తమ పాత్రల్లో ఉత్తమంగా రాణించారు. సంభాషణలు చాలా సహజంగా వున్నాయి. సినిమా సక్సెస్ క్రెడిట్ మొత్తం దర్శకుడు సందీప్‌రెడ్డికే చెందుతుంది. గొప్ప సమన్వయంతో తన బృందాన్ని నడిపించాడు. 'అర్జున్‌రెడ్డి' బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధిస్తున్నందుకు చిత్ర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు' అంటూ రాజమౌళి ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



సమంత



రకుల్‌ప్రీత్‌సింగ్

అదే నా సక్సెస్ సీక్రెట్...

చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి ఏడేళ్లయినా సక్సెస్‌ను ఎలా సెలబ్రేట్ చేసుకోవాలో తనకు తెలియదని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఓ సినిమా కోసం పడ్డ కష్టానికి గుర్తింపు లభిస్తే అదే తన దృష్టిలో అతిపెద్ద విజయంగా భావిస్తానని అంటున్నది. గత మూడేళ్లుగా తెలుగులో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ సొగసరిని లక్కీ స్టార్‌గా చిత్ర వర్గాలు అభివర్ణిస్తున్నాయి. గోల్డన్ గర్ల్, లక్కీస్టార్ అనే బిరుదులు తాత్కాలికమని, చిరకాలం చిత్రసీమలో మనుగడ సాగించడానికి అవేవీ తోడ్పడవని రకుల్‌ప్రీత్‌సింగ్ పేర్కొంది. ప్రతిభకు తోడు కష్టపడేతత్వమే తనకు విజయాల్ని తెచ్చిపెట్టిందని అంటోంది. విజయం వరించిన తర్వాత దానిని నిలుపుకోవడానికి వేసే ప్రతి అడుగులో జాగ్రత్త పడాలని, కథలో ఎంపికలో మూస ధోరణిలో కాకుండా భిన్నంగా ఆలోచించడమే తన సక్సెస్ సీక్రెట్ అని తెలిపింది. భవిష్యత్తులో చిత్రనిర్మాణ రంగంలో అడుగుపెట్టే ఆలోచన ఉందని అంటున్నది. రకుల్ ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ 'మధ్య తరగతి కుటుంబం నుంచి చిత్రసీమలో అడుగుపెట్టడంతో డబ్బు విలువ నాకు తెలుసు. అందుకే డబ్బుతో ముడిపడిన విషయాల్లో తొందరపాటు నిర్ణయాలు పనికిరావు. చిత్ర నిర్మాణంపై ఆసక్తి ఉంది. కానీ కథానాయికగా ప్రస్తుతం మంచి అవకాశాలు వస్తున్నాయి. కెరీర్ దృష్టిలో పెట్టుకొని కొన్నాళ్లు ఆ ఆలోచనను వాయిదా వేశాను' అని తెలిపింది.

థాంక్స్ డియర్ కోడలా...

ఈ ఏడాది అక్కినేని ఇంట కోడలిగా అడుగుపెట్టబోతున్నది సమంత. అక్టోబర్ 6న నాగచైతన్య, సమంతల వివాహం గోవాలో హిందు, క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతుల్లో జరగనున్నది. ప్రస్తుతం పెళ్లి ఏర్పాట్లలో ఈ జంట బిజీగా ఉన్నారు. తాజాగా మంగళవారం తన మావయ్య నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు తనదైన శైలిలో శుభాకాంక్షలు చెప్పింది సమంత. ఈ మామాకోడళ్ల సంభాషణ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. నాగార్జున ప్రధాన పాత్రలో ఓంకార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రాజుగారి గది-2'. ఈ చిత్రంలో సమంత ఓ కీలక పాత్రను పోషిస్తున్నది. నాగార్జున పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం ఈ చిత్ర ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను సమంత స్వయంగా విడుదల చేసింది. అంతేకాకుండా కాబోయే మామకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. 'మామయ్య ఎప్పటికి కింగ్. తనను తాను ఎలా పరిపాలించుకోవాలో ఆయనకు బాగా తెలుసు. సంవత్సరాలు గడుస్తున్నా కొద్ది మా మామ మరింత గొప్పగా కనిపిస్తున్నారు. హ్యాపీబర్త్‌డే మామయ్య' అంటూ ట్వీట్ చేసింది సమంత. ఆమె ట్వీట్‌కు నాగార్జున స్పందించారు. 'థాంక్స్ డియర్ కోడలా. యూ ఆర్ ద బెస్ట్' అంటూ రీ ట్వీట్ చేశారు. ఈ మామ కోడళ్ల మధ్య సాగిన సంభాషణ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

హీరోల్ని దాటేసింది..!



దీపికా పదుకునే

చిత్రసీమలో హీరోలే ఆధిపత్యాన్ని చెలాయిస్తారు. అత్యధిక పారితోషికాలు కూడా వారే తీసుకుంటారు. పారితోషికాల విషయంలో కథానాయికలు వివక్షకు గురవుతున్నారనే అపవాదు వుంది. అయితే బెంగళూరు సుందరి దీపికాపదుకునే మాత్రం ట్రెండ్‌ను తిరగరాసింది. తన తాజా చిత్రం 'పద్మావతి'లో హీరోల కంటే ఎక్కువ పారితోషికాన్ని అందుకొని కొత్త రికార్డు సృష్టించింది. వివరాల్లోకి వెళితే... సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పద్మావతి'. దీపికాపదుకునే కథానాయిక. రణవీర్‌సింగ్, షాహిద్‌కపూర్ హీరోలుగా నటిస్తున్నారు. కథానాయిక ప్రాధాన్యత ఉన్న చిత్రం కావడం వల్ల ఈ సినిమా కోసం దీపికాపదుకునే 13కోట్ల పారితోషికాన్ని స్వీకరించిందట. చిత్ర హీరోలు రణవీర్‌సింగ్, షాహిద్‌కపూర్‌లు మాత్రం చెరో పదికోట్ల పారితోషికాన్ని తీసుకున్నారట. వీరిద్దరు బాలీవుడ్‌లో అగ్ర హీరోలుగా చలామణి అవుతున్నారు. అయినప్పటికి కథానాయిక కంటే తక్కువ పారితోషికాన్ని తీసుకోవడం బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రేక్షకులముందుకు రానుంది.



దివ్య, కిరణ్

మళ్లీ వచ్చిందా?

కిరణ్, దివ్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'మళ్లీ వచ్చిందా'. కె.నరేంద్రబాబు దర్శకత్వం వహిస్తున్నారు. సి.వి.ఫిలింస్ పతాకంపై సి.వెంకటేష్ నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో టి. ప్రసన్నకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటి వరకు వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠతను పంచుతుంది. ఓ ఆత్మ టెక్నాలజీని ఉపయోగించి ఒక ఫోన్ నుంచి మరో ఫోన్‌లోకి వెళ్లి ఎలా భయపెట్టింది అనేది ఆసక్తిని పంచుతుంది. భయపెడుతూనే నవ్వించే చిత్రమిది. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. వినూత్నమైన నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమాలో భాగం అయినందుకు ఆనందంగా వుందని నాయకానాయికలు తెలిపారు. బేబీ ప్రగ్న, బేబీ స్నేహ, మంజునాథ్, మధుసాగర్, వందన తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: గిరిధర్ దివాన్, ఛాయాగ్రహణం: పూర్ణ. కె.

ఇందు.. గోపీ.. ప్రణయం

ఆశిష్‌రాజ్, సిమ్రన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇగో'. ఆర్.వి. సుబ్రహ్మణ్యం(సుబ్బు) దర్శకత్వం వహిస్తున్నారు. వి.కె.ఏ ఫిలిమ్స్ పతాకంపై విజయ్ కరణ్, కౌశల్‌కరణ్, అనిల్ కరణ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గోదావరి పరిసర ప్రాంతాల్లో మూడో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతున్నది . దర్శకుడు మాట్లాడుతూ ' ఇందు, గోపీ అనే ఓ జంట ప్రేమకథా చిత్రమిది. అహంభావ మనస్తత్వం కలిగిన వారు ఎలా ఏకమయ్యారు? అనేది ఆసక్తిని పంచుతుంది. రొమాన్స్, సస్పెన్స్ అంశాలతో పాటు చక్కటి వినోదం ఉంటుంది. గ్రామీణ, పట్టణ సంస్కృతుల నేపథ్యంలో ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగుతుంది. రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నాం. నాణ్యత విషయంలో రాజీపడకుండా అనుకున్న సమయం కంటే ముందుగానే చిత్రాన్ని పూర్తిచేస్తాం. త్వరలో ఫస్ట్‌లుక్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. దీక్షాపంథ్, రావు రమేష్, పోసాని కృష్ణమురళి, పృథ్వీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:సాయికార్తీక్, కెమెరా: ప్రసాద్ జి.కె.



సిమ్రన్, ఆశిష్‌రాజ్



ఆస్ట్రేలియాలో మైనింగ్ సదస్సుకు హాజరైన
టీఎస్ఎండీసీ బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆస్ట్రేలియా న్యూ సౌత్ వేల్స్‌లో జరుగుతున్న 'ది మైనింగ్-2017' రిసోర్స్ కన్వెన్షన్ సదస్సులో రాష్ట్రం నుంచి టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎండీ మల్సూర్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ సుశీల్‌కుమార్, మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. రెండురోజులపాటు నిర్వహిస్తున్న ఈ సదస్సులో మొదటిరోజు మంగళవారం ఆస్ట్రేలియా ప్రభుత్వ అధికారులతో చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డితోపాటు ఎండీ, డైరెక్టర్ చర్చలు జరిపారు. అక్కడ అమలవుతున్న విధానాలను తెలుసుకున్నారు. మైనింగ్ తవ్వకాల్లో అవలంబిస్తున్న నూతన పద్ధతులు, సర్వే, పర్యావరణ పరిరక్షణలో ఆధునిక పద్ధతులను పరిశీలించారు. రాష్ట్రంలో పర్యావరణానికి ఇబ్బందులు లేకుండా మైనింగ్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు అక్కడి అధికారులకు తెలిపారు.

సీట్లకు ఢోకాలేదు

- డిగ్రీ మూడోవిడుత కౌన్సెలింగ్‌లో రెండోసారి సీట్ల కేటాయింపు రేపు
- ఇంటర్నల్ పరీక్షలు వాయిదా.. అక్టోబర్ 5 నుంచి నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీ విషయంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని గుర్తించిన దోస్త్ అధికారులు.. మూడోవిడుత కౌన్సెలింగ్ ప్రక్రియలో రెండోసారి విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ చేయాలని కొంతమంది విద్యార్థులు ఆందోళనకు దిగి, సమస్యను మంగళవారం దోస్త్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రంగంలోకి దిగిన అధికారులు.. సీజీజీలో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల మూడోవిడుత దోస్త్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైన విషయాన్ని గుర్తించారు. సీజీజీ ప్రతినిధులతో సమావేశమై, అనంతరం విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్నామని హామీ ఇచ్చారు. డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన మూడోవిడుత వెబ్ కౌన్సెలింగ్ వరకు 1,87,360 మంది విద్యార్థులు సీట్లు పొందారు. మరో 44 వేల మంది సీట్లు పొంది, వాటిని రద్దు చేసుకున్నారు. ఆరువేల మందికి దోస్త్ ద్వారా సీట్ల కేటాయింపు జరుగలేదు. మూడోవిడుతలో సీట్ల కేటాయింపు ప్రక్రియలో తప్పులు దొర్లడం వల్ల తిరిగి కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు మంగళవారం అర్ధరాత్రి వరకు గడువు విధించారు. గురువారం (ఈనెల 31న) మూడోవిడుత కౌన్సెలింగ్‌లో రెండోసారి సీట్లు కేటాయించనున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి కొత్తగా రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదని, ఇప్పటికే సీట్లు పొందిన విద్యార్థులు స్లైడింగ్ చేసుకోవడానికి అవకాశంలేదని స్పష్టంచేశారు. మిగతా సమస్యలకు పరిష్కారం చూపి, విద్యార్థులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ కొంత ఆలస్యమవుతున్న నేపథ్యంలో సెప్టెంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు జరుగాల్సిన ఇంటర్నల్ పరీక్షలను వాయిదావేశారు. తిరిగి ఆ పరీక్షలను అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని డిగ్రీ కళాశాలల్లో జూలై 3 నుంచే తరగతులను ప్రారంభించామని, ఇప్పుడు కొత్తగా ప్రవేశాలు పొందే వారు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేలా.. అదనపు తరగతులను నిర్వహించాలని అన్ని కాలేజీలకు ఆదేశాలు జారీ చేశామని దోస్త్ కన్వీనర్ తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు

ప్రతిపక్షాలపై మండిపడ్డ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధినిచూసి ప్రతిపక్ష నేతలకు మైండ్ బ్లాంక్ అయ్యిందని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నేతలు మతితప్పి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం కేసీఆర్‌కు గ్లోబల్ అగ్రికల్చర్ సమ్మిట్ సొసైటీ అందజేస్తున్న అవార్డుపై పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని ఆగ్రహం వ్యక్తంచేశారు. సొసైటీపై కాంగ్రెస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ చేసిన ఆరోపణలను ఐసీఎఫ్ఏ తప్పుపట్టిన విషయాన్ని ఉత్తమ్ గుర్తుచేసుకోవాలన్నారు. శ్రవణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే కఠినచర్యలు చేపడుతామంటూ ఐసీఎఫ్ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెచ్చరించారనే విషయాన్ని విస్మరించకూడదన్నారు. అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ రైతు సమగ్రసర్వే, భూసార పరీక్ష కార్డుల పంపిణీపై దృష్టి సారించారన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రాజెక్టులను నిర్మిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు కాంగ్రెస్, టీడీపీలు దుమ్మెత్తిపోసుకున్నాయని, కానీ ఇప్పుడు రెండు పార్టీలు కలిసి టీఆర్ఎస్‌ను విమర్శించడం సిగ్గుచేటని అన్నారు.

పాలమూరును ఎండబెట్టిన పాపం కాంగ్రెస్‌దే

జైపాల్‌రెడ్డి, డీకే అరుణపై శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం


టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వెనుకబడిన పాలమూరు జిల్లాకు చుక్కనీరు అందకుండాచేసి.. భూములను ఎండబెట్టిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు రూ.35 వేల కోట్లతో సీఎం కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనను విమర్శించడం సిగ్గుచేటని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నేతలు జైపాల్‌రెడ్డి, డీకే అరుణ నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దశాబ్దాల తరబడి అధికారంలో ఉన్నప్పుడు వీరికి జిల్లా ప్రజల కష్టాలు కనిపించలేదని, పాలమూరు జిల్లాపై వీరికి కొత్తగా ప్రేమ పుట్టుకువచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రిగా, జాతీయస్థాయి నాయకుడిగా జైపాల్‌రెడ్డి సొంతజిల్లాకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్ హయాంలో తెలంగాణకు రావాల్సిన నీటిని పోతిరెడ్డిపాడుద్వారా రాయలసీమకు తరలిస్తుంటే.. మంగళ హారతులు పట్టిన ఘనత డీకే అరుణకే దక్కుతుందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని వ్యాఖ్యానించడం జైపాల్‌రెడ్డి హోదాకు తగదన్నారు.

కాంగ్రెస్‌కు కోదండరాం కరివేపాకు

ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి వ్యాఖ్య


మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

న్యూఢిల్లీ/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జేఏసీ నేత ప్రొఫెసర్ కోదండరాంను కాంగ్రెస్ నేతలు కరివేపాకులా వాడుకుంటున్నారని, ఈ విషయాన్ని ఆయన గమనించాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి అన్నారు. తెలంగాణ తెచ్చింది, ఇచ్చింది తామేనని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ చివరకు ప్రభుత్వం మీద కోపంతో, టీఆర్ఎస్ మీద వ్యతిరేకతతో, సీఎం కేసీఆర్ మీద అక్కసుతో అంతిమంగా తెలంగాణకు ద్రోహం చేస్తున్నదని మండిపడ్డారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కోదండరాంను జేఏసీ చైర్మన్‌గా నిలబెట్టింది అప్పట్లో ఉద్యమపార్టీగా ఉన్న టీఆర్ఎస్ అని ఆయన గుర్తుచేశారు. కోదండరాం ఉంటే ప్రజలు సమీకృతులవుతారనే స్వార్థంతో కాంగ్రెస్ ఆయనను వాడుకుంటున్నదని, ఈ భ్రమలు తొలిగిపోక తప్పదని అన్నారు.

మొక్కల పెంపకంలో తెలంగాణ అగ్రగామి

అడవుల విస్తీర్ణంలో దేశంలోనే తెలంగాణ ముందువరుసలో నిలిచిందని వేణుగోపాలాచారి పేర్కొన్నారు. 2014 జూన్ నుంచి 2016 డిసెంబర్ వరకు రికార్డుస్థాయిలో 54.97 కోట్ల మొక్కలను నాటామని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2017 జూన్ నుంచి ఇప్పటివరకు 20 కోట్లవరకు మొక్కలు నాటి తెలంగాణ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నదని వివరించారు. దేశసగటులో పోలిస్తే మనరాష్ట్రం 27.52 శాతం వృద్ధిని సాధించి మొదటిస్థానంలో నిలిచిందని, అడవుల పరిరక్షణలోనూ 26 శాతం వృద్ధి ఉన్నదన్నారు.

పలు జిల్లాల్లో వానలు

మొదటిపేజీ తరువాయి...

నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు దామరగిద్దలో అత్యధికంగా ఏడు సెంటీమీటర్ల వర్షం కురిసినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో సగటున 15.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సగటున 19.3 సెంటీ మీటర్ల వాన పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా సగటు 13.98మి.మీ. కాగా, వనపర్తి జిల్లాలో సగటున 8.3మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లాలోని 17 మండలాల్లో వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. సగటున 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

పెసర్లను సెప్టెంబర్ 1 నుంచే కొనాలి

మొదటిపేజీ తరువాయి...

నోడల్ ఏజెన్సీ అక్టోబర్ 1 నుంచి రూ.5,225 చొప్పున కొనుగోలు చేసింది. ఇందువల్ల రైతులు నష్టపోయారని హరీశ్‌రావు వివరించారు. ఈ విషయాన్ని ఇప్పటికే వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి లేఖ ద్వారా కేంద్రానికి తెలియజేశామని గుర్తు చేశారు. కాబట్టి ఈ సమస్యను ప్రత్యేక కేసు కింద గుర్తించి 2017-18 వానకాలంలో సెంట్రల్ ఏజెన్సీ కొనుగోళ్లను సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభించాలని, క్వింటాలుకు రూ.5,575 చొప్పున కనీస మద్దతు ధర ఇవ్వాలని ఆయన కోరారు.

కుట్రలను సహించం

- స్థానికత ఆధారంగానే ఉద్యోగుల విభజన జరుగాలి
- కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
- విద్యుత్ ఉద్యోగుల మహా నిరాహారదీక్షలో దేవీప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్



మంగళవారం తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల మహా నిరాహార దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ఎన్జీవో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవీప్రసాద్. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వంపై కుట్రలు చేస్తే సహించేది లేదని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగుల విభజన సక్రమంగా జరిగేందుకు మరో పోరాటం చేయాల్సిన పరిస్థితిని కేంద్ర, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్నాయని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ఎన్జీవో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవీప్రసాద్ చెప్పారు. స్థానికత ఆధారంగానే ఉద్యోగుల విభజన జరుగాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ సంస్థలో సీమాంధ్ర ఉద్యోగుల ఆధిపత్యాన్ని కొనసాగించడానికి జరుగుతున్న వరుస కుట్రలకు వ్యతిరేకంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు టీఎస్ఎస్పీడీసీఎల్‌లో మంగళవారం మహా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ ఇంజినీర్లకు దేవీప్రసాద్ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చినట్టే ఇచ్చి విద్యుత్ మేనేజ్‌మెంట్ అధికారులు వారిని తొలగించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తే అడ్డుకున్నారని పేర్కొన్నారు. విద్యుత్ శాఖలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన 1200 మంది ఉద్యోగులను రిలీవ్ చేస్తే, రాష్ట్రంలోని ప్రాజెక్టులను నిలిపివేసే కుట్రలో భాగంగా మేనేజ్‌మెంట్ వారిని తిరిగి తీసుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ప్రవర్తిస్తే సహించేదిలేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. ప్రభుత్వం ప్రమోషన్లు ఇస్తుంది కానీ డిమోషన్లు ఇవ్వదని చెప్పారు. ఉద్యోగుల విభజనలో కేంద్రం, ఏపీ ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయన్నారు. తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఆంధ్ర ప్రాంత ఉద్యోగులు వెళ్లిపోవాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఉద్యోగుల విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను నిబంధనల ప్రకారమే రిలీవ్ చేశారని కానీ మళ్లీ డిప్యుటేషన్‌పై ఇక్కడకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా తిష్ట వేశారని తెలంగాణ ఉద్యోగుల ఇంజినీర్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ తెలిపారు. ఏపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం చూస్తే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తుందని తెలుస్తున్నదని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్య చెప్పారు. మంగళవారం నుంచి సెప్టెంబర్ 12వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని సబ్‌స్టేషన్లు, కార్యాలయాల వద్ద నిరాహార దీక్షలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమస్య పరిష్కారం కాకుంటే వచ్చేనెల 13న ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. తెలంగాణ ఇంజినీర్ జేఏసీ చైర్మన్ వెంకటేశం, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ సంఘం ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సుభద్ర, వాణి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, అడ్వయిజర్ జానయ్య, విద్యుత్ అకౌంట్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, అడ్వయిజర్ వీరస్వామి, తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జనరల్ సెక్రటరీ క్రాంతి, పీఅండ్‌జీ అసోసియేషన్ అధ్యక్షుడు గణేశ్, జనరల్ సెక్రటరీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ కండ్లు ఆరని దీపాలు!

మొదటిపేజీ తరువాయి...


సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలు
ఇక్కారెడ్డిగూడ

ఉన్నారు. కులం లేదు.. మతం లేదు. చనిపోయిన తర్వాత కండ్లు దానం చేస్తామంటూ మూడు బస్సుల్లో 2010 సెప్టెంబర్ ఏడో తేదీన నగరంలోని సరోజినీదేవి హాస్పిటల్‌కు వెళ్లారు. వారి ఆదర్శానికి, చైతన్యదీప్తికి ముగ్ధులైపోయిన వైద్యులు.. వారికి నేత్రదాన పత్రాలు అందించి.. సంతకాలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఈ ఏడేండ్లలో చనిపోయిన 19 మంది తమ కండ్లను దానంచేశారు. 38 మంది అంధులకు వెలుగును ప్రసాదించారు! రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ఆ ఊరి పేరు.. దేవుని ఎర్రవల్లి! ఆ పల్లె నింపిన స్ఫూర్తి.. అదే మండలంలోని ఇక్కారెడ్డిగూడ, షాబాద్ మండలం ఎర్రోనిగూడ ప్రజలకు మార్గదర్శకంగా నిలిచింది. ప్రభుత్వం సెప్టెంబర్ 8వతేదీ వరకూ నేతదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ మూడు గ్రామాల స్ఫూర్తిని పరిచయం చేసే కథనం ఇది!!

ఇలా మొదలైంది..

దేవుని ఎర్రవల్లిలో నలుగురు యువకులకు ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు. అప్పుడు సర్పంచ్‌గా ఉన్న ఎస్ సత్యనారాయణరెడ్డి, ప్రస్తుత సర్పంచ్ కంకటి శ్యామలయ్య తదితరులు కలిసి.. నేత్రదానం మహాదానం అంటూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. వృథాగా మట్టిలో కలిసే భౌతిక కాయం నుంచి రెండు కండ్లను దానంచేయడం ద్వారా ఇద్దరికి చూపును ఇవ్వొచ్చునన్న సదాశయం అందరికీ నచ్చింది. చనిపోయిన తర్వాత వెంటనే సమాచారం ఇస్తే డాక్టర్లు ఇంటికే వచ్చి కండ్లు తీసుకెళ్లిపోయే వ్యవస్థ ఉంటుందని నచ్చజెప్పడంతో ఊరంతా ముందుకొచ్చింది. ఎల్లయ్య అనే వ్యక్తి మరణంతో మొదలైన నేత్రదానం.. కొనసాగుతూనే ఉన్నది. ఎర్రవల్లి స్ఫూర్తిని ఇక్కారెడ్డిగూడలోని వివేకానంద యువజన సంఘం అందుకున్నది. అధ్యక్షుడు గణపతి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి.. ఊరంతటినీ ఏకం చేశారు. రెండేండ్లకాలంలో ఆరుగురు చనిపోతే.. వారి బంధువులు సహకరించి.. 12 మందికి చూపునిచ్చారు. షాబాద్ మండలం ఎర్రోనిగూడ ప్రజలు కూడా ఇదే స్ఫూర్తిని అందుకున్నారు. ఇప్పుడిప్పుడే మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామస్థులు అదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ గ్రామంలో 25% మంది అంగీకారపత్రాలు ఇచ్చారు.

చనిపోతూ ఇద్దరికి చూపునిద్దాం



ఎర్రవల్లి స్ఫూర్తి నింపింది. చేవెళ్లకు చెందిన పర్యావరణవేత్త రామకృష్ణారావు ఆదర్శం మా అందరిలో మార్పుతెచ్చింది. చనిపోయిన తర్వాత ఇద్దరికి చూపునిచ్చే మంచి కార్యానికి అందరూ ముందుకొచ్చారు. మా ఊళ్లో ఉన్న 498 మంది అంగీకారపత్రాలు ఇచ్చారు. కరెంటు షాక్‌తో చనిపోయిన 30 ఏండ్ల యువకుడి నేత్రదానంతో కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. నాలుగేండ్ల చిన్నారి కూడా తాను చనిపోతూ ఇద్దరికి చూపునిచ్చింది. 95 ఏండ్ల వృద్ధుడు చనిపోతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపారు.

– గణపతి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, వివేకానంద యువజన సంఘం

అవయవాలు దానం చేయాలని మా నాయిన కోరిండు



మా నాయిన చనిపోతూ అవయవాలు దానంచేయాలని కోరిండు. పెద్దగా చదువుకోకపోయినా నలుగురికి ఉపయోగపడాలన్న ఆయన కోరికమేరకు కండ్లు దానంచేసినం. మా ఊరోళ్లందరినీ కలెక్టర్ మెచ్చుకున్నడు. అంతకంటే ఏం కావాలి?

– అంగరెల్లి లింగయ్య

అవయవదానంపై కూడా ప్రచారం చేస్తాం



మా ఊరి ప్రజలంతా కండ్లు దానంచేసేలా ప్రోత్సహించినం. ఇప్పుడు అవయవదానంపైనా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రయత్నిస్తున్నాం. చనిపోయిన తర్వాత భూమిలో కలిసిపోయే దేహం మరొకరికి ఉపయోగపడేందుకు అందరూ ముందుకురావాలి.

– కంకటి శ్యామలయ్య, సర్పంచ్, దేవుని ఎర్రవల్లి

అంధుల వివరాలు



7 లక్షలు – రాష్ట్రంలో అంధుల సంఖ్య

40 వేల మంది – నేత్రదానంతో కంటి చూపు వచ్చే అవకాశమున్న వారు

40 వేలు (అవసరం లక్ష) – దేశంలో ఏటా కండ్ల సేకరణ

20 వేల మంది – ఐదేండ్లలో నేత్రదాన అంగీకార పత్రాలు ఇచ్చినవారి సంఖ్య

ఇలా చేద్దాం!

నేత్రదానానికి మద్దతివ్వాలి. దురదృష్టవశాత్తు ఎవరైనా మరణిస్తే వెంటనే నేత్ర బ్యాంక్‌కు ఫోన్ చేయండి. మరణించిన 6 నుంచి 8 గంటల్లోపు నేత్రాలను తీయాల్సి ఉంటుంది. మీ దగ్గరి బంధు మిత్రులను నేత్రదానానికి ఒప్పించండి. మరిన్ని వివరాలకు 040-23545454, 235445604 నంబర్లలో సంప్రదించండి.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ సారథ్యంలో బుధవారం అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సెప్టెంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేపడుతామని ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి చెప్పారు. దీనికి తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, టీయూటీఎఫ్ నాయకులు స్వామిరెడ్డి, మల్లారెడ్డి, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ మద్దతు తెలిపారు. సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెడుతున్నారని రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. మంగళవారం నాంపల్లి గృహకల్ప ఆవరణ నుంచి హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ప్రారంభించారు.

నల్సార్‌లో 3 నుంచి అంతర్జాతీయ న్యాయసంస్థ సమావేశాలు

శామీర్‌పేట: సెప్టెంబర్ 3 నుంచి 10వరకు జాతీయ, అంతర్జాతీయ న్యాయశాస్త్ర నిపుణుల సదస్సు హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో జరుగనున్నది. దేశంలో మొదటిసారి జరిగే అంతర్జాతీయ న్యాయసంస్థ 78వ సమావేశాలకు హైదరాబాద్ వేదిక కావడం విశేషం. సదస్సు వివరాలను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. ప్రపంచస్థాయిలో అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో లోతైన అవగాహన కలిగిన దాదాపు 60 దేశాలకు చెందిన నిపుణుల చర్చలకు నల్సార్ వేదిక కానుందని ఆయన పేర్కొన్నారు.

టెరిటోరియల్ ఆర్మీలో ఉద్యోగాలు

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: టెరిటోరియల్ ఆర్మీలో సోల్జర్ ఉద్యోగాలు భర్తీచేయనున్నట్టు రక్షణశాఖ ప్రజాసంబంధాల విభాగం తెలిపింది. సెప్టెంబర్ 21 నుంచి 28 వరకు దేశంలోని పలురాష్ట్రాల్లో సోల్జర్ (జనరల్ డ్యూటీ), సోల్జర్(హౌస్ కీపర్) ఉద్యోగాల కోసం ఎంపికలు జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. తెలంగాణ, ఏపీలలో సెప్టెంబర్ 22న శారీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించింది.

ఇంటర్‌లో ప్రైవేటు విద్యార్థులకు అటెండెన్స్ మినహాయింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందకుండా ప్రైవేటుగా ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించే పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇస్తూ ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ నిర్ణయం తీసుకున్నారు. అటెండెన్స్ మినహాయింపు కోరుతూ దరఖాస్తు (రిజిస్ట్రేషన్) చేసుకోవడానికి సెప్టెంబర్ 30 వరకు గడువు విధించామని ఆయన తెలిపారు.పూర్తి వివరాల కోసం tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

హరిత లక్ష్యం చేరిన పోలీస్‌శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరిత హారంలో తమ శాఖకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నట్టు రైల్వే, రోడ్డు భద్రత డీజీ, పోలీస్‌శాఖ హరితహారం కార్యక్రమ అధ్యక్షుడు టీ కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారానికి మొత్తం కోటి మొక్కలు నాటే లక్ష్యాన్ని అధిగమించినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ కార్యాలయాలు, శిక్షణ కేంద్రాల్లో కోటి 22 వేల 45 మొక్కలు నాటినట్టు ఆయన వివరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా 30 లక్షలు, రామగుండం కమిషనరేట్ పరిధిలో 18 లక్షలు, ఖమ్మం జిల్లాలో 11 లక్షల మొక్కలు నాటినట్టు ఆయన పేర్కొన్నారు.

వ్యాట్‌తో సమానంగానే జీఎస్టీ రాబడి!

జూలైలో రాష్ట్రానికి రూ.3000 కోట్లకు పైనే ఆదాయం • అధికారుల అంచనా

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: విలువ ఆధారిత పన్ను(వ్యాట్) రాబడికి, వస్తుసేవల పన్ను(జీఎస్టీ) విధానం అమలులోకి వచ్చిన తర్వాత సమకూరే రాబడి ఇంచుమించు సమానంగానే ఉండేట్లుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం జీఎస్టీ వల్ల మొదటి నెల ఆదాయంలో నష్టంలేదు. పెద్దగా పెరిగిందీ లేదు. జీఎస్టీ ద్వారా రాష్ట్ర ఖజానాకు జూలైలో వచ్చిన రాబడి రూ.3000 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. వ్యాట్ అమలులో ఉన్నపుడు వాణిజ్యపన్నుల రూపంలో రాష్ట్ర ఖజానాకు ప్రతీనెల రూ. 2800 నుంచి 3 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చేది. వ్యాట్ అమలులో ఉన్న చివరి నెల ఈ ఏడాది జూన్‌లో వాణిజ్యపన్నుల ద్వారా దాదాపు రూ.3,500 కోట్ల రాబడి వచ్చింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత జూలైలో రాష్ట్రంలో 33 వేల మంది జీఎస్టీ రిజిస్టర్డ్ డీలర్లు పన్ను చెల్లించారు. వారంతా తాము చెల్లించాల్సిన మొత్తంలో 90 శాతం చెల్లించినట్లు రెవెన్యూశాఖ (వాణిజ్యపన్నులు, ఆబ్కారీ) ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. వ్యాట్ పరిధిలో 2 .16 లక్షల మంది డీలర్లు, ట్రేడర్లు ఉండగా వారిలో 1.97 లక్షల మంది జీఎస్టీలోకి మారారని ఆయన చెప్పారు. మిగతా వారిలో జీఎస్టీ పరిధిలోకి రానివారు ఎక్కువగా ఉండవచ్చునన్నారు. జీఎస్టీలో కొత్తగా 53,600 డీలర్లు నమోదయ్యారని తెలిపారు. స్టేట్ జీఎస్టీ చట్టంలో పన్ను చెల్లింపుల ద్వారా జూలై నెలలో రూ.807 కోట్ల రాబడి వచ్చింది. జీఎస్టీ పరిధిలో లేని పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ద్వారా రూ.682 కోట్లు, మద్యం అమ్మకాల ద్వారా రూ.460 కోట్లు రాష్ట్ర ఖజానాకు వచ్చాయి. మిగతా పన్నుల ద్వారా రూ.135 కోట్లు సమకూరాయి. ఇక సెంట్రల్ జీఎస్టీ ఖాతాలోరూ. 518 కోట్లు వసూలైనా ఆ మొత్తం కేంద్రానికి వెళుతుంది. ఇక ఇంటర్ స్టేట్ జీఎస్టీ (ఐజీఎస్టీ) ద్వారా మరో రూ.900 నుంచి 1000 కోట్ల వరకు రావచ్చని అధికారులు అంచనా వేశారు. ఒక రాష్ట్రంలో ఉత్పత్తయిన వస్తువులు మన రాష్ట్రంలో అమ్ముడు పోతే దానిపై వచ్చే పన్నును ఐజీఎస్టీ అంటారు. దీనిపై ఇంకా కచ్చితమైన లెక్కలు లేకున్నా వేయికోట్లకు పైగా రాబడి ఉంటుందని సోమేశ్‌కుమార్ వివరించారు.

పెసర్ల కొనుగోలుకు నోడల్ ఏజెన్సీ నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కనీస మద్దతు ధర పథకం కింద 2017-18 వానాకాలం సీజన్‌లో పెసర్ల కొనుగోలుకు తెలంగాణ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నియమించింది. దీంతో పాటు రైతుల నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే పెసర్లకు మార్కెట్ ఫీజును మినహాయింపు ఇస్తూ మార్కెటింగ్‌శాఖ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారధి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కోల్డ్ స్టోరేజీల పర్యవేక్షణకు కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద ఏర్పాటుచేసిన కోల్డ్ స్టోరేజీల నిర్వహణ, పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ కమిటీ చైర్మన్‌గా.. జిల్లా ఉద్యానశాఖ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, లీడ్ జిల్లా మేనేజర్, జిల్లా సివిల్ సప్లై అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ కోల్డ్ స్టోరేజీల నిర్వహణలో ప్రమాణాలు పాటించడం, వాటిలో ఉన్న నిల్వలు, నాణ్యత, మిషనరీ పనితీరు, ఉష్ణోగ్రత, క్రయవిక్రయాలు, ఉత్పత్తుల నిల్వలు, ఎయిర్ వెంటిలేషన్ వంటి అంశాలను పర్యవేక్షించనున్నది. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి ఉత్తర్వులు జారీచేశారు.


మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ పార్క్‌హయత్‌లో ఎంపీ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాజ్యసభ కమిటీ

రాష్ట్రంలో నకిలీనోట్ల ప్రభావం లేదు

రాజ్యసభ కమిటీకి స్పష్టంచేసిన పోలీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెద్దనోట్ల రద్దు తర్వాత రాష్ట్రంలో నకిలీనోట్ల ప్రభావం నామమాత్రంగానే ఉందని డీజీపీ అనురాగ్‌శర్మ రాజ్యసభ కమిటీకి తెలిపారు. రాజ్యసభ కమిటీ ఆన్ సబార్డినేట్ లెజిస్లేషన్ మంగళవారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో రాష్ట్ర పోలీసు అధికారులతో సమావేశమయ్యింది. నోట్లరద్దు తర్వాత ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను ఎంపీ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం చేస్తున్నది. నకిలీ నోట్ల చలామణి ముఠాల కదలికలు, నమోదైన కేసుల వివరాల గురించి కమిటీ సభ్యులు అడుగగా.. రాష్ట్రంలో పెద్ద ప్రభావం పెద్దగా లేదని, కేవలం 23 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి, అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఒమన్ నుంచి హైదరాబాద్‌కు వలస కార్మికులు



- మస్కట్ చిరు మెగా యూత్ ఫోర్స్ సహాయం
- తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ చొరవ

ఒమన్ నుంచి స్వదేశానికి చేరిన వలస కార్మికులకు స్వాగతం పలికిన తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్, ప్రొటోకాల్ అధికారులు

శంషాబాద్: బతుకుదెరువు కోసం గల్ఫ్‌దేశాలకు వలస వెళ్లి జీతభత్యాలు లేక దీనావస్థలో రోడ్డున పడిన పలువురి సహాయ సహకారంతో స్వదేశానికి చేరుకుంటున్నారు. తెలంగాణ గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి ఇండియన్ ఎంబసి ద్వారా కార్మికులు స్వదేశానికి వచ్చేందుకు ఉచితంగా టికెట్లను అందజేయగా, మస్కట్‌లోని చిరు మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధులు రాందాస్, పోల్చాని లింగయ్య కార్మికుల చేతిఖర్చులకు ఆర్థికసాయం చేశారు. దీంతో మూడు, నాలుగురోజుల నుంచి సుమారు 50 మంది వలస కార్మికులు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు వచ్చారు. మంగళవారం తెలంగాణలోని జగిత్యాల మండలం కొమ్మ్యాలకు చెందిన వెంకటేశ్వర్లు, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం పెంట్రాజుపల్లికి చెందిన చిన్నయ్యతోపాటు పలువురు వచ్చారు. ఒమన్‌లో రోడ్డునపడిన కార్మికుల్లో తెలుగువారు సుమారు 200 మంది ఉన్నారని గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగి దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఒమన్‌లో ఓ కంపెనీ మూతపడటంతో కార్మికులు రోడ్డునపడ్డారని పేర్కొన్నారు.


భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు పనులపై మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి సమీక్ష నిర్వహించిన మంత్రి హరీశ్‌రావు

సీతారామ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెంచాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులు, పంపుహౌజ్‌లు, కాల్వల నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాల ఆయన మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి సమీక్షించారు. పనులు మందకొడిగా సాగుతుండటంపట్ల మంత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. 15 రోజుల్లో మరోసారి ప్రాజెక్టుపై సమీక్షిస్తామని తెలిపారు. మొత్తం ఎనిమిది ప్యాకేజీల్లో ప్రస్తుతం మూడు ప్యాకేజీల పనులను ప్రారంభించినట్టు అధికారులు తెలుపగా.. మిగతా ఐదు ప్యాకేజీల పనులకు సంబంధించి వెంటనే కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకొని, పనులు ప్రారంభించాలని హరీశ్ ఆదేశించారు. అటవీ భూముల సేకరణ కోసం డీజీపీఎస్ సర్వేను పదిరోజుల్లో పూర్తిచేసి, వెంటనే పరిహారం చెల్లించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి మంత్రి హరీశ్‌రావు సూచించారు. అటవీ, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకొని పర్యావరణ, అటవీ అనుమతులను తక్షణమే పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించాలని అటవీ, పర్యావరణ అనుమతుల సలహాదారు సుధాకర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ రాజీవ్‌హనుమంతు, నీటిపారుదలశాఖ ఈఎన్సీలు మురళీధర్, నాగేందర్‌రావు, సీఈ సుధాకర్ పాల్గొన్నారు.

డిసెంబర్‌కల్లా ఉదయసముద్రం

నల్లగొండ జిల్లాలోని ఉదయసముద్రం ప్రాజెక్టును ఈ డిసెంబర్‌కల్లా పూర్తిచేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. 24 గంటలు పనిచేసైనా పనులు పూర్తిచేయాలని సూచించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఆయన సమీక్షించారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఈఎన్సీలు మురళీధర్, నాగేందర్‌రావు (పరిపాలన), సీడీవో చీఫ్ ఇంజినీర్ నరేందర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ఎస్ సునీల్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్షన్ బంగ్లాలు త్వరగా నిర్మించండి

ఇన్‌స్పెక్షన్ బంగ్లాల (ఐబీ) నిర్మాణంలో జాప్యంపై రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. 16 చోట్ల ఐబీలు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతించిందని, వీటి నిర్మాణానికి రూ.36.20 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. నిధులు విడుదలైనందున వెంటనే పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

కాళేశ్వరం కేసు 6కు వాయిదా

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వెంటనే నిలిపివేయాలని దాఖలైన పిటిషన్ వాదనతో ఏకీభవించిన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సమగ్ర ప్రాజెక్టు నివేదికతో సహా పూర్తివివరాలను సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చింది. వచ్చేనెల ఆరో తేదీకి విచారణ వాయిదా వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించిన ధర్మాసనం.. ఆ లోపు రీజాయిండర్‌ను దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో తాగునీరు చాలా కీలకమైనదని తెలంగాణ తరపున హాజరైన మాధవీ దివాన్ వాదించారు.

కేంద్రమంత్రితో జాతీయ ఎంబీసీ సంఘం భేటీ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఓబీసీ కులాలను జాతీయస్థాయిలో ఉప వర్గీకరణ చేసి రిజర్వేషన్ల ఫలాలను అందించడానికి గతనెల కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై తెలంగాణకు చెందిన జాతీయ ఎంబీసీ సంఘం ప్రతినిధులు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ఎంబీసీ సంఘం ఉపాధ్యక్షుడు నేతికార్ ప్రేమ్‌లాల్, ప్రధాన కార్యదర్శి సంగెం సూర్యారావు, తెలంగాణ యువజన విభాగం అధ్యక్షుడు పాండు వంశరాజ్ తదితరులు కేంద్ర మంత్రిని మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ప్రతినిధి బృందంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రతినిధి పల్లె రవి కూడా ఉన్నారు.

కాలంచెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి!

- 1500 కొత్త బస్సుల కొనుగోలు
- ఆర్టీసీ సమీక్షలో మంత్రి మహేందర్‌రెడ్డి


టీఎస్‌ఆర్టీసీ పనితీరుపై సమీక్షిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదిహేను వందల కొత్త బస్సులను కొనుగోలుచేసి కాలంచెల్లిన వాటి స్థానంలో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు నివేదించనున్నట్టు పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం టీఎస్‌ఆర్టీసీ పనితీరుపై చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణారావు, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ తదితరులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రీజియన్లు, సర్వీసు వారీగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రాబడులు, నష్టాల వివరాలపై చర్చించారు. 96 డిపోల పరిధిలో వస్తున్న 480 కోట్ల నష్టాన్ని అధిగమించి.. సంస్థను లాభాలబాటలో నడిపించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆర్టీసీకి రూ. 2వేల కోట్లు అందించారని, దీంతో ప్రస్తుతం సంస్థ పరిస్థితి మెరుగుపడిందని మహేందర్‌రెడ్డి చెప్పారు. త్వరలో కరీంనగర్, రామగుండంలకు వజ్ర సర్వీసులు నడిపిస్తామని చెప్పారు. సమావేశంలో ఈడీలు రవీందర్, వేణు, స్వర్ణాశంకరన్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ భవన్ విభజనకు రాష్ట్ర కమిటీలు

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: ఢిల్లీలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భవన్ విభజనకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం మొదటి చర్యగా కేంద్ర హోం మంత్రిత్వశాఖ జనవరిలో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు వేర్వేరుగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసుకున్నాయి. ఢిల్లీభవన్‌లో ఉన్న రెసిడెంట్ కమిషనర్ల నేతృత్వంలో ఈ కమిటీలు ఆయా రాష్ట్రాల తరపున పనిచేస్తాయి. తెలంగాణ కమిటీ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ నేతృత్వంలో పనిచేస్తుంది. ఈ కమిటీలో రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, ఎస్ఆర్ కమిటీలో ఉన్న ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఇంజినీర్ పూర్ణచంద్రరావు సభ్యులుగా ఉం టారు. ఏపీ కమిటీలో రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ చైర్మన్‌గా, జీఏడీ ముఖ్యకార్యదర్శి శ్రీకాంత్, ఎస్ఆర్ కమిటీ అధికారిగా ఉన్న కార్యదర్శి ప్రేమ్‌చంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ ఇంజినీర్ శ్రీహరి నాయక్ సభ్యులుగా ఉంటారు. తెలంగాణ కమిటీ తొలుత సమావేశమై ఢిల్లీలోని ఉమ్మడి భవన్‌కు చెందిన మొత్తం విస్తీర్ణం, ఆ ప్రాంగణంలోని భవనాలు, వాటి వినియోగం, అతిథి గృహాలు, ముఖ్యమంత్రి బంగళా, రెసిడెంట్ కమిషనర్ బంగళా, రెండు రాష్ట్రాలూ ఉమ్మడిగా వినియోగించుకుంటున్న ఆడిటోరియం, సమావేశమందిరం, సిబ్బంది నివాస గృహాలు, ఖాళీగా ఉన్న స్థల తదితర అన్ని అంశాలను పరిశీలిస్తుంది. నిజాం కాలంలో నిర్మాణమైన హైదరాబాద్ హౌస్‌కు బదులుగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్థలం, ఉమ్మడి భవన్ పేరుమీద ఉన్న స్థలం, దాని ప్రస్తుత మార్కెట్ విలువవంటి అంశాలను కమిటీ అధ్యయనం చేస్తుంది.

విశ్వవేదికపై మెరిసిన గీతం విద్యార్థులు


వర్సిటీ వీసీ శివప్రసాద్‌కు తమ గిన్నిస్ పత్రాన్ని చూపుతున్న విద్యార్థిని శివాలి, ఆమె తల్లి కవిత

హైదరాబాద్: హైదరాబాద్‌లోని గీతం విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాల్లోనూ విశ్వవేదికపై జయకేతనాలు ఎగురవేస్తున్నారని వర్సిటీ ప్రో వీసీ ప్రొఫెసర్ ఎన్ శివప్రసాద్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శివాలి తన తల్లి కవితతో కలిసి రంగురంగుల కాగితాలతో 7,011 పూలను అల్లి రెండో గిన్నిస్ రికార్డు సాధించారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థిని మానస జొన్నలగడ్డ 'మిస్ ఇండియా ఏసియా పసిఫిక్-2017' టైటిల్ గెలుచుకున్నారని వెల్లడించారు.

సెన్సెక్స్	నిఫ్టీ
31,388	9,796
↓ 362	↓ 117

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,915
22 క్యారెట్లు	29,765
వెండి (కిలో)	40,030

ముడి చమురు (బ్రెంట్)

↓ 51.71

చక్కెర నిల్వలపై పరిమితులు



న్యూఢిల్లీ, ఆగస్టు 29: పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండు నెలల్లో చక్కెర ధరలను నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చక్కెర నిల్వలపై పరిమితులు విధించినట్లు కేంద్ర ఆహార శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ తెలిపారు. చక్కెర ఉత్పత్తిలో రెండో అతిపెద్ద దేశమైన భారత్‌లో 2016-17 సీజన్‌లో ఉత్పత్తి 2.1 కోట్ల టన్నులకు తగ్గనున్నదని అంచనా. అంతక్రితం ఏడాది 2.5 కోట్ల టన్నుల చక్కెర ఉత్పత్తి అయింది. ప్రతియేట భారత్‌లో చక్కెరకు డిమాండ్ 2.4-2.5 కోట్ల టన్నుల స్థాయిలో ఉంటుంది. ధరలను నియంత్రించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో చక్కెర నిల్వలపై పరిమితులు విధించినట్లు ట్విట్టర్ ద్వారా పాశ్వాన్ వెల్లడించారు. 2016-17 మార్కెటింగ్ సంవత్సరం(అక్టోబర్-సెప్టెంబర్ మధ్యకాలం)లో పంచదార మిల్లులు తాము ఉత్పత్తి చేసిన చక్కెరలో సెప్టెంబర్‌లో 21 శాతంకు మించి నిల్వ ఉంచరాదని, అలాగే అక్టోబర్ విషయానికి వస్తే 8 శాతం మించి ఉంచరాదని ఆయన వెల్లడించారు. పండుగ సీజన్‌లో మిల్లు యజమానులు మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో నిల్వలపై పరిమితులు విధించినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో కిలో చక్కెర ధర రూ.40 స్థాయిలో ఉండగా, బ్రాండెడ్ ధర రూ.50 స్థాయిలో ఉంది. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న చౌక ధర కలిగిన చక్కెరను నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గత నెలలో దిగుమతి సుంకాన్ని 40 శాతం నుంచి 50 శాతానికి పెంచింది.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.17	67.45
ఆస్ట్రేలియా డాలర్	46.09	53.33
బహ్రెయిన్ దినార్	157.33	180.53
యూరో	69.61	80.74
జపాన్ యెన్/100	53.46	62.00
కువైట్ దినార్	175.09	218.04
ఒమన్ రియాల్	154.07	176.50
సౌదీ రియాల్	15.41	18.34
సింగపూర్ డాలర్	42.93	50.86
స్టెర్లింగ్ పౌండ్	75.27	87.28
యూఏఈ దిర్హామ్	15.80	18.51

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్‌ఎల్‌ఎఫ్‌ఏ
హైదరాబాద్	355-00	355-00
రంగారెడ్డి	355-00	355-00
మెదక్	355-00	355-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారం ధర	84.00
రిటైల్ లైవ్	99.00
డ్రెస్డ్	139.00
స్కిన్‌లెస్	163.00

మార్చికల్లా హైదరాబాద్ స్టోర్ సిద్ధం

- రూ.1,000 కోట్ల పెట్టుబడి..
- 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు
- ఐకియా భారత డిప్యూటీ మేనేజర్ ప్యాట్రిక్



ప్యాట్రిక్ ఆంటోని



హైదరాబాద్ స్టోర్ నమూనా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వీడన్‌కు చెందిన ప్రసిద్ధ గృహోపకరణాల సంస్థ ఐకియా.. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ఫర్నీచర్ షోరూం వచ్చే ఏడాది మార్చి వరకు అందుబాటులోకి రానున్నది. రూ.1,000 కోట్ల పెట్టుబడితో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైటెక్ సిటీ దగ్గర్లో నిర్మిస్తున్న ఈ భవన సముదాయాన్ని ప్రపంచ స్థాయి సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నట్లు ఐకియా భారత డిప్యూటీ మేనేజర్ ప్యాట్రిక్ ఆంటోని తెలిపారు. సుమారు పది వేల రకాల ఫర్నీచర్ ఇక్కడ అందుబాటులో ఉండనున్నట్లు, వీటిలో భారత్‌లో ఎక్కువగా వినియోగించే 800 రకాల ఫర్నీచర్ ప్రత్యేకంగా ఆకట్టుకోనున్నాయని తెలిపారు. ఈ స్టోర్‌ను ఏర్పాటు చేయడంతో 1200 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వచ్చే మూడు నెలల్లో 800 మంది సిబ్బంది నియామకాలు పూర్తి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత్‌లో వ్యాపారాన్ని విస్తరించడానికి రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించిన సంస్థ అందుకు తగ్గట్టుగానే చర్యలను ఆరంభించినట్లు ఆయన చెప్పారు. 2025 నాటికి దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. దీంట్లోభాగంగానే నగరంలో నిర్మిస్తున్న మొదటి స్టోర్ నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని, ఎక్కడా రాజీపడకుండా వేగంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఫర్నీచర్‌కు కావల్సిన ముడి పదార్థం (కలప) సరఫరా సవాల్‌తో కూడుకున్న విషయమని, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ర్టాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా ముంబై, బెంగళూరులలో ఏర్పాటు చేయతలపెట్టిన స్టోర్లకు సంబంధించి భూ సేకరణ పూర్తైందని, అలాగే ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె, అహ్మదాబాద్, సూరత్, కోల్‌కతాలలో నూతనంగా స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ భవనంలోనే వెయ్యి మంది కూర్చునేందుకు వీలుగా ఉండే రెస్టారెంట్‌ను సైతం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జీఎస్టీతో ఇన్వెస్టర్లకు సానుకూల అంశమని, ప్రతికూల ప్రభావం ఉండే అవకాశం చాలా తక్కువని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ గవర్నెన్స్ గురించే ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 29: గత బోర్డు అనుసరించిన అల్పమైన కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలపైనే ఆందోళన వ్యక్తం చేశానే తప్ప వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్‌ఆర్ నారాయణమూర్తి అన్నారు. కంపెనీ కొత్త చైర్మన్‌గా నీలేకని నియమితులు కావడం ఇన్ఫోసిస్‌కు మేలు చేయనుందని, ఆయన మెరుగైన కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాల కోసం పోరాడేవ్యక్తి అని మూర్తి పేర్కొన్నారు. నీలేకని నాయకత్వంలో ఇన్ఫోసిస్ కార్పొరేట్ గవర్నెన్స్ విధానం ప్రపంచంలోని అత్యుత్తమ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండనుందని, కాబట్టి ఇన్వెస్టర్లంతా హాయిగా నిద్రపోవచ్చని మూర్తి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆర్ శేషసాయితోపాటు ఇతరుల రాజీనామాతో బోర్డు పునరుజ్జీవ ప్రక్రియ ఇప్పటికే మొదలైందని, అయినప్పటికీ ఇంకెంతో చేయాల్సి ఉందని మంగళవారం సాయంత్రం ఇన్వెస్టర్లతో జరిగిన సమావేశంలో అన్నారు. సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయని ఏడాది కాలంగా ఇన్ఫోసిస్ బోర్డుపై మూర్తి అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. విశాల్ సిక్కా పారితోషికాన్ని భారీగా పెంచడంతోపాటు మాజీ సీఎఫ్‌వో రాజీవ్ బన్సల్‌కు రాజీనామా సమయంలో భారీ పరిహార ప్యాకేజీ చెల్లించడాన్ని మూర్తి తప్పుబట్టారు. ఇన్వెస్టర్లతో జరిగిన సమావేశంలో ఇదే విషయంపై అడుగుగా.. బన్సాల్ పరిహార ప్యాకేజీ గురించి తాను ప్రశ్నించినప్పుడు శేషశాయి పరస్పర విరుద్ధమైన సమాధానాలిచ్చారని అన్నారు.

వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదు: మూర్తి



పనయా డీల్‌లో అక్రమాలు జరిగాయని విజిల్ బ్లోయర్ ఒకరు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ఫిర్యాదు చేశారు. దాంతో సంస్థ అంతర్జాతీయ న్యాయ, ఆడిటింగ్ సంస్థలతో థర్డ్‌పార్టీ ఫోరెన్సిక్ ఆడిటింగ్ జరిపించింది. పనయా డీల్‌లో ఎలాంటి అక్రమాలు జరుగలేదని దర్యాప్తు ఏజెన్సీలు సంస్థకు క్లీన్ చిట్ ఇచ్చాయని ఇన్ఫీబోర్డు ప్రకటించింది. కానీ ఈ విషయంపై సందేహం వ్యక్తం చేసిన మూర్తి దర్యాప్తు రిపోర్టును బహిర్గతం చేయాలని గతంలో మూర్తి డిమాండ్ చేశారు. తద్వారా సంస్థ గవర్నెన్స్ ప్రమాణాల్లో ఎక్కడ పొరబాటు జరుగుతుందో తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే రిపోర్టును బయటపెట్టాలని కోరినట్లు తాజాగా ఇన్వెస్టర్లతో అన్నారు.

ఏడాదిక్రితం మూర్తికి, బోర్డు మధ్య మొదలైన అభిప్రాయ భేదాలు రోజురోజుకూ తీవ్రతరమవుతూ వచ్చాయి. ఈనెల 18న విశాల్ సిక్కా ఇన్ఫీ సారథ్యం తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, అందుకు కారణం నారాయణమూర్తేనంటూ బోర్డు బహిరంగంగానే ఆరోపణలు చేసింది. నీలేకని ఎంట్రీ నేపథ్యంలో గతవారం శేషసాయి, విశాల్ సిక్కాతోపాటు మరో ఇద్దరు బోర్డు పదవులకు రాజీనామా చేశారు. ఇప్పటికీ ఇన్ఫోసిస్‌లో 12.75 శాతం వాటా కలిగిన ప్రమోటర్లతోపాటు 10 శాతం వాటా ఉన్న డజనుకు పైగా వ్యవస్థాగత ఇన్వెస్టర్లు నీలేకని రీఎంట్రీలో కీలకపాత్ర పోషించారు.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు వందనా సిక్కా గుడ్‌బై



ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు చెందిన ఛారిటీ విభాగం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పదవి నుంచి విశాల్ సిక్కా భార్య వందనా సిక్కా వైదొలిగారు. ఈ ఫౌండేషన్‌కు వందనా రెండున్నరేండ్లుగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇన్ఫోసిస్ బోర్డుకు విశాల్ సిక్కా రాజీనామా చేసిన నేపథ్యంలో వందన కూడా వైదొలిగినట్లు తెలుస్తున్నది.

20 ఏండ్లపాటు 9% వృద్ధితో 10 లక్షల కోట్ల డాలర్లకు ఆర్థిక వ్యవస్థ

నీతిఆయోగ్ సభ్యుడు విజయ్ కుమార్ సారస్వత్




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏటా తొమ్మిది శాతం వృద్ధి సాధించగలిగితే.. వచ్చే 20 ఏండ్లలో భారత ఆర్థికవ్యవస్థ 10.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశం ఉంటుందని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్ కుమార్ సారస్వత్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం ఐఎస్‌బీలో ఎనిమిదో డీన్ స్పీకర్ సిరీస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. 'సమ్మిళిత అభివృద్ధి.. కల్పితమా? వాస్తవమా?' అనే అంశంపై ప్రసంగించారు. భారత ఆర్థిక వ్యవస్థలో సమ్మిళిత వృద్ధి సాధనకు ప్రధాని మోదీ పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు సారస్వత్ అన్నారు. ఆధునిక ఆవిష్కరణల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసి.. వాటి ఫలాలను నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు అందించేందుకు ప్రత్యేక కృషి జరుగుతున్నదన్నారు. పేదరికాన్ని నిర్మూలించి, ప్రజల ఆదాయాన్ని పెంపొందించి, వారికి విద్య, వైద్య, ఉద్యోగాల్ని అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. హరిత అభివృద్ధి కోసం ప్రజలకు ఉపయోగపడే పలు వినూత్న నిర్ణయాలను తీసుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా అధిగమిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. ప్రపంచ దేశాలు అసంఘటిత ఆర్థిక వ్యవస్థ (ఇన్‌ఫార్మల్ ఎకానమీ) మీద నలభై శాతం దృష్టి సారిస్తే.. మన దేశంలో కేవలం 25 శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు.

డిసెంబర్ నాటికి రెనో 'క్యాప్చర్'



ముంబై, ఆగస్టు 29: ఫ్రెంచ్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ రెనో.. దేశీయ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్లోకి ప్రీమియం ఎస్‌యూవీ కారైన 'క్యాప్చర్'ను విడుదల చేయనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ సౌమిత్ తెలిపారు. ఈ కారుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. ఐదుగురు కూర్చోవడానికి వీలుండే ఈ ఎస్‌యూవీ ధర తెలుపడానికి నిరాకరించారు. చెన్నైలో ఉన్న ప్లాంట్లోనే ఈ కారును రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు.



ముంబై, ఆగస్టు 29:

ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం వార్తలతో దలాల్‌స్ట్రీట్ వర్గాలు ఉలిక్కిపడ్డారు. అమెరికాతో యుద్ధానికి కాలుదువ్వుతున్న ఈ దేశం తాజాగా ప్రయోగించిన బాలిస్టిక్ మిస్సైల్ జపాన్ మీదుగా ప్రయాణించి పసిఫిక్ సముద్రంలో పడింది. అమెరికా-ఉత్తర కొరియా మధ్య యుద్ధం ఏ సమయాన్నైనా మొదలు కావచ్చన్న భయాలతో ప్రపంచ మార్కెట్లు గజగజలాడాయి. అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా భారత స్టాక్ సూచీలు సైతం భారీ నష్టాలు నమోదు చేసుకున్నాయి. సెన్సెక్స్ 362.43 పాయింట్లు (1.14 శాతం) క్షీణించి వారం రోజుల కనిష్ఠ స్థాయి 31,388.39 వద్దకు జారుకుంది. ఈనెల 22న సూచీ 31,291.85 వద్ద ముగిసింది. ఆ తర్వాత సెన్సెక్స్‌కు ఇదే కనిష్ఠ ముగింపు స్థాయి. అంతేకాదు, జూలై 18న 363.79 పాయింట్లు నష్టపోయిన సూచీకి తర్వాత ఇదే అతిపెద్ద పతనం. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 491.97 పాయింట్లు బలపడింది. మార్కెట్లో వరుస ర్యాలీ కొనసాగిన నేపథ్యంలో మదుపర్లు ఇదే అదునుగా లాభాల స్వీకరణకు పాల్పడటం కూడా అమ్మకాల ఒత్తిడి పెరుగడానికి కారణమైంది. దాంతో తాజా సెషన్‌లో నిఫ్టీ 116.75 పాయింట్లు (1.18 శాతం) కోల్పోయి 9,796.05 వద్ద స్థిరపడింది. గడిచిన తొమ్మిదినెలల్లో సూచీకిదే అతిపెద్ద నష్టం. ప్రధాన కంపెనీలతోపాటు చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లు సైతం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దాంతో బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 0.85 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.02 శాతం తగ్గాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్ వర్గాల సంపద రూ.1.38 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. మంగళవారం నాటి ట్రేడింగ్ ముగిసేసరికి, బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,38,726.77 కోట్లు తగ్గి రూ.129,77,705 కోట్లకు పరిమితమైంది.

సెన్సెక్స్ లిస్టెడ్ షేర్లలో ఎన్‌టీపీసీ అత్యధికంగా 2.80 శాతం పతనమైంది. సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ స్టాకులు సైతం రెండు శాతానికి పైగా క్షీణించాయి. ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు ఒక శాతానికి కంటే అధికంగా నష్టపోవాల్సి వచ్చింది. రంగాలవారీగా చూస్తే.. బీఎస్ఈలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండెక్స్ 1.86 శాతం తగ్గింది. విద్యుత్, వినిగదారుల వస్తువులు, ప్రభుత్వ రంగ సంస్థల సూచీలు సైతం నేలచూపులే చూశాయి.

బీవోబీ, టాటాపవర్ 3 శాతం డౌన్

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ 'నిఫ్టీ 50' నుంచి వైదొలుగనున్న బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), టాటా పవర్, టాటా మోటార్స్ డీవీఆర్, ఏసీసీ షేర్లు తాజా ట్రేడింగ్‌లో 3 శాతం వరకు నష్టపోయాయి. సెప్టెంబర్ 29న ఈ కంపెనీలన్నీ సూచీ నుంచి వైదొలుగనున్నాయి. ఎన్ఎస్ఈలో ట్రేడింగ్ ముగిసేసరికి బీవోబీ 2.91 శాతం తగ్గగా.. టాటా పవర్ 2.4 శాతం, టాటా మోటార్స్ డీవీఆర్ 2.19 శాతం, ఏసీసీ 0.78 శాతం నష్టపోయాయి.

30 వేలు దాటిన పసిడి



న్యూఢిల్లీ, ఆగస్టు 29: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. దీంతో ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పది గ్రాముల బంగారం ధర రూ.31 వేల మార్క్‌ను దాటి రూ.30,450కి చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ఒకేరోజు రూ.550 పెరిగిందన్న మాట. బంగారంతోపాటు వెండి మరింత పెరిగింది. కిలో వెండి ధర రూ.900 ఎగబాకి రూ.41,100కి చేరుకుంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లకు మద్దతు లభించడంతో వెండి భారీగా పుంజుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధర ఏడాది గరిష్ఠ స్థాయికి చేరుకుందని బులియన్ ట్రేడర్ వెల్లడించారు. సింగపూర్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 0.90 శాతం పెరిగి 1,322.41 డాలర్లు పలికింది. గతేడాది నవంబర్ 9 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు. అలాగే ఔన్స్ వెండి 0.66 శాతం పెరిగి 17.54 డాలర్లకు చేరుకుంది.

32,320 కోట్లు కట్టండి!

వొడాఫోన్‌కు వాటావిక్రయంపై హచిసన్‌కు ఐటీ శాఖ నోటీసు




న్యూఢిల్లీ, ఆగస్టు 29: వొడాఫోన్ కేసులో హాంకాంగ్ సంస్థ హచిసన్‌కు ఆదాయం పన్ను శాఖ రూ.32,320 కోట్ల డిమాండ్ నోటీసు పంపింది. 2007లో హచిసన్.. భారత్‌లోని తన మొబైల్ వ్యాపారాన్ని బ్రిటిష్ టెలికం దిగ్గజం వొడాఫోన్ గ్రూపునకు 1,100 కోట్ల డాలర్లకు విక్రయించింది. ఈ వాటా విక్రయ ఒప్పందం ద్వారా సమకూరిన ఆదాయంపై మూలధన ఆర్జన పన్ను చెల్లించాలంటూ హచిసన్‌కు ఐటీ శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ డీల్‌కు సంబంధించి రూ.7,900 కోట్ల పన్ను, పెనాల్టీ రూపంలో మరో రూ.7,900 కోట్లతోపాటు ఇన్నాళ్లకు గాను రూ.16,430 కోట్ల వడ్డీతోసహా మొత్తం రూ.32,320 కోట్లు చెల్లించాలని నోటీసులో డిమాండ్ చేసింది. అయితే, సీకే హచిసన్ మాత్రం తమ సంస్థపై పన్ను వర్తించదని అంటున్నది. ఈ కేసులో హచిసన్‌కు పన్ను డిమాండ్ నోటీసు పంపడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు ఐటీ శాఖ వొడాఫోన్‌ను పన్ను చెల్లించాలని కోరింది.

జీఎస్టీ వసూళ్లు 92 వేల కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వస్తు, సేవా పన్ను(జీఎస్టీ) వసూళ్లు అంచనాలకుమించి నమోదయ్యాయి. అమలులోకి వచ్చిన తొలి నెలలోనే రూ.92,283 కోట్ల మేర వసూలయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. గత ఏడాది ఇదే నెలకు పరోక్ష పన్నుల వసూళ్లు రూ.68,341 కోట్లుగా నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారుల్లో 64.4 శాతం మంది జీఎస్టీ పరిధిలోకి వచ్చారని, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. పన్ను చెల్లింపుల విషయానికి వస్తే సెంట్రల్ ట్యాక్స్ కింద రూ.14,894 కోట్లు వసూలవగా, రాష్ట్ర జీఎస్టీ కింద రూ.22,722 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.47,469 కోట్లు వసూలైనట్లు మంత్రి చెప్పారు ఐజీఎస్టీ కింద వసూలైనదాంట్లో రూ.20,964 కోట్లు దిగుమతులపై రాగా, రూ.7,198 కోట్లు డిమాండ్ వస్తువులపై సెస్ విధించడం ద్వారా లభించాయి. పన్ను వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జూలైలో పన్నుల వసూళ్ల ద్వారా కేంద్రానికి రూ.48 వేల కోట్లు, రాష్ర్టాలకు రూ.43 వేల కోట్లు రావచ్చునని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంచనావేశారు. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం కంటే అధికంగా పన్ను వసూలయ్యాయని, అలాగే పన్ను చెల్లింపుల పరిధిలోకి వచ్చిన వారి సంఖ్య అమాంతం పెరిగిందన్నారు. ఇప్పటి వరకు 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారుల్లో 38.3 లక్షల మంది జీఎస్టీ కింద రిటర్నులు దాఖలు చేసినట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. అలాగే 72.33 లక్షల మంది నూతన పన్ను విధానంలోకి మారినట్లు చెప్పారు.

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



ఆసుపత్రి గదులకు జీఎస్టీ మినహాయింపు

ఆసుపత్రుల్లో రోగులు తీసుకున్న గదులకుగాను చెల్లించే కిరాయి జీఎస్టీ పరిధిలోకి రాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆసుపత్రుల్లో వివిధ రకాల సేవలపై జీఎస్టీ విధింపుపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్(సీబీఈసీ) స్పష్టతనిచ్చింది. హోటల్‌లోని గది, గెస్ట్ హౌజ్ లేదా ఇతర గదులపై చెల్లించే జీఎస్టీని పన్ను రేట్ స్లాబ్ ఆధారంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. రూ.1,000 లోపు అద్దె కలిగిన గదిపై ఎలాంటి జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ రూ.1,000 నుంచి రూ.2,500 లోపు టారిఫ్ కలిగిన గదికి 12 శాతం, రూ.2,500 నుంచి రూ.7,500 లోపు రూమ్‌పై 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రూ.7,500 కంటే అధిక అద్దె కలిగిన గదికి 28 శాతం జీఎస్టీ విధించనున్నారు. గదిలో ఉండే బెడ్‌తో కలిపి ఈ చార్జీ విధించనున్నారు. కానీ గదిలోకి ఆహారం లేదా పానియాలు, బేకరిలపై మాత్రం 5 శాతం పన్ను విధిస్తున్నట్లు ప్రకటించింది.

కార్లపై సెస్ పెంపుపై నేడు క్యాబినెట్ నిర్ణయం

జీఎస్టీ కింద మధ్య, అతిపెద్ద, ఎస్‌యూవీ కార్లపై విధిస్తున్న సెస్‌ను 15 శాతం నుంచి 25 శాతానికి పెంచే ప్రతిపాదనపై కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆర్డినెన్స్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. దాంతో సంస్థలు మళ్లీ ధరలు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



జల ఝరి

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కేంద్రం నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో గల మిట్టె జలపాతం జలకళను సంతరించుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలపాతం నిండు కుండలా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు.

-లింగాపూర్

నందిమేడారం నిర్వాసితులకు రూ. 11 లక్షల పరిహారం

- అధికారికంగా ప్రకటించిన చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్
- భూములిచ్చేందుకు ముందుకువచ్చిన రైతులు



పెద్దపల్లి జిల్లా ధర్మారంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం పెద్ద చెరువు శిఖం కింద కోల్పోతున్న పట్టా భూములకు సంబంధించి పరిహారం చెల్లింపు అంశం ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ చొరువతో కొలిక్కివచ్చింది. ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా నంది మేడారం చెరువును విస్తరిస్తున్నారు. మొదటి విడుతలో తమకు తగిన పరిహారం దక్కలేదంటూ కొందరు తమ భూమిని రెవెన్యూ శాఖ పేరిట రిజిస్ట్రేషన్ చేయలేదు. రెండో విడుతలో చామనపల్లిలో 125 ఎకరాలు, నంది మేడారంలో 67 ఎకరాలు సేకరించేందుకు అధికారులు సర్వే చేసి భూములను గుర్తించారు. పరిహారాన్ని ప్రకటిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని రైతులు తేల్చి చెప్పారు. పలుమార్లు ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ కలెక్టర్‌తో చర్చించారు. అధికారులు ఎకరానికి రూ. 10.50లక్షలు చెల్లిస్తామని చెప్పగా రైతులు ససేమిరా అన్నారు. కొప్పుల ఈశ్వర్ చొరువ తీసుకుని మంగళవారం ధర్మారంలో చామనపల్లి, నందిమేడారం రైతులతో సమావేశమయ్యారు. ఆ తరువాత మంత్రి హరీశ్‌రావుతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. మంత్రి సూచన మేరకు ఎకరానికి రూ.11 లక్షలు పరిహారం ఇస్తున్నట్టు కొప్పుల ఈశ్వర్ ప్రకటించగా అందుకు రైతులు అంగీకరించారు. ఆ వెంటనే సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, ఈటల, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



సదర్‌మాట్ కెనాల్‌కు గండి

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం మండలాల జీవనాధారమైన సదర్‌మాట్ కెనాల్‌కు మంగళవారం సాయంత్రం గండిపడింది. సదర్‌మాట్ నుంచి 12.8 కిలోమీటర్ల వద్ద, దిలావర్‌పూర్ గ్రామ శివారు ఒంటి మామిడి తూము ఒర్రెపై నిర్మించిన అండర్ టన్నెల్ అడుగు భాగంలో బుంగ పడింది. కెనాల్‌లో దాదాపు నాలుగు వందల క్యూసెక్కుల నీరు గోదావరిలో కలిసిపోయింది. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు గండి పడ్డ ప్రాంతానికి తరలి వెళ్లి కెనాల్‌కు నీటి సరఫరాను నిలిపివేశారు. బుధవారం గండిని పూడ్చనున్నట్టు అధికారులు తెలిపారు.



జన్నారంలో కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం. పక్కన మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్

385 కోట్లతో కళాశాలలకు భవనాలు

నిర్మల్/మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ఇంటర్ విద్యను పటిష్టపరిచేందుకు నాబార్డు నుంచి నిధులను తెచ్చి రూ.385 కోట్లతో కళాశాలలకు సొంత భవనాలు, అదనపు గదులను నిర్మించడంతో పాటు ఫర్నిచర్, లైబ్రరీ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా జన్నారం, కాసిపేట మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కడియం మాట్లాడుతూ మూడేండ్ల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో 60 వేల మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలల కన్నా అదనంగా చేరారన్నారు. కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనాన్ని అందించే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కార్యక్రమాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు రేఖానాయక్(ఖానాపూర్), దుర్గం చిన్నయ్య(బెల్లంపల్లి), కలెక్టర్ ఆర్వీ కర్ణన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణిగుంట ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యా విధానంలో సమూల మార్పులు

నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం విద్యా విధానంలో సమూల మార్పులు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.ఐదున్నర కోట్లతో నిర్మించిన బాల, బాలికల జూనియర్ కళాశాలల నూతన భవనాలను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం సభలో కడియం శ్రీహరి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి తెలంగాణలో జరుగుతున్నదన్నారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మూడేండ్లలో రాష్ట్రంలో 404 జూనియర్ కళాశాలలకుగాను 391 కళాశాలలకు భవనాలు నిర్మించామని, కొన్ని కళాశాలలకు సొంత భూమి లేకపోవడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతున్నదన్నారు. దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మల్‌ను రాష్ట్రంలో ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు.

రాష్ట్రంలో పలుచోట్ల వానలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. హైదరాబాద్‌లోని బేగంపేటలో భారీ వర్షం పడింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజక వర్గాల్లోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. జిల్లావ్యాప్తంగా 7.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో సగటున 15.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సగటున 19.3 సెం.మీ. వాన పడింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో జిల్లా సగటు 13.98మి.మీ. కాగా, వనపర్తి జిల్లాలో సగటున 8.3మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. పత్తి, మక్కజొన్న, జొన్న, ఆముదం, కందితోపాటు పలు పంటలు కళకళలాడుతున్నాయి. నల్లగొండ జిల్లాలోని 17 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా దామరచర్ల మండలంలో 12.3 మి.మీ., అత్యల్పంగా నాంపల్లిలో 0.3 మి.మీ. నమోదైంది. నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. సగటున 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఆర్మూర్ మండలంలో అత్యధికంగా 30.8 మి.మీ. వర్షం పడింది.




మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో పారుతున్న ఊకచెట్టు వాగు



మిర్యాలగూడ బస్‌స్టాండ్ వద్ద జలమయమైన రహదారి

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 542.440 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	20803	11023	1705	1704.07	128.72	124.56
నారాయణపూర్	11076	8487	1615	1612.14	37.646	33.73
జూరాల	3579	1808	1045	1038.91	9.66	6.190
తుంగభద్ర	17442	896	1633	1621.27	100.86	61.74
శ్రీశైలం	6574	38	885	785.00	215.807	22.31
నాగార్జునసాగర్	820	820	590	500.00	312.045	115.31
పులిచింతల	1226	0	175	125.07	45.77	5.10
ప్రకాశం బ్యారేజీ	11850	11850	56.75	56.25	3.070	2.89

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	16065	118	1522	1515.68	102.732	78.34
కడెం	2350	7509	700	698.43	7.6	7.20
ఎస్సారెస్పీ	25690	1000	1091	1070.70	90.313	30.360
సింగూరు	8849	280	1717.93	1712.11	29.91	21.11
నిజాంసాగర్	2000	72	1405	1386.00	17.803	2.641
ఎల్లంపల్లి	5111	310	485	478.51	20.175	14.54
లోయర్‌మానేరు	0	129	920	893.40	24.07	7.290
ధవళేశ్వరం	189479	189479	45	45	2.93	2.93

రైతుల శక్తిని సంఘటితం చేస్తాం

జెడ్పీ సమావేశంలో మంత్రి ఈటల



కరీంనగర్ జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తమ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నా ప్రతిపక్షాలు ప్రతీది రాజకీయం చేయాలని చూడడం దురదృష్టకరమని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ జెడ్పీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న క్రమంలో వీళ్లు కాంగ్రెస్ రైతులా?, టీఆర్‌ఎస్ రైతులా? అనేది ఎక్కడా చూడలేదన్నారు. రైతు సమన్వయ సమితుల ద్వారా కర్షకుల శక్తిని సంఘటితం చేస్తున్నామని తెలిపారు. వారికి గత బడ్జెట్‌లోనే రూ.500 కోట్లు కేటాయించామని, మరో రూ.6 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. ఈ నిధుల ద్వారా రైతులకు అనుబంధ పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైస్‌బౌల్ ఆఫ్ ఇండియాగా మారబోతున్నదన్నారు. 2018 వరకు మిడ్‌మానేరు ద్వారా మరో 24 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలకు రూ. 200 కోట్లు కేటాయించుకుని ఒక్క నెలలో పనులు పూర్తి చేశామని చెప్పారు.



మహబూబాబాద్ జిల్లా నాంచారిమడూరులో మంగళవారం 50 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గంలో మూడు వేల డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నట్టు చెప్పారు.

- తొర్రూరు, నమస్తే తెలంగాణ

ఉద్యోగులకు 8.35 వడ్డీతో గృహరుణాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ఉద్యోగులకు కేవలం 8.35 శాతం వడ్డీ రేటుతో గృహరుణాలు ఇస్తామని ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ సంబంధం తెలిపారు. పదవీ విరమణ తర్వాత కూడా చెల్లించేలా తాము ఈ పథకాన్ని రూపొందించామని మంగళవారం సచివాలయంలో సచివాలయ ఉద్యోగుల సంఘంతో కలిసి నిర్వహించిన రుణమేళాలో చెప్పారు.

పీజీటీ, టీజీటీ 'కీ' అభ్యంతరాల గడువు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌పీఎస్సీ జూలై 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన పీజీటీ (మ్యాథ్స్, బయాలజీ, ఫిజికల్ సైన్స్, సోషల్), టీజీటీ (మ్యాథ్స్, బయాలజీ) పరీక్షల ప్రిలిమినరీ 'కీ'పై అభ్యంతరాలను ఈ నెల 31 వరకు తెలుపవచ్చునని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఒక ప్రకటనలో సూచించారు.

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ నియామక ప్రక్రియపై స్టే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ నియామక ప్రక్రియపై హైకోర్టు మంగళవారం తాత్కాలిక స్టే విధించింది. నియామక ప్రక్రియ రికార్డులను తమకు సమర్పించాలని మహిళా, శిశుసంక్షేమ శాఖను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో మంగళవారం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 30.360 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి 25,690 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నదని ఏఈఈ మహేందర్ తెలిపారు. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి వరద కొనసాగుతున్నది. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 698.20 అడుగులు (7.430టీఎంసీల) వద్ద ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 2000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. పూర్తిస్థాయి నీటి మట్టం 17.802 టీఎంసీలు(1405 అడుగులు) గాను ప్రస్తుతం 1386.00 అడుగులు 2.641 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కళ్యాణి ప్రాజెక్టు 409.50 మీటర్ల లెవల్‌కు గాను 409.20 మీటర్ల మట్టానికి చేరుకున్నది. పోచారం ప్రాజెక్టులోకి 1019 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రస్తుతం 1464.00 అడుగులు 1.820 టీఎంసీల పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో 277 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో మూడు గేట్లు పూర్తిగా ఎత్తి 24,412 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద నీరు పెరుగుతున్నది. 3579 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టు నుంచి దిగువకు 11,023 క్యూసెక్కులు వదులుతున్నారు. అదే విధంగా నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 11,076 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 8487 క్యూసెక్కులుగా నమోదైంది.



కామారెడ్డి జిల్లా భిక్కనూరులో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి, చిత్రంలో మంత్రి పోచారం, ఎంపీ బీబీ పాటిల్, విప్ గంప గోవర్ధన్

బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలి

కామారెడ్డి, నమస్తే తెలంగాణ: బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి కామారెడ్డి జిల్లా భిక్కనూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ దేశంలోనే ముందున్నదన్నారు. అనంతరం మంత్రి కామారెడ్డిలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. గత ఏడాది కామారెడ్డి జిల్లా ఉపాధి హామీలో రూ.165 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మరింత ఉత్సాహంగా పని చేసి దేశంలోనే మొదటి స్థానానికి చేరుకోవాలని సూచించారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే గాదరి కిశోర్, కలెక్టర్ సురేంద్రమోహన్ తదితరులు

ప్రపంచానికే ఆదర్శం

'సంకల్పంతో కార్యసిద్ధి' కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: 'నేను తెలంగాణ రైతును' అని సగర్వంగా చెప్పుకునేలా సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ–ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంకల్పంతో కార్యసిద్ధి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమైక్యపాలనలో వ్యవసాయరంగాన్ని తీవ్రంగా దెబ్బతీశారని, దళారీ వ్యవస్థను పెంచి పోషించారని విమర్శించారు. ప్రస్తుతం ఏర్పాటవుతున్న రైతు సమన్వయ సమితులు ప్రపంచానికే ఆదర్శమన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి మేడిగడ్డ ప్రాజెక్టు పూర్తయితే సూర్యాపేట జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సురేంద్రమోహన్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్లకు పిచ్చెక్కింది: గుత్తా



నల్లగొండ, నమస్తే తెలంగాణ: 'కాంగ్రెస్ పార్టీలో వయసు మీరి కొందరు... మీరకముందే మరికొందరు పిచ్చిపట్టినట్టుగా ప్రవర్తిస్తున్నారు' అని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన నల్లగొండలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అర్జున్‌రెడ్డి సినిమా విషయంలో మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత వీ హనుమంతరావు విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో తాగునీటి అవసరాల గురించి ఎన్నడూ పట్టించుకున్న దాఖలాల్లేవని, కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ అధిష్ఠానంతో మాట్లాడకుండా ఇంటి గేట్ల దగ్గర పదవుల కోసం తచ్చాడుతున్నారని విమర్శించారు. ప్రజావసరాలను విస్మరించి పీసీసీ పదవికి పైరవీలు చేయడమే సరిపోయిందన్నారు. ఎగువ నుంచి వచ్చే నీటిలో నల్లగొండకు సైతం 0.75 టీఎంసీలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని గుత్తా తెలిపారు. పాలమూరు నుంచి నీటి విడుదల విషయంలో కాంగ్రెస్ హయాంలో జానా, ఉత్తమ్ ఏనాడూ కొట్లాడిన దాఖలాల్లేవని చెప్పారు.



ఆదిలాబాద్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జోగురామన్న

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నదని బీసీ సంక్షేమ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన పలువురు మంత్రి సమక్షంలో మంగళవారం టీఆర్‌ఎస్‌లో చేరారు. టీఆర్‌ఎస్ సర్కారు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరె రాజన్న, రైతు విభాగం నాయకుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిళ్ల సర్వే పనులు పరిశీలించిన అధికారులు

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి : తుమ్మిళ్ల ఎత్తిపోతల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, పంప్‌హౌస్ నిర్మాణం కోసం సర్వే పనులు సాగుతున్నాయి. ఈ పనులను మంగళవారం ప్రాజెక్టుల సీఈ ఖగేందర్‌తోపాటు ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. టెండర్ల ప్రక్రియ దాటిన తరువాత తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం సర్వే పనులు చకచకా సాగుతున్నాయి. వచ్చే నెల 8 లేదా 9 తేదీల్లో తుమ్మిళ్ల ఎత్తిపోతల పనులకు భూమి పూజ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లిఫ్టు పనులను ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులను ఆహ్వానించారు. ఇంకా వారి పర్యటన ఖరారు కావాల్సి ఉన్నది. వచ్చే నెలలో పనులు ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అవార్డు అందుకుంటున్న సయ్యద్ షాహిద్ హకీమ్, దేవేంద్ర జజారియా, సర్దార్ సింగ్, జ్యోతి సురేఖ, సాకేత్ మైనేని, హర్మన్‌ప్రీత్ కౌర్ (కుడి నుంచి ఎడమకు)

సైనా, సింధుకు గవర్నర్ అభినందనలు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో రజత, కాంస్య పతకాలు గెలుచుకున్న పీవీ సింధు, సైనా నెహ్వాల్‌కు రాష్ట్ర గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ అభినందనలు తెలిపారు. వీళ్లిద్దరు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన చూపి దేశ ప్రతిష్ఠను ఇనుమడింప చేశారని గవర్నర్ ప్రశంసించారు. దేశం గర్వించే స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న ఇద్దరికీ మంచి భవిష్యత్ ఉందని అన్నారు.

షెడ్యూల్‌కు తగ్గట్లు సిద్ధం కావాలి: గోపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మ్యాచ్‌ల షెడ్యూల్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. సైనా ఓటమికి షెడ్యూల్ కారణమని ఆమె కోచ్ విమల్ కుమార్ వ్యాఖ్యానించాడు. ఈ నేపథ్యంలో మంగళవారం జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్ షెడ్యూలింగ్‌పై భిన్నంగా స్పందించాడు. 'ఆటగాళ్లు టోర్నీలో మ్యాచ్‌ల జాబితాకు తగ్గట్లు సిద్ధం కావాలి. ప్రపంచ చాంపియన్‌షిప్‌లాంటి మెగా టోర్నీల్లో ఇలాంటివి సాధారణమే. ఒక్కోసారి వెంటవెంటనే మ్యాచ్‌లు ఆడాల్సి రావచ్చు. సింధు విషయంలో అదే జరిగింది. సెమీఫైనల్ అర్ధరాత్రి జరిగితే ఆ మరుసటి రోజు ఉదయమే ఫైనల్ జరిగింది. విరామం తీసుకునేందుకు సరైన సమయం లేకపోయింది. భారత కాలమానాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రసార సంస్థలు షెడ్యూల్‌ను నిర్ణయిస్తుంటాయి. దీనికితోడు స్థానిక కాలమానం ప్రకారం కూడా మ్యాచ్‌లు జరిపేందుకు నిర్వాహకులు మార్పులు చేస్తుంటారు. దానికి తగిన విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి' అని గోపీ అన్నాడు.

వచ్చే వారంలో బీసీసీఐ రాజ్యాంగ ముసాయిదా

ముంబై: బీసీసీఐ రాజ్యాంగ ముసాయిదాను వచ్చేనెల 8వరకు సిద్ధంగా ఉంచుతామని పరిపాలన కమిటీ (సీవోఏ) అధ్యక్షుడు వినోద్ రాయ్ తెలిపారు. 'రాజ్యాంగానికి సంబంధించిన పని కొనసాగుతున్నది. సెప్టెంబర్ 8న ఢిల్లీలో సమావేశం ఉంది. ఆ రోజు దీనిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం' అని రాయ్ పేర్కొన్నారు. జస్టిస్ లోధా సిఫారసులకు అనుగుణంగా బీసీసీఐకి కొత్త రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేయాలని ఈనెల 23న సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాయ్ బృందం దీనిపై కసరత్తులు మొదలుపెట్టింది. సెప్టెంబర్ 30న బీసీసీఐ ఎన్నికలు జరిపే అంశంపై మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు నిర్ణయాలపై ఇది ఆధారపడి ఉంటుందన్నారు.



ప్రపంచ బాక్సింగ్‌లో గౌరవ్‌కు పతకం ఖరారు

హంబర్గ్: చరిత్ర సృష్టించేందుకు భారత యువ బాక్సర్ గౌరవ్ బిధూరి సిద్ధమయ్యాడు. వైల్డ్‌కార్డ్ ద్వారా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన గౌరవ్ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఇలా మెగా టోర్నీలో వికాస్ కృష్ణన్(2011), విజేందర్ సింగ్(2009), శివ తాపా(2015) తర్వాత పతకం ఖాయం చేసుకున్న నాలుగో భారత బాక్సర్‌గా గౌరవ్ నిలిచాడు. మంగళవారం జరిగిన 56కిలోల క్వార్టర్స్ బౌట్‌లో గౌరవ్..బిలెల్ మహ్మది(ట్యునీషియా)పై విజయం సాధించాడు. సెమీస్‌లో డ్యూక్ రాగన్(అమెరికా)తో గౌరవ్ తలపడుతాడు.

లంక చీఫ్ సెలెక్టర్ జయసూర్య రాజీనామా!

కొలంబో: శ్రీలంక సెలెక్షన్ కమిటీ రాజీనామా చేసింది. లంక క్రీడాశాఖ సూచనల మేరకు చీఫ్ సెలెక్టర్ సనత్ జయసూర్యతోపాటు సెలెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ సెలెక్షన్ కమిటీ పదవీకాలం మే నెలలోనే ముగిసింది. కానీ మరో 6నెలల పొడిగింపు ఇచ్చారు.

రణతుంగ వివాదాస్పద వ్యాఖ్యలు

లంక మాజీ సారథి రణతుంగ.. భారత్ అభిమానులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. మూడో వన్డేలో టీమ్‌ఇండియా గెలుపునకు దగ్గరగా ఉన్నప్పుడు లంక అభిమానులు స్టేడియంలోకి వాటర్ బాటిల్స్ విసిరిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన రణతుంగ.. 'లంక అభిమానులకు క్రికెట్ అం టే చాలా ఇష్టం. జట్టు ఓటమిని తట్టుకోలేకపోయా రు. వరుస ఓటములతో ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. కాబట్టి ఈ సమయంలో లంక అభిమానులను ఒకటే కోరుతున్నా. మీరు భారత్ ప్రేక్షకుల్లాగా ప్రవర్తించకండి. ఇలాంటి సంఘటనలను మన సంస్కృతి ఒప్పుకోదు' అని వివాదాస్పదంగా వ్యాఖ్యానించాడు. శ్రీలంకతో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన 1996 ప్రపంచ కప్ సెమీస్‌లో భారత్ ఓడిపోతుంటే అభిమానులు స్టేడియంలోకి వాటర్ బాటి ల్స్ విసిరారు.



ఇక స్వర్ణమే

ప్రపంచ చాంపియన్‌షిప్ రజతపతక విజేత పీవీ సింధు

'ఒలింపిక్స్‌లో పతకం గెలిచాను.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం అందుకున్నాను.. ఇక మిగిలింది ప్రపంచ నంబర్‌వన్ కావడమే' అని అంటున్నది బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు. నంబర్‌వన్ టార్గెట్‌ను త్వరలోనే చేరుకుంటానని సింధు చెప్పింది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన సింధు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సింధు ప్రపంచ టోర్నీకి సంబంధించిన ముచ్చట్లు, భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడింది. ఆ విశేషాలేంటో ఆమె మాటల్లోనే..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఖేల్ ప్రతినిధి:

గతంలో రెండుసార్లు కాంస్య పతకాలకే పరిమితమయ్యాను. 'ఈసారి నా పతకం రంగు మారుస్తా' అని ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు బయలుదేరేముందు చెప్పాను. అనుకున్నట్లే మునుపటి కంటే ఈసారి అత్యుత్తమ ప్రదర్శన చేసి రజత పతకంతో తిరిగొచ్చాను. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సంతోషంగా, గర్వంగా ఉంది. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లాంటి మెగా ఈవెంట్లలో పోటీ చాలా తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి టోర్నీల్లో సాధించే ఏ పతకమైనా గర్వకారణమే. వచ్చేసారి కచ్చితంగా స్వర్ణ పతకం సాధిస్తానన్న విశ్వాసముంది.

సుదీర్ఘ ర్యాలీలు సత్తాకు పరీక్ష

ఫైనల్లో జపాన్ అమ్మాయి నొజొమి ఒకుహరతో పోరు అందరినీ అలరించింది. గంటా యాభై నిమిషాల పాటు అంటే అంత సుదీర్ఘంగా మ్యాచ్ బ్యాడ్మింటన్‌లో జరుగడమంటే సాధారణ విషయం కాదు. ఈస్థాయి మ్యాచ్‌ను ఆడానంటే ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. ఫైనల్లో ర్యాలీని 73 షాట్లపాటు ఆడాం. ఇంత సుదీర్ఘంగా మ్యాచ్ సాగడం బ్యాడ్మింటన్ చరిత్రలో ఇదే తొలిసారనుకుంటా. పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మ్యాచ్ ఏదైనా ఇప్పుడు ర్యాలీలు సుదీర్ఘంగా సాగుతున్నాయి. సుదీర్ఘ ర్యాలీ పోరు మనలోని మరింత సత్తాను వెలికితీస్తుంది. ఇలాంటి మ్యాచ్‌లు మనల్ని మానసికంగా, శారీరకంగా మరింత ధ్రుడంగా తయారయ్యేలా చేస్తాయి. ఇకనుంచి మ్యాచ్‌లు మరింత రసవత్తరంగా సాగుతాయి. మ్యాచ్‌లో ప్రతిపాయింట్ కోసం ఆటగాళ్ల మధ్య హోరాహోరీ పోరు ఉంటుంది.



సింధును సన్మానిస్తున్న సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్

మా ఇద్దరి మధ్య ఫైనల్ జరుగొచ్చు

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సైనా నెహ్వాల్, నేను సెమీఫైనల్స్ చేరడంతో మా ఇద్దరి మధ్యే ఫైనల్ జరుగొచ్చేమో అని అంతా భావించారు. నిజానికి అలా జరిగినా చాలా బాగుండేది. ఇద్దరు భారతీయులు ఓ మెగా ఈవెంట్‌లో ఫైనల్లో తలపడుతున్నారంటే అది మనకు గర్వకారణమే కదా! ఈసారి అవకాశం మిస్సయినా, భవిష్యత్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లో సైనా, నేను పోటీపడే అవకాశం వస్తుందనుకుంటున్నాను.

ప్రాక్టీస్‌కు చాలా సమయం..

సాధారణంగా బ్యాడ్మింటన్‌లో ఈవెంట్లు వెంటవెంటనే జరుగుతుంటాయి. ఈవారం ఓ టోర్నీలో ఆడితే, ఆ మరుసటి వారమే మరో టోర్నీ కోసం సిద్ధమవ్వాల్సి ఉంటుంది. కానీ, ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు సిద్ధమయ్యేందుకు చాలినంత సమయం దొరికింది. దాదాపు రెండునెలలుగా ప్రపంచ ఈవెంట్ కోసం చాలా ప్రాక్టీస్ చేశాం. ఇది కూడా మాకు బాగా కలిసొచ్చింది.

చైనీయులను ఓడించడంపై..

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరే క్రమంలో నాకు ఇద్దరు చైనా షట్లర్లు ఎదురుపడ్డారు. టాప్‌ఫైవ్ క్రీడాకారిణి సన్ యూ, చెన్ యుఫీలను ఓడించి తుదిపోరులో నిలిచాను. అయితే చైనా షట్లర్లంటే ప్రత్యేకమేమీ కాదు. ప్రతి క్రీడాకారునికి ఒక్కో శైలి ఉంటుంది. ఎవరి శైలికి తగ్గట్లు వాళ్లు ఆడుతుంటారు. చైనీయులు కూడా అంతే. అయినా, వాళ్లకోసం నేనేమీ ప్రత్యేకంగా ప్రణాళికలు వేసుకోను. నా సహజశైలికి తగ్గట్లుగానే ఆడుతా.

అట్టహాసంగా అవార్డుల వేడుక

'ధ్యాన్‌చంద్' పురస్కారం అందుకున్న హైదరాబాద్ సాకర్ దిగ్గజం హకీమ్

ఖేల్ రత్న స్వీకరించిన దేవేంద్ర, సర్దార్‌సింగ్

న్యూఢిల్లీ: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేళ మంగళవారం రాష్ట్రపతి భవన్ వేదికగా క్రీడా అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల మధ్య క్రీడాకారులు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. పారాలింపిక్ అథ్లెట్ దేవేంద్ర జజారియా, భారత హాకీ మాజీ కెప్టెన్ సర్దార్‌సింగ్..ప్రతిష్ఠాత్మక రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు సయ్యద్ షాహిద్ హకీమ్ ధ్యాన్‌చంద్ జీవితసాఫల్య పురస్కారాన్ని రాష్ట్రపతి నుంచి అందుకున్నాడు. 71ఏండ్ల భారత పుట్‌బాల్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. క్రీడలను ప్రోత్సాహిస్తున్నందుకు గుర్తింపుగా రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాన్ని రిలయన్స్ స్పోర్ట్స్ ఫౌండేషన్ తరపున నీతా అంబానీ అందుకున్నారు.



రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ అవార్డు అందుకుంటున్న నీతా అంబానీ

పుజార గైర్హాజరు:

అర్జున అవార్డు కోసం క్రీడాశాఖ 17 మందిని ఎంపిక చేసింది. కౌంటీల్లో ఆడేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లిన కారణంగా క్రికెటర్ పుజార అవార్డుల కార్యక్రమానికి గైర్హాజరయ్యాడు. తెలుగమ్మాయి, ఆర్చర్ జ్యోతి సురేఖ, సాకేత్ మైనేని,హర్మన్‌ప్రీత్‌కౌర్, పారాలింపిక్ అథ్లెట్లు మరియప్పన్, వరుణ్ అర్జున అందుకున్నారు.

పునరాగమనం అదిరింది

యూఎస్ ఓపెన్‌లో షరపోవా సంచలనం
రెండోర్యాంకర్ హాలెప్‌పై అద్భుత విజయం

ఆమెకు ఆటంటే ఇష్టం.. ఆ ఆటలో ఆమె ఉంటేనే అందం. కానీ.. ఆమె కోర్టులోకి అడుగుపెట్టక 19 నెలలైంది.. ఆమె రాకెట్ స్పర్శకు దూరమై చాలాకాలమే అయింది. అయినా.. టెన్నిస్‌పై మక్కువ.. రాకెట్‌పై పట్టు... తరగని అందం.. తగ్గని విశ్వాసం.. చెదరని చిరునవ్వు.. అదిరిన డ్రెస్ స్టైల్‌తో.. మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టిన రష్యా అందాల భామ మరియా షరపోవా తొలి మ్యాచ్‌లోనే సంచలనం సృష్టించింది. అగాధంలో కూరుకుపోయిన తన కెరీర్‌కు యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ విజయంతో ఘనమైన పునరాగమనం ఇచ్చింది.



న్యూయార్క్: దాదాపు ఏడాదిన్న తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన రష్యా టెన్నిస్ స్టార్ మరియా షరపోవా.. యూఎస్ ఓపెన్‌లో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. మేఘావృతమైన వాతావరణంలో వైల్డ్ కార్డు ఎంట్రీ ద్వారా తొలిసారి కోర్టులోకి అడుగుపెట్టిన ఈ ఆరడుగుల అందం.. తనకు మాత్రమే సాధ్యమైన నల్లని వస్త్రధారణలో ప్రేక్షకుల నరాల్లో కరెంట్ పుట్టించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి జరిగిన మహిళల సింగిల్స్ తొలిరౌండ్‌లో షరపోవా 6-4, 4-6, 6-3తో ప్రపంచ రెండో ర్యాంకర్, రెండోసీడ్ సిమోనా హాలెప్ (రొమేనియా)పై సంచలన విజయం సాధించింది. గంటా 36 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 30 ఏండ్ల షరపోవా.. ఓ పరిణతి చెందిన క్రీడాకారిణిగా దూకుడు, చురుకుదనంతో, భయంలేకుండా మ్యాచ్‌ను కొనసాగించింది. రెండో షాట్ నుంచే తన ఆధిపత్యాన్ని చూపెట్టిన షరపోవా.. అద్భుతమైన బ్యాక్‌హ్యాండ్ విన్నర్లతో ప్రత్యర్థిని కట్టిపడేసింది. చాలా వ్యూహాత్మకంగా ఆడిన రష్యన్ ఏ దశలోనూ హాలెప్‌పై ఒత్తిడి తగ్గించలేదు. మే నెల తర్వాత ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన షరపోవా.. 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత కేవలం 10 మ్యాచ్‌ల్లోనే బరిలోకి దిగింది. అంతకుముందు నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో ఆమెపై నిషేధం విధించారు. షరపోవాతో పాటు వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ కూడా శుభారంభం చేసింది. రికార్డుస్థాయిలో 20వ సారి యూఎస్ ఓపెన్ ఆడుతున్న వీనస్ 6-3, 3-6, 6-2తో స్లోవేకియాకు చెందిన క్వాలిఫయర్ విక్టోరియా కుజ్మోవాపై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. తన కెరీర్‌లో మొత్తం ఏడు గ్రాండ్‌స్లామ్స్‌లో రెండింటిని ఇక్కడే అందుకున్న 37ఏండ్ల వీనస్ తన తొలిమ్యాచ్‌ను 1997లో ఈ వేదికపై ఆడింది. ఇక రెండోసీడ్ హాలెప్ తరహాలో తొలిరోజే మరో టాప్ క్రీడాకారిణికి చుక్కెదురైంది. బ్రిటన్‌కు చెందిన ఏడోసీడ్ జొహన్నా కొంటాకు 4-6, 6-3, 6-4తో అన్‌సీడెడ్ అలెగ్జాండ్రా రూనిక్ (సెర్బియా) షాకిచ్చింది. ప్రపంచ నంబర్‌వన్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-1తో మాగ్దా లినెట్టె(పోలెండ్)పై వరుససెట్లలో గెలిచి రెండోరౌండ్ చేరగా, మిగతా టాప్ క్రీడాకారిణుల్లో వోజ్నియాకి 6-1, 7-5తో మైకేల్ బుజామెన్‌పై, సిబుల్కోవా 6-7(5), 6-3, 6-2తో సెపెలోవాపై గెలిచి రెండోరౌండ్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో 4వ సీడ్ జ్వెరెర్ 7-6(9), 7-5, 6-4తో డారియన్‌పై, జాన్ ఇస్నెర్ 6-1, 6-3, 4-6, 6-3తో పియెర్రె హ్యూజెస్‌పై గెలిచి రెండోరౌండ్లో అడుగుపెట్టారు.

ఇంగ్లండ్‌కు విండీస్ షాక్

లీడ్స్: వెస్టిండీస్ చిరస్మరణీయ విజయమందుకుంది. టెస్ట్‌ల్లో పరాజయాల పరంపరకు ఫుల్‌స్టాఫ్ పెడుతూ ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో 5 వికెట్ల తేడాతో భారీ గెలుపు అందుకుంది. దీంతో మూడు టెస్ట్‌ల సిరీస్ 1-1తో సమమైంది. 322 పరుగుల లక్ష్యం కోసం 5/0 ఓవర్‌నైట్ స్కోరుతో ఐదోరోజు ఆట కొనసాగించిన విండీస్.. 91.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 53 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయినప్పటికీ షాయి హోప్(118 నాటౌట్) అజేయ సెంచరీకి తోడు బ్రాత్‌వైట్(95) అర్ధసెంచరీతో రాణించారు. సెంచరీలతో అదరగొట్టిన హోప్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

భర్త గ్రాండ్‌స్లామ్ టవల్స్‌ను అలా వాడేసింది



ముంబై: గ్రాండ్‌స్లామ్స్ టోర్నీల్లో క్రీడాకారులకు మ్యాచ్‌ల మధ్యలో చెమట తుడుచుకునేందుకు టోర్నీ నిర్వాహకులు టవల్స్ ఇస్తుంటారు. వాటిని కొందరు ఆటగాళ్లు తీపిజ్ఞాపకాలుగా తమ వెంట ఇంటికి తెచ్చుకుంటారు. ఇదిగో.. ఇలాగే భారత మాజీ టెన్నిస్ స్టార్ మహేశ్ భూపతి కూడా చాలాసార్లు గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లు గెలిచిన మ్యాచ్‌లకు సంబంధించిన టవల్స్‌ను భద్రంగా ఇంట్లో దాచిపెట్టుకున్నాడు. కానీ, అతని భార్య లారాదత్తాకు మాత్రం వాటి విలువ అంతగా తెలిసినట్లు లేనట్టుంది.ఆ టవల్స్ తమ ఇంట్లో వృథాగా పడిఉన్నాయనుకుందో ఏమో.. వర్షపు నీరు తమ ఇంట్లోకి రాకుండా తలుపుకింద అడ్డుగా వాటిని ఉంచింది. దీన్ని ఫొటో తీసి మరీ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. తన భార్య చేసిన పనికి భూపతి బాధపడినట్టున్నాడు. 'నీవు జోక్ చేస్తున్నావా? ఆ టవల్స్ నా అన్నేండ్ల శ్రమకు ఫలితం' అని ట్వీట్ చేసి తన ఆవేదనను వెలిబుచ్చాడు.

కొనసాగుతున్న హార్వే బీభత్సం

లూసియానాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్




టెక్సాస్‌లోని గ్రేంజ్‌లో నీట మునిగిన నివాస ప్రాంతం; (ఇన్‌సెట్‌లో) నీట మునిగిన ఓ వాహనం వద్ద వరద బాధితుడు

హ్యూస్టన్, ఆగస్ట్ 29: అమెరికాలో హార్వే హరికేన్ వరద ప్రభావం ఏ మాత్రం తగ్గలేదు. టెక్సాస్, లూసియానాలోని నివాసప్రాంతాల్లోకి నీరు చేరడం, గంటగంటకు నీటిమట్టం పెరుగుతుండటంతో లక్షలాది ప్రజలు ఇండ్ల పైకప్పులపై చేరి సహాయంకోసం ఎదురు చూస్తున్నారు. వరదలవల్ల సోమవారం ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురితో సహా మొత్తం పది మంది మృతి చెందారు. హ్యూస్టన్, న్యూఆర్లియన్స్ నగరాల్లో 1.3కోట్ల మంది ఇప్పటికీ వరదల్లో చిక్కుకుని ఉన్నారు. మరో 60.96 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని జాతీయ వాతావరణ సంస్థ (ఎన్‌డబ్ల్యూఎస్) ప్రకటించింది. హ్యూస్టన్‌లోని ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలలు, ఎయిర్‌పోర్టులను మూసివేశారు. ఇప్పటికే 5,500 మందిని సహాయ శిబిరాలకు తరలించామని హ్యూస్టన్ మేయర్ తెలిపారు. మరో 30వేల మంది సహాయం కోసం ఎదురు చూస్తున్నారని భావిస్తున్నారు. 12వేల మంది నేషనల్ గార్డులు, 16 విమానాలు నిరంతరం సహాయ చర్యలను కొనసాగిస్తున్నాయని టెక్సాస్ గవర్నర్ చెప్పారు. విద్యుత్తు సదుపాయాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లూసియానాలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. వరదల వల్ల ఆయిల్, గ్యాస్ పరిశ్రమలకు బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లిందని, దెబ్బతిన్న పరిశ్రమలను పునరుద్ధరించేందుకు చాలా సమయం పడుతుందని, పెట్రో ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడేందుకు చాలా సమయం పడుతుందని, అమెరికన్లు ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ ఐక్యతను చాటుకుంటున్నారని, సహాయ సిబ్బంది బాగా పనిచేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

భారతీయ విద్యార్థులు సురక్షితం

వరదల్లో చిక్కుకున్న యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్‌కు చెందిన 200 మంది భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. భారీ వరదల కారణంగా విద్యార్థులు ఉండే భవనాలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. దీంతో వారు అపార్ట్‌మెంట్ పైకప్పు మీద ఉండిపోయారు. హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ అనుపమ్ రాయ్ స్వయంగా అపార్టుమెంట్ వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఫేస్‌బుక్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఇండియన్ అమెరికన్ సంస్థలు వారికి భోజనం, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాయి. దవాఖానలో చికిత్స పొందుతున్న ఏఅండ్ఎం యూనివర్సిటీకి చెందిన ఇద్దరు భారతీయ విద్యార్థులు నిఖిల్ భాటియా, షాలినీల ఆరోగ్యపరిస్థితి విషమంగానే ఉంది. శనివారం బ్రయాన్ సరస్సులో ఈతకు వెళ్లి వీరిద్దరు ప్రమాదంలో చిక్కుకున్నారు. వారిని రక్షించిన పోలీసులు సెయింట్ జోసెఫ్ దవాఖానలో చేర్పించారు. హ్యూస్టన్‌లో లక్ష మంది భారతీయ అమెరికన్లు నివసిస్తున్నారు. వీరి నివాసాలు పూర్తిగా వరద జలాలలో నిండిపోయాయి. కొంత మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లగా.. మరికొందరు సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఫలించిన ముందస్తు చర్యలు

■ హర్యానా, పంజాబ్‌లలో శాంతి

■ డేరాబాబా కేసు తీర్పు అనంతరం సాధారణ పరిస్థితులు



సిర్సాలో భద్రతా దళాల గస్తీ

చండీగఢ్: గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని హర్యానా, పంజాబ్ రాష్ర్టాల ప్రభుత్వాలు చేపట్టిన ముందస్తు బందోబస్తు చర్యలు సత్ఫలితాన్ని ఇచ్చాయి. ఇద్దరు సాధ్వీలపై లైంగికదాడి కేసులో డేరా సచ్చాసౌదా అధిపతి గుర్మీత్ రాంరహీం సింగ్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించిన మరుసటి రోజు ఎలాంటి ఆందోళనలూ చెలరేగలేదు. గతంలో ఆందోళనలు పెచ్చరిల్లిన ప్రాంతాల్లో మంగళవారం ప్రశాంతత నెలకొన్నది. సాధారణ జనజీవనం సాఫీగా సాగిపోయింది. రెండురాష్ర్టాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. సిర్సాలో 12 గంటలపాటు విధించిన కర్ఫ్యూను మంగళవారం ఉదయం ఏడుగంటలకు ఎత్తివేశారు. పంచ్‌కుల, కైతాల్‌సహా హర్యానాలోని పలుపట్టణాల్లో ఉదయం నుంచి కర్ఫ్యూ ఎత్తివేశారు. హర్యానా, పంజాబ్ రాష్ర్టాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన డేరాబాబా అనుచరులు ఆ సంస్థ ప్రధానకేంద్రమైన సిర్సా వద్ద భారీగా గుమిగూడారు. వారిని తమ స్వస్థలాలకు ప్రత్యేక వాహనాల్లో అధికారులు పంపించి వేశారు.

డేరాచీఫ్ అకృత్యాలకు ఎంతోమంది బలి

పరువు పోతుందని నోరు తెరవని బాధితులు ■ సాక్ష్యం చెప్పినవాళ్లకు వేధింపులు

డేరా బాబా వారసత్వంపై చర్చ ■ 18 మంది యువతులకు పునరావాసం

కురుక్షేత్ర, ఆగస్టు 28: డేరా సచ్చాసౌదా అధిపతి కటకటాలోకి వెళ్లేందుకు రెండు లైంగికదాడి కేసులే కారణమయ్యాయి. కానీ బాధితుల సంఖ్య మాత్రం రెండుకే పరిమితం కాదనేది బహిరంగ రహస్యమే. ఆ రెండు కేసుల్లో ముందుకు వచ్చి సాక్ష్యం చెప్పిన సాధ్వుల తరహాలో అందరూ నోరువిప్పకపోవడమే రాంరహీంసింగ్ ఆటలు సాగడానికి కారణమని తెలుస్తున్నది. సంఘంలో పరువు పోతుందని చాలామంది బాధితులు గప్‌చుప్‌గా ఉండిపోయారు. న్యాయపోరాటం జరిపిన సాధ్వులకు మాత్రం జీవితం కత్తిమీద సాములా గడిచిపోయింది. కోర్టు ముందుకు వచ్చి సాక్ష్యం చెప్పిన ఓ సాధ్వి గత 15 సంవత్సరాలుగా నరకం అనుభవించారు. ఆమె అన్నను డేరా అనుచరులు హత్య చేశారు. బాబాకు భారీ జైలుశిక్ష పడడంపై ఆమె స్వగ్రామంలో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 17 ఏండ్ల క్రితం డేరాలో పనిచేసేందుకు వెళ్లిన ఆమె గుర్మీత్‌రాంరహీంసింగ్ కామదాహానికి బలయ్యారు. తల్లిదండ్రులకు చెప్పుకుంటే పరువు పోతుందని ఆమె నోరు నొక్కారు. గుట్టుచప్పుడు కాకుండా ఊరికి తీసుకుపోయారు. అజ్ఞాతలేఖ ఆధారంగా సీబీఐ దర్యాప్తు మొదలు కావడంతో ఆమె వాంగ్మూలం ఇవ్వడానికి ధైర్యంగా ముందుకు వచ్చారు. డేరా అధినేత పెద్దసంఖ్యలో అమ్మాయిలను లొంగదీసుకునేవాడు. పరువు పోతుందని ఎవరూ ఫిర్యాదు చేసేవారు కాదని అని బాధితురాలైన సాధ్వి సీబీఐకి చెప్పారు. డేరా అనుయాయుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయినవారికీ న్యాయం జరుగాల్సిన సమయం వచ్చిందని హత్యకు గురైన సాధ్వి సోదరుని బావమరిది అన్నారు. మరింతమంది బాధితులు సాక్ష్యం చెప్పేందుకు ముందుకు వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంతో శక్తిమంతునిగా పేరున్న డేరా అధిపతికి శిక్ష పడడంతో న్యాయవ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలుగుతున్నదని ఆయన అన్నారు.

వారసుని కోసం అన్వేషణ

డేరా బాబా జైలుపాలు కావడంతో ఆయన స్థానంలో డేరా పెద్దగా ఎవరిని నియమించాలనే విషయంలో చర్చోపచర్చలు జరుగుతున్నట్టు తెలిసింది. కొడుకు జస్మీత్, పెంపుడు కూతురు హనీప్రీత్, డేరా చైర్‌పర్సన్ విపాసన ఇన్సాన్‌ల పేర్లు వినవస్తున్నాయి. ముప్పయ్యోవడిలో ఉన్న జస్మీత్ పంజాబ్ మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే కుమార్తెను పెండ్లి చేసుకున్నాడు. అతడు చీఫ్ ఐతే కుటుంబ వారసత్వ సంప్రదాయం నెలకొల్పినట్టు అవుతుంది. హనీప్రీత్ రాంరహీంసింగ్‌కు అత్యంత సన్నిహితురాలిగా పేరుంది. కోర్టు తీర్పునకు హాజరయ్యేందుకు వచ్చిన రాంరహీం వెంట ఆమె ఉన్నారు. ఇక ప్రస్తుతం డేరా వ్యవహారాలు చూస్తున్న విపాసన ఇన్సాన్‌కు కూడా అవకాశాలు ఎక్కువే ఉన్నాయని తెలుస్తున్నది. డేరా యాజమాన్యం మాత్రం ఈ ఊహాగానాలను కొట్టివేస్తున్నది. ప్రస్తుతం కోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్లడం తమ ముందున్న ముఖ్యకర్తవ్యమని అంటున్నది. మరోవైపు హర్యానా భద్రతా యంత్రాంగం సైన్యం సహాయంతో సిర్సాలోని డేరాను ఖాళీ చేయించే పనిని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నది. లోపల ఉండిపోయిన 18 మంది యువతులను అధికారులు బయటకు రప్పించి వైద్య పరీక్షలు జరిపి బాలల రక్షణ కేంద్రాలకు పంపించారు.

బాబాలకు చెడ్డపేరు..రాందేవ్ ఆవేదన

ఇటీవల కొందరు ఆధ్యాత్మికవేత్తల రాసలీలలతో బాబాలందరికీ చెడ్డపేరు వస్తున్నదని యోగాగురు రాందేవ్‌బాబా ఆవేదన వ్యక్తంచేశారు. కొందరుచేసిన తప్పులకు యావత్ సంతు వ్యవస్థను చెడ్డగా చూడొద్దని అన్నారు.

బువ్వ ముట్టక జైలు గదిలో పచార్లు

శిక్ష ఖరారైన తర్వాత పులిలాంటి రాంరహీం సింగ్ పిల్లిలా మారిపోయాడు. జైలుగదిలో మొదటి రోజు ఎవరితోనూ మాట్లాడకుండా ముభావంగా ఉండిపోయాడు. సోమవారం రాత్రి అన్నం ముట్టలేదు. మంచినీళ్లతో సరిపెట్టాడు. మంగళవారం ఉదయం పాలు మాత్రమే తీసుకున్నాడు. రోహతక్ శివార్లలోని సునారియా జైలులోని పరిశీలక గదిలో ఆయనను ఉంచారు.

పకడ్బందీగా కొత్త మద్యం పాలసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో నూతన మద్యం పాలసీని అధికారులు పకడ్బందీగా రూపొందిస్తున్నారు. ప్రస్తుత లిక్కర్ మార్కెట్ పరిస్థితులు, జరుగుతున్న వ్యాపారం, వస్తున్న ఆదాయం, సుప్రీంకోర్టు ఆంక్షలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అధికారులు ఇప్పటికే ముసాయిదా పాలసీని రూపొందించారని, మరో వారం రోజుల్లో దీనిని ఖరారు చేసి ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపించనున్నారని తెలిసింది. పాత విధానంలో పలుమార్పులతో కొత్త మద్యం పాలసీ తయారు చేశారని సమాచారం. ఇందులో లైసెన్స్ ఫీజులు పెంచే ప్రతిపాదనలు ఇంకా ఖరారు కాలేదని, మార్కెట్ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. ఇప్పుడు ఆరు అంచెలుగా ఉన్న స్లాబ్ రేట్లను కొత్త విధానంలో నాలుగంచెలకు కుదించే అవకాశం ఉంది. ఇపుడున్న మాదిరిగానే లైసెన్స్ గడువును రెండేండ్లుగానే ఉంచుతారు.గతంలో మాదిరిగా మిగులు మద్యం షాపులు ఉండకుండా చూడడంతోపాటు ఇప్పుడున్న అన్ని షాపులు పని చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

గోరఖ్‌పూర్ దవాఖానలో ఆగని మరణాలు

■ మెదడువాపుతో ఏడుగురు పిల్లల మృతి

గోరఖ్‌పూర్: ఇటీవల 105మంది చిన్నారులు మృతిచెందిన ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్‌డీ దవాఖానలో మంగళవారం మరో ఏడుగురు పిల్లలు మరణించారు. మెదడువాపుతో బాధపడుతున్న ఏడుగురు పిల్లలు 48గంటల వ్యవధిలో మృతిచెందినట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. గోరఖ్‌పూర్‌లో పిల్లలు మృత్యువాత పడిన తర్వాత రాష్ట్రప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నది. అయినప్పటికీ పిల్లల మరణాలు ఆగలేదు. ఆక్సిజన్ కొరత కారణంగా ఇటీవల చిన్నారులు మృతిచెందారని, నిధుల వినియోగం అస్తవ్యస్తంగా ఉందని జిల్లా మేజిస్ట్రేట్ ఆర్ రౌటెలా నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే.

'వైవాహిక లైంగికదాడి' భావన సరికాదు

■ ఢిల్లీ హైకోర్టులో కేంద్రం వాదన

న్యూఢిల్లీ: భర్త అయినా సరే భార్యకు ఇష్టం లేనిదే ఆమెతో శారీరక సౌఖ్యాన్ని పంచుకోరాదని, ఒకవేళ అతను ఆమెను బలవంతం చేస్తే దానిని వైవాహిక లైంగికదాడి (మ్యారిటల్ రేప్) నేరంగా పరిగణించి అతనిని శిక్షించాలన్న మహిళా సంఘాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. భార్యాభర్తల మధ్య రేప్ అనే భావనను ప్రవేశపెడితే వివాహవ్యవస్థ దెబ్బతింటుందని అభిప్రాయపడింది. అంతేకాదు ఆ మేరకు చట్టం చేస్తే దానిని ఒక సాధనంగా వినియోగించుకుని భార్యలు భర్తలను వేధించే అవకాశం ఉంటుందని పేర్కొంది. దీనికి సంబంధించిన కేసు ఢిల్లీ హైకోర్టులో విచారణకు వచ్చినపుడు కేంద్రం మంగళవారం ఈ మేరకు అఫిడవిట్‌లో తన అభిప్రాయాన్ని తెలియజేసింది. భార్యాభర్తల మధ్య రేప్ అనే వివాదాన్ని ప్రస్తుతం ఉన్న విధానంలోనే పరిశీలించవలసి ఉంటుందని పేర్కొంది.

మావోయిస్టులతో ఇప్పటికీ సమస్యే: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: గడిచిన నాలుగైదేండ్లతో పోలిస్తే మావోయిస్టుల సమస్య తగ్గినప్పటికీ దేశ అంతర్గత భద్రతకు వాళ్లతో ఇప్పటికీ ప్రమాదమేనని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అయినప్పటికీ కేంద్రప్రభుత్వం అప్రమత్తంగానే ఉన్నదని చెప్పారు. మావోయిస్టు సమస్యను ఎదుర్కోడానికి పారామిలిటరీ బలగాలను పెంచడంతోపాటు నిఘా వ్యవస్థను, రాష్ర్టాల పోలీసు బలగాల సమాచార వ్యవస్థను కట్టుదిట్టం చేశామని పేర్కొన్నారు. ఎంపీలతో కూడిన సంప్రదింపుల కమిటీ సమావేశంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. మావోయిస్టు సమస్య తాజా పరిస్థితి, దీన్ని ఎదుర్కోడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. పది రాష్ర్టాల్లో మావోయిస్టుల సమస్య ఉన్నదని, అందులోని 35 జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నందున వాటిని మావోయిస్టు ప్రభావిత జిల్లాలుగా గుర్తించినట్లు రాజ్‌నాథ్ తెలిపారు.

ప్రార్థనామందిరాలను పునరుద్ధరించొద్దు

■ 2002 గుజరాత్ అల్లర్ల కేసులో సుప్రీంకోర్టు తీర్పు


న్యూఢిల్లీ, ఆగస్టు 29: గోద్రా ఘటన తర్వాత గుజరాత్‌లో చెలరేగిన అల్లర్లలో దెబ్బతిన్న ప్రార్థనామందిరాలను, ఆరాధనాస్థలాలను పునరుద్ధరించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనంటూ గుజరాత్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. నాటి అల్లర్ల సమయంలో దెబ్బతిన్న మత కట్టడాల మరమ్మతు, పునర్నిర్మాణ పనులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ధర్మాసనం తీర్పు చెబుతూ పరిహారం అందజేస్తే చాలని, మత కట్టడాలను ప్రభుత్వం పునర్నిర్మించి ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంటూ గుజరాత్ హైకోర్టు ఆదేశాలను కొట్టివేసింది.

'కవాటాల' మరమ్మత్తు, మార్పిడితో 'గుండె'కు కొత్త ఊపిరి

యశోద హాస్పిటల్స్‌లో ప్రపంచస్థాయి హార్ట్ 'వాల్వ్' సర్జరీలు మరియు రీప్లేస్‌మెంట్స్

యశోద హార్ట్ ఇనిస్టిట్యూట్
యశోద హాస్పిటల్స్ - హైదరాబాద్
సికింద్రాబాద్ - సోమాజిగూడ - మలక్ పేట్
ఫోన్: 81210 22333

శరీర అవయవాలన్నింటికీ రక్తం సరఫరాచేస్తుండే మన గుండె ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించటంలో దానిలోని కవాటాలు (వాల్వ్) కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటి ఏర్పాటు, పనితీరు వల్ల గుండెలో రక్తం ఒక దిశలో మాత్రమే ప్రవహిస్తుంది. గుండెలోని వేర్వేరు గదులలోకి చేరిన మంచి (ఆక్సీజన్‌తో కూడిన) రక్తం, అపరిశుద్ధ (కార్బన్ డై ఆక్సైడ్ కలిసిన) రక్తం కలిసి పోకుండా నిర్దిష్టమైన దారిలో ప్రవహించటాన్ని దానిలోని కవాటాలు నియంత్రిస్తుంటాయి. గుండె స్పందించిన ప్రతీసారి దాని వేర్వేరు గదుల్లో వత్తిడి మారి ఈ కవాటాలు తెరుచుకోవటం, మూసుకునేందుకు కారణం అవుతుంది. ఈ కవాటాలకు తలుపుల లాగా ఉండే కప్స్ గుండె ఒక గదిలోనించి మరోగదిలోకి మాత్రమే రక్త ప్రవాహాన్ని అనుమతిస్తాయి తప్పించి వెనుకకు రానివ్వవు. మన గుండెలో నాలుగు కవాటాలు ఉంటాయి. అవి: ట్రైకుస్పిడ్ వాల్వ్, పల్మనరీ వాల్వ్, మిట్రల్ వాల్వ్, అరోటిక్ వాల్వ్. ఒక వ్యక్తి జీవితకాలంలో మొత్తం మూడు వందల కోట్ల సార్లు కొట్టుకునే గుండెలో భాగంగా ఇవి చాలా దృఢంగా, సమర్థంగా పనిచేసే రీతిలో నిర్మాణమయి ఉంటాయి.



గుండె కవాట వ్యాధులు:

రోజుకు 7600 లీ. రక్తాన్ని పంప్ చేసే గుండె తాలూకు కవాటాలు దృఢంగా ఉండటమే కాకుండా, సమర్థంగా పనిచేయాల్సి ఉంటుంది. అయితే కొన్నిసార్లు వ్యాధుల కారణంగా అనారోగ్యం పాలవుతుంటాయి. కవాటాలు తెరుచుకోవటం, మూసుకోవటంలో సమస్యలు తలెత్తుతాయి. కవాటం పూర్తిగా తెరుచుకోకపోవటం రక్తం ముందుకు ప్రవహించటానికి ఆటంకం కలిగిస్తుంది. సరిగా మూసుకోకపోతే రక్తం వెనుకకు రావటం మొదలవుతుంది. సాధారణంగా గుండె ఎడమ వైపున ఉండే మిట్రల్ (పై - క్రింది గదుల మధ్య) వాల్వ్, అరోటిక్ (ఎడమ కింది గది - అరోటా మధ్య) వాల్వ్ అనారోగ్యానికి గురయి గుండె సమస్యలకు కారణం అవుతుంటాయి. మనదేశంలో రుమాటిక్ ఫీవర్ వల్ల పెద్ద సంఖ్యలో పిలల్లు, పెద్దవాళ్లకు గుండెకవాటాల సమస్య ఎదురవుతున్నాయి. గుండెపోటు, హై బి.పి (అధిక రక్తపోటు), వయస్సు పైబడిన దశలో కవాటాల కణజాలం క్షీణించటం, ఇన్ఫెక్షన్లు కూడా గుండె కవాటాలను దెబ్బతీస్తాయి. గుండె కవాటాల సమస్య ప్రారంభ దశలో ఉన్నట్లయితే డాక్టర్లు మందులు సిఫార్సు చేయటం ద్వారా పరిష్కరించగలుగుతారు. సమస్య తీవ్రంగా ఉన్న పక్షంలో శస్త్రచికిత్స ద్వారా ఆ కవాటాలను మరమత్తుచేయటం లేదా మార్చివేయటం అనివార్యం అవుతుంది.

గుండె కవాటాల శస్త్ర చికిత్స

మందులు వాడినప్పుడే గుండె కవాటాల పనితీరులో సమస్యలు పరిష్కారమయి, పరిస్థితి మెరుగు పడనపుడు శస్త్రచికిత్సను సిఫార్సు చేసార్తు. గుండె కవాటం మరమ్మత్తు చేయటమా లేక మరోదానిని అమర్చటమా అన్నది ఆపరేషన్ గదిలో మాత్రమే నిర్ణయం చేయగలుగుతారు. ఈ సర్జరీ ద్వారా డాక్టర్లు గుండె కవాటానికి ఎదురవుతున్న ఆటంకాలను తొలగించటం ద్వారా దానిని మరమ్మత్తు చేస్తారు. కవాటం మరమ్మత్తులో కవాటం చుట్టూతా ఓ రింగును అమర్చి కుట్లువేయటం ద్వారా దానిని దృఢంగా తయారుచేస్తారు. కవాటంలోని మిగిలిన భాగాలను తగ్గించటం, విడదీయటం, దృఢపరచి అది సక్రమంగా తెరుచుకుని, మూసుకునేట్లు చేయగలుగుతారు. ఈ విధంగా రక్తం లీకవటం నిలిచిపోతుంది. మరమ్మత్తు చేయటం వల్ల సహజమైన గుండె కవాటాన్ని కాపాడటం సాధ్యపడుతుంది. అయితే కవాటం మరమ్మత్తుచేయలేని స్థితికి చేరుకుని ఉంటే దానిని తొలగించి ఆ స్థానంలో కొత్త కృతిమ కవాటాన్ని అమర్చాల్సి ఉంటుంది. రెండు రకాల కృత్రిమ కవాటాలు -యాంత్రిక కవాటాలు, జీవసంబంధిత కవాటాలు ఉపయోగంలో ఉన్నాయి.

యాంత్రిక (మెకానికల్) గుండె కవాటాలు

సాధారణంగా వీటిని లోహంతో తయాచేస్తారు. ప్లాస్టిక్, కార్బన్‌తో రూపొందించినవి కూడా అందుబాటులో ఉంటాయి. ఇవి దృఢంగా, చాలా కాలం మన్నేట్లుగా ఉంటాయి. అయితే వీటికి రక్తం అతుక్కునే అవకాశం ఉండటం వల్ల మెకానికల్ గుండె కవాటాలు రక్తం గడ్డకట్టడానికి కారణం అవుతున్నట్లు గుర్తించారు. అందువల్ల ఈ కవాటాలను అమర్చుకున్న పేషంట్లు రక్తాన్ని పలుచబరచే మందులను జీవితకాలంపాటు వాడాల్సి ఉంటుంది. అదేసమయంలో ఆకు కూరలకు, విటమిన్ 'కె' కూడిన పదార్థాలకు కూడా దూరంగా ఉండాలి. యాభై సంవత్సరాలకు లోపు వయస్సులో పేషంట్లకు గుండె కవాటాలను మార్చాల్సిన పరిస్థితి ఏర్పడితే మేము ఈ యాంత్రిక కవాటాలనే సిఫార్సు చేస్తుంటామని యశోద హాస్పిటల్స్‌లోని యశోద హార్ట్ ఇనిస్టిటూట్‌కు చెందిన వైద్య నిపుణులు చెప్పారు.

జీవసంబంధిత (టిష్యూ) గుండె కవాటాలు

వీటిని ఆవులు, పందుల వంటి జంతువుల కణజాలం (జెనోగ్రాఫ్ట్)తో తయారు చేస్తారు. అరుదుగా కొన్ని సందర్భాలలో పేషంట్ శరీరం నుంచే సేకరించిన కణజాలంతో (ఆటోగ్రాఫ్ట్) కవాటాలను తయారుచేసి అమరుస్తారు. ఈరకంగా జీవసంబంధిత కవాటాలు అమర్చిన పేషంట్లు రక్తాన్ని పలుచబరచే మందులు వాడాల్సిన అవసరం ఉండదు. తరచూ డాక్టరును సంప్రదించాల్సిన అవసరమూ రాదు. అయితే ఈ కవాటాలు యాంత్రిక కవాటాల అంతటి దృఢమైనవి కావు. అందువల్ల పది నుంచి పదిహేను సంవత్సరాల మధ్య మార్చుకోవలసి వస్తుంది. పిల్లలు, యువజనులలో జీవసంబంధిత గుండె కవాటాలు మరింత వేగంగా విచ్ఛినమవుతుంటాయి. అందువల్ల సాధారణంగా ఈ రకమైన కవాటాలను 50 సంవత్సరాల వయ్సుసు పైబడిన వారిలో అమరుస్తుంటారు.

తక్కువ కోతతో గుండె కవాటాల శస్త్రచికిత్స

కవాటాల మరమ్మత్తు, మార్పిడికి మినిమల్లీ ఇన్వేసివ్ (శరీరంపైన తక్కువ కోతతో) శస్త్రచికిత్స అందుబాటులోకి వచ్చింది. దీనిలో సర్జరీ నొప్పి కనీస స్థాయికి తగ్గటమే కాకుండా ఆసుపత్రిలో ఉండాల్సిన సమయమూ తగ్గుతుంది. ఇన్ఫెక్షన్ల ప్రమాదం తప్పి పేషంట్ వేగంగా కోలుకోగలుతారు. మినిమల్లీ ఇన్వేసివ్ హార్ట్ వాల్వ్ సర్జరీల నిర్వహణకు సంబంధించి దేశంలోనే సుదీర్ఘ అనుభవం ఉన్న వైద్యుల బృందం తమ వద్ద ఉందని, ఈ సర్జరీలో ఇతర వైద్యులకు శిక్షణ ఇచ్చేందుకు దేశవిదేశాలలో తాము వర్క్‌షాప్‌లను కూడా నిర్వహిస్తున్నామని యశోద హార్ట్ ఇనిస్టిట్యూట్ వైద్యనిపుణులు చెప్పారు. గుండె వ్యాధుల చికిత్స కోసం తమ ఇనిస్టిట్యూట్‌లో ప్రపంచస్థాయి సదుపాయాలను అభివృద్ధి చేశారు.అత్యాధునిక వైద్యపరికరాలు ఉపయోగిస్తున్నారు. అన్నిరకాల గుండె ఆపరేషన్ల నిర్వహణకుగాను యశోద హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో సెంటర్ ఫర్ కార్డియాక్ సర్జరీ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. దేశంలో మొట్టమొదటి 128 స్లైస్ డ్యూయల్ సోర్స్ సి.టి.స్కాన్, డెడికేటెడ్ కార్డియాక్ ఎం.ఆర్.ఐ. పెట్ స్కాన్, 3డీ & కాంట్రాస్ట్ ఎఖోకార్డియోగ్రఫీ వంటి అత్యాధునిక వైద్యసౌకర్యాలు, అత్యంత అనుభవజ్ఞులైన కార్డియో థొరాసిక్ సర్జన్ల కలయికతో అన్ని రకాల గుండె వ్యాధుల చికిత్సలో భాగమైన అన్నిరకాల సర్జరీలో రికార్డు స్థాయిలో 98.7 సక్సెస్ రేటును సాధించగలిగారు.

సర్జరీ తరువాత...

శస్త్రచికిత్స పూర్తయిన తరువాత పేషంటును పోస్ట్ సర్జరీ కేర్ యూనిట్‌కు తరలిస్తారు. గుండె ఆపరేషన్లు చేయించుకున్న వారు మత్తుమందు (అనెస్థిషియా) ప్రభావం నుంచి నాలుగైదు గంటలలో పూర్తిగా కోలుకునేందుకు అక్కడ ఏర్పాట్లుంటాయి. శస్త్రచికిత్స కోసం అమర్చిన డెయినేజ్ కాథటర్లు తొలగించి, పేషంట్ సంతృప్తికరంగా కోలుకుంటున్నట్లు నిర్ధారించుకుని అవసరమైన ఏర్పాట్లు ఉన్న కార్డియాక్ రికవరీ గదిలోకి మారుస్తారు. గుండె కవాటాలా సర్జరీ చేయించుకున్న పేషంట్లను సాధారణంగా నాలుగైదురోజులపాటు ఆస్పత్రిలో ఉండాల్సిందిగా సిఫార్సు చేస్తారు. ఇంటికి వెళ్లిన తరువాత కొంతకాలంపాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఎంత త్వరగా కోలుకుని సాధారణ జీవితం గడపగలరన్న అంశం సర్జరీకి ముందు పేషంట్ ఆరోగ్యం పైన ఆధారపడి ఉంటుంది. ఇతర ఆరోగ్య సమస్యలు ఉండని పక్షంలో నాలుగు నుంచి ఆరు వారాలలో పూర్తిగా కోలుకుని వృత్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టగలుగుతారు. శారీరకంగా భాగా అలసట కలిగించే పనులను చేసేందుకు మాత్రం మరింత కాలం వేచి ఉండాల్సి వస్తుంది.